
సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


**ఎంపిలను కలిసేందుకు యూత్ లీడర్లను అనుమతించేదాకా దీక్ష**

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మరో సందేశం విడుదల




సంపుటి 29, సంచిక: 32 | మంగళవారం | 21-07-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


# సిజెపి ‘పార్లమెంట్ మార్చ్’తో రణరంగంగా మారిన ఢిల్లీ



## పోలీసుల వీరంగం

- పలుదారుల్లో పార్లమెంటు వీధికి చేరిన యువత
- వేలాది మంది రోజంతా రోడ్డుపైనే నిరసనలు
- కర్కశంగా పోలీసుల లాఠీచార్జీ, బాష్పవాయువు ప్రయోగం
- పలు వీధుల్లో ట్రాఫిక్ జామ్‌తో ప్రజల అవస్థలు
- అభిజీత్ దీప్కే అరెస్టు
- నడ్డాతో సిజెపి ప్రతినిధుల చర్చలు
- 23 రోజుల నిరశన తదుపరి చర్చలకు సిద్ధపడిన మొండి ప్రభుత్వం
- సిజెపి దీక్షాశిబిరం తొలగింపు
- ట్రక్కుపైనే కొనసాగిన దీక్ష


### విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై నోరుమెదపని మోదీ

**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అక్రమాలకు నిరసనగా.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన ‘చలో పార్లమెంట్ మార్చ్’ ఢిల్లీ వీధుల్లో తీవ్ర రణరంగంగా మారింది. సిజెపి మద్దతుదారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది, సిజెపి కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారిని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు లాఠీఛార్జ్ చేశాయి. టియర్ గ్యాస్ ప్రయోగించారు. పలువురిని అరెస్టు చేశారు. అనేక మంది నిరసనకారులకు తీవ్ర గాయాలయ్యాయి. మరోవైపు, పార్లమెంట్‌కు వెళ్లే అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. నిరాహారదీక్ష చేస్తున్న సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దీక్ష విరమించిన తరువాత ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 23 రోజుల నిరాహారదీక్ష తదుపరి చర్చలకు మోదీ ప్రభుత్వం సిద్ధపడింది. కాగా, సిజెపి నేతృత్వంలో చేపట్టిన ‘పార్లమెంట్ మార్చ్’ ను అడ్డుకుని నిరసనకారులపై లాఠీచార్జ్ చేయడంపై పార్లమెంట్ లోపల ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేశారు. సభ్యుల నిరసనల మధ్య లోక్‌సభ, రాజ్యసభలు పదేపదే వాయిదా పడ్డాయి. ఇంత జరుగుతున్నా విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై ప్రధాని మోదీ నోరు మెదపలేదు.

ఇళ్లలోంచి దొంగచాటుగా బయటకు వచ్చిన పిల్లలు, రాష్ట్రాలు దాటి ప్రయాణించి వచ్చిన వృద్ధులు, ప్లకార్డులు పట్టుకున్న విద్యార్థులతో సహా వేలాది మంది సోమవారం ఢిల్లీలో సిజెపి చేపట్టిన ‘చలో సంసద్’కు తరలివచ్చారు. నిరసనకారులు జెండాలు, ప్లకార్డులు తరువాయి 8లో

### మా డిమాండ్లు నెరవేర్చాల్సిందే

కేంద్రమంత్రి జెపి నడ్డాకు సిజెపి ప్రతినిధి బృందం మెమోరాండం



07

### విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్య ధిక్కారం

- జవాబుదారీ వహించకుండా బ్యారికేడ్స్ వెనుక నక్కిన ప్రధాన్
- సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా విమర్శ
- సిపిఐ(ఎం) ఇతర వామపక్షాల ఖండన:మంత్రి రాజీనామాకు డిమాండ్



07

### దేశ చరిత్రలో యువతను వ్యతిరేకించిన ప్రధాని మోదీనే

- తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన రాహుల్‌గాంధీ
- ప్రశ్నాపత్రాల లీక్ నేరస్థులు వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు
- ప్రశ్నించిన విద్యార్థులను ఈడ్చి ఈడ్చి కొడుతున్నారు



07



### యువత ఆందోళనకు మద్దతు, రామాలయ నిధుల చోరీపై స్వతంత్ర విచారణకు

## ప్రతిపక్షాల నిరసనతో స్తంభించిన పార్లమెంటు

**ఉభయ సభలు నేటికి వాయిదా**

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజే ఉభయసభల్లో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. నీట్ పరీక్షా పత్రం లీక్, అయోధ్యలోని రామమందిరానికి సంబంధించిన విరాళాల చోరీపై ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో ఉభయసభలూ దద్దరిల్లాయి. పలుమార్లు వాయిదా పడ్డాయి. నీట్ పేపర్ లీక్ విషయంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, కాక్రోజ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలోని నిరసనకారుల బృందాలు బారికేడ్లను బద్దలు కొట్టి పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఈ అంతరాయం తరువాయి 8లో

## ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం తథ్యం

**అదే శంకర్‌గౌడ్ త్యాగానికి ప్రభుత్వ నివాళి**

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)ని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడం తథ్యమని, అదే అమరుడు శంకర్‌గౌడ్ చేసిన త్యాగానికి ప్రభుత్వం ఇచ్చే నివాళి అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహించి, గెలిచిన యూనియన్ ప్రతినిధులను మంత్రుల కమిటీలోకి తీసుకుని భవిష్యత్తులో ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు రాకుండా విలీన ప్రక్రియను పూర్తి చేస్తామనే హామీని మంత్రి పునరుద్ఘాటించారు. రూ.6 లక్షల లోపు ఆదాయం ఉండి, అర్హత ఉన్న ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ తరువాయి 12లో

## క్యూర్ పరిధిలో ‘ఇందిరమ్మ ఇళ్లు’

- తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8వేల ఇళ్ల నిర్మాణం
- నేటి నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాజధాని నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో నివసించే నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. క్యూర్ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టనున్న ‘ఇందిరమ్మ ఇళ్ల’ (ఎల్‌ఐజి స్కీమ్) నిర్మాణ కార్యక్రమాన్ని సోమవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన బ్రోచర్, మీసేవ, వాట్సాప్ దరఖాస్తులను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి తరువాయి 8లో

09



## ఫిఫా ప్రపంచకప్ విజేతగా స్పెయిన్

ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో స్పెయిన్ విజేతగా నిలిచింది. ఆదివారం అర్ధరాత్రి ఉత్కంఠగా సాగిన ఫైనల్లో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలలేదు. దాంతో ఎక్స్‌ట్రా టైమ్ ఆడించాల్సి వచ్చింది. ఈ సమయాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది.

## కాల్పుల విరమణకు మళ్లీ మధ్యవర్తి ప్రయత్నాలు

- ఇరాన్‌కు చేరిన ప్రతిపాదనలు
- ఇస్మాయిల్ బఖాయి ధ్రువీకరణ

**టెహ్రాన్:** అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు తగ్గించేందుకు, కాల్పుల విరమణకు మధ్యవర్తులు విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఖతార్,పాకిస్థాన్ సహా పలువురు మధ్యవర్తులు యుద్ధ విరమణ చేయాలని కోరుతూ ప్రతిపాదనలు చేస్తున్నారన్న విషయాన్ని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి సోమ వారం ధృవీకరించారు. మధ్యవర్తుల ద్వారా వచ్చిన ప్రతిపాదనలు మాకు చేరాయి, మేం వాటిని స్వీకరించాం, ఐతే ఈ దశలో ఈ విషయంపై స్పందించడానికి, వాటి వివరాల




లోతుల్లోకి వెళ్ళడానికి ఇష్టంగా లేం అని చెప్పారు.మధ్యవర్తులకు ప్రతిస్పందన ఇవ్వడంతోపాటుగా ఇరాన్ కూడా ఉద్రిక్తతలు తగ్గించేందుకు తన వంతు దౌత్య ప్రయత్నాలు తరువాయి 12లో

## బ్రిటన్ ప్రధానమంత్రిగా బర్న్‌హామ్



**లండన్:** బ్రిటన్ ప్రధానమంత్రిగా ఆండీ బర్న్‌హామ్ (56) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అధికార బదిలీ ప్రక్రియలతో భాగంగా సర్ కీర్ స్టార్‌మర్ (63) తన పదవికి లాంఛనంగా రాజీనామా చేసిన తర్వాత కీర్ స్టార్‌మర్‌తోపాటు బర్న్‌హామ్ కూడా బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్ళి రాజు ఛార్లెస్–3 ను కలుసుకున్నారు. ఈ సమావేశంలోనే కొత్త ప్రధానమంత్రిగా బర్న్‌హామ్‌కు రాజు ధృవీకరణ లభించింది. దీంతో బ్రిటన్ దేశ చరిత్రలో 59వ ప్రధానమంత్రిగా బర్న్‌హామ్ తన పేరు నమోదు చేసుకున్నారు. బర్న్‌హామ్‌తో రాజు ఛార్లెస్ ప్రైవేటుగా జరిపిన సమావేశంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. ఆయన ఆహ్వానాన్ని బర్న్‌హామ్ వినయంగా తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
21-07-2026
www.prajapaksham.in

# ఎడిట్
PEOPLE'S VIEWS

# బ్రిటన్‌కు కొత్త ప్రధాని

లేబర్ పార్టీ నాయకునిగా గతవారం ఎన్నుకోబడిన యాండీ బర్న్‌హామ్ యునైటెడ్ కింగ్‌డం(యుకె) నూతన ప్రధానమంత్రిగా సోమవారం పదవీ ప్రమాణం స్వీకరించారు. ఈయన గత నాలుగేళ్లలో ఐదవ ప్రధానమంత్రి. 2024 జులైలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లేబర్‌పార్టీకి 600లకు 412 సీట్లలో అఖండవిజయం సాధించి పార్టీని 14ఏళ్ల అరణ్యవాసం నుంచి అధికార అందలమెక్కించిన నాయకుడు కీర్ స్టార్మర్ రెండేళ్లలోనే మరోనాయకునికి అధికారం బదిలీ చేయటం లేబర్ పార్టీలో రాజకీయ కల్లోలానికి నిదర్శనం. గత దశాబ్దకాలంలో అసాధారణంగా అరడజను ప్రధానమంత్రులు మారటం – డేవిడ్ కామరూన్, థెరిసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రుస్, రిషి సునాక్ (కన్సర్వేటివ్ పార్టీ), కీర్ స్టార్మర్(లేబర్ పార్టీ) – యుకెలోని ఆర్థిక, రాజకీయ అస్థిరతకు ప్రబల నిదర్శనం. సాధారణంగా కామన్స్ సభకు సార్వత్రిక ఎన్నికల తదుపరి అధికార బదిలీ జరగటం ప్రజాస్వామిక దేశాల్లో సర్వసాధారణం. కాని యుకెలో పార్టీల్లో అంతర్గత అలజడులు, తిరుగుబాట్లతో ప్రధానులు మారుతుండటం గమనార్హం. సంవత్సరాల తరబడి రాజకీయ అస్థిరత కారణంగా లేబర్ పార్టీకి ఓటర్లు పట్టంగట్టగా, దాని నాయకుడు స్టార్మర్‌కు కన్సర్వేటివ్‌ల నుంచి మందగమనంలోని ఆర్థిక వ్యవస్థ, పెచ్చుపెరిగిన ప్రభుత్వ అప్పు, భారంగా తయారైన ప్రజా సర్వీసులు, జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎస్), పెరిగిన వలసలు, గృహాలకొరత, ఎదుగుబొదుగులేని జీవన ప్రమాణాలు వారసత్వంగా లభించాయి. పదేళ్లకుపైగా కన్సర్వేటివ్ ప్రభుత్వాలనుంచి సంక్రమించిన వ్యవస్థాగత సమస్యలూ ఉన్నాయి. పర్యవసానంగా, త్వరితగతిన మార్పు తెస్తామన్న హామీని స్టార్మర్ ప్రభుత్వం నెరవేర్చలేక పోయింది. అనేక స్థానిక ఎన్నికల్లో వరుసగా వైఫల్యాలు, లేబర్ పార్టీ ఎంపిల్లో పెరుగుతున్న అసంతృప్తి, ప్రజామోద రేటింగ్స్‌లో క్షీణింపు, పార్టీలో అంతర్గత ఉద్రిక్తతలు – ఇవన్నీ ఒకదానికొకటితోడై స్టార్మర్ అథారిటీని క్రమంగా బలహీన పరిచాయి. నాయకత్వ మార్పుకై ఒత్తిడి తీవ్రతరం కావటం ఆయన రాజీనామాకు దారితీసింది.

లేబర్ పార్టీ నాయకత్వ మార్పు అతివేగంగా జరిగిన తీరే ఆ పార్టీలో భవిష్యత్ ఎన్నికల గూర్చి ఏర్పడ్డ భయసందేహాలను ప్రతిబింబిస్తోంది. కొత్త ప్రధాని బర్న్‌హామ్ జాతీయ రాజకీయాలకు కొత్తవాడేమీకాదు. వాయవ్య ఇంగ్లండ్‌లోని లీఫ్ నుంచి లేబర్ ఎంపిగా ఉన్న బర్న్‌హామ్ టోనీబ్లేయర్, గార్డన్ బ్రౌన్ ప్రభుత్వాల్లో కార్యదర్శిగా (మనభాషలో మంత్రి)గా పనిచేశారు. రెండుసార్లు లేబర్ నాయకత్వం కోసం విఫలయత్నం చేశాడు. 2017లో పార్లమెంటును విడిచిపెట్టి, కొత్తగా ఏర్పాటైన గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ పదవికి పోటీచేసి సఫలమైనాడు. స్థానిక సంస్థలకు అధికారాల పంపిణీ, మెరుగైన ప్రజారవాణా, అందుబాటు ధరలో గృహవసతి, బలమైన స్థానిక ప్రభుత్వం వగైరా విధానాలను ఛాంపియన్ చేస్తూ బలమైన ప్రాంతీయ నాయకునిగా గుర్తింపు పొందారు.

కోవిడ్ సమయంలో ఉత్తర ఇంగ్లండ్‌కు నిధుల కోసం బోరిస్ జాన్సన్ ప్రభుత్వంతో బహిరంగంగా ఘర్షణపడి దేశవ్యాప్త గుర్తింపు పొందాడు. లేబర్ పార్టీకి భావి నాయకుడన్న భావం కలిగించాడు. లేబర్‌పార్టీలో స్టార్మర్ నాయకత్వంపై అసంతృప్తి పెరుగుతున్న దశలో పార్లమెంటుకు వచ్చిన ఉపఎన్నికలో పోటీకి ఆయన కోరిన వెంటనే పార్టీ నాయకత్వం అనుమతి ఇచ్చింది. కాబోయే ప్రధాని బర్న్‌హామ్ అనే భావన ప్రచారంలోకి వచ్చింది. అందుకు తగినట్లు ఆయన దాదాపు పదేళ్ల తర్వాత పార్లమెంటులో ప్రవేశించాడు. నాయకత్వ మార్పు వెంటనే ఖరారైంది. స్టార్మర్ రాజీనామా చేయటానికి అంగీకరించాడు.

గతవారం లేబర్ ఎంపిల సమావేశం బర్న్‌హామ్‌ను నాయకునిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సోమవారం ప్రమాణ స్వీకారం జరిగిపోయింది. జనాదరణ పెంచుకుంటున్న పచ్చిమితవాది నిగెల్ ఫరాగ్ పార్టీ 'రిఫామ్ యుకె'ని ప్రతిఘటిస్తూ కార్మికవర్గం ఓటర్లకు పార్టీని చేరువ చేయగలిగిన వ్యక్తి బర్న్‌హామ్‌యేనని సీనియర్ మంత్రు లు, ట్రేడ్ యూనియనిస్టులు, ఎంపిలు శీఘ్రంగా ఆయన వెనుక చేరటం వల్లనే ఈ పరిణామాలు ఇంతవేగంగా జరిగాయి. బర్న్‌హామ్ ను కింగ్ ఆఫ్ ద నార్త్ అని పిలుస్తున్నారు. ఉత్తర ప్రాంతం నుంచి బ్రిటన్ అత్యున్నత అధికార స్థానానికి వచ్చిన నాయకులు అరుదు.

బర్న్‌హామ్ మీద లేబర్ పార్టీయే కాదు, మధ్యతరగతులు, శ్రామిక ప్రజలు ఎంతో ఆశపెట్టుకున్నారు. అయితే ఫలితాలు సాధించటం మాటలు చెప్పినంత సులభం కాదు. ప్రభుత్వాన్ని మితవాదంవైపు నెట్టేందుకు ఇంట–బయట ఒత్తిళ్లు, రక్షణ వ్యయం పెంచి యూరప్‌లో బలమైన సైనిక శక్తిగా యుకెను తయారు చేయాలన్న ఒత్తిళ్లు, రెండోవైపున ఆర్థిక ఇబ్బందులు, ప్రజల అవసరాలు తీర్చటం, సేవలు మెరుగుపరచటం మధ్యనున్న వైరుధ్యం సామాన్యమైనది కాదు. రాజకీయ భౌగోళిక అస్థిరతలు, బలహీనమైన వృద్ధిగమనం, పెచ్చుపెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్లతో కూడిన జి7 ఆర్థిక వ్యవస్థలో భాగంగా యుకెను నడిపించటం గ్రేటర్ మాంచెస్టర్‌ను పాలించినంత సులభం కాదని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అయితే 10 డౌనింగ్ వీధిలోకి యాండీ బర్న్‌హామ్ ప్రవేశించటం రొటీన్ నాయకత్వ మార్పు కాదు. లేబర్ పార్టీ భవితవ్యాన్ని నిర్మించుకునే ప్రయత్నం. ●



## రాజకీయం చేయొద్దు

**అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసును రాజకీయం చేయవద్దు. కోర్టులు రాజకీయాలకు వేదిక కాదు. ఇది ఒక సాధారణ నేరం. సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తాం. ఈ కేసు దర్యాప్తునకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు విచారణ చేస్తున్నారు.**

– సుప్రీంకోర్టు




# అతిగా ఆలోచించే జబ్బు 'రుమినిజం'

మానవ మనస్సు అత్యంత సంక్లిష్టమైనది. కొన్నిసార్లు ఆలోచనలు మన నియంత్రణలో లేకుండా ఒకే విషయాన్ని పదే పదే తిప్పుతూ ఉంటాయి. దీనినే మానసిక శాస్త్రంలో రుమినిజం లేదా అతిగా నెమరువేయడం అంటారు. పశువులు ఆహారాన్ని తిన్న తర్వాత మళ్లీ నోట్లోకి తెచ్చుకుని నమలడాన్ని 'నెమరువేయడం' అంటారు. సరిగ్గా అదే విధంగా, ఒక వ్యక్తి తన మనస్సులోని ప్రతికూల ఆలోచనలను, గతంలో జరిగిన చేదు అనుభవాలను లేదా భవిష్యత్తు గురించిన ఆందోళనలను పదే పదే తలచుకుంటూ ఆ ఆలోచనల వలయంలో చిక్కుకుపోవడాన్ని మానసిక రుమినిజం అని పిలుస్తారు. ఇది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, తీవ్రమైన మానసిక రుగ్మతలకు దారితీసే ఒక మానసిక ప్రవర్తన.

రుమినిజం అనేది సాధారణ ఆలోచన కంటే భిన్నమైనది. ఒక సమస్యకు పరిష్కారం కనుగొనడానికి ఆలోచించడం వేరు, కేవలం ఆ సమస్య ఎందుకు వచ్చింది, నాకే ఎందుకు ఇలా జరిగింది అని ఆలోచిస్తూ బాధపడటం వేరు. రుమినిజంలో వ్యక్తి సమస్య పరిష్కారం వైపు కాకుండా, సమస్య తీవ్రత వైపు మాత్రమే దృష్టి పెడతాడు. ఈ రుగ్మతతో బాధపడేవారు గతంలో తాము చేసిన తప్పులను, ఇతరులు తమకు చేసిన అన్యాయాలను పదే పదే గుర్తుచేసుకుంటూ ఉంటారు. దీనివల్ల మెదడులో నిరంతరం ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. ఫలితంగా, వ్యక్తి మానసికంగా మరింత కుంగిపోతాడు. ఇది ఒక విషవలయంలాంటిది. ఎంత ఎక్కువగా ఆలోచిస్తే అంతగా బాధ పెరుగుతుంది, ఆ బాధ మళ్లీ మరిన్ని ప్రతికూల ఆలోచనలకు దారితీస్తుంది.

రుమినిజం ఏర్పడటానికి అనేక కారణాలు ఉంటాయి. వ్యక్తిత్వ లోపాలు,అధిక సున్నితత్వం,గతంలో అనుభవించిన తీవ్రమైన మానసిక గాయాలు, ఆత్మవిశ్వాస లోపం వంటివి దీనికి ప్రధాన కారణాలు. ఆధునిక కాలంలో ఒత్తిడితో కూడిన జీవనశైలి కూడా దీనిని పెంచుతోంది. ఈ రుగ్మత యొక్క ప్రభావాలు చాలా తీవ్రంగా ఉంటాయి.నిరంతరం ప్రతికూల ఆలోచనలు చేయడం వల్ల వ్యక్తి క్రమంగా డిప్రెషన్‌లోకి జారుకుంటాడు. భవిష్యత్తు గురించి ఊహాజనిత భయాలు పెరిగిపోయి తీవ్రమైన ఆందోళనకు గురవుతారు. ఒక చిన్న విషయాన్ని కూడా విశ్లేషించలేక, ఏ నిర్ణయమూ తీసుకోలేక నిద్రలేమి,తలనొప్పి, అలసట, జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతాయి.

రుమినిజం అనేది మౌనంగా మనశ్శాంతిని హరించే ఒక మానసిక రుగ్మత. ఒక వ్యక్తి తన ఆలోచనల స్వభావాన్ని స్వయంగా గమనించడం ద్వారానే దీనిని గుర్తించగలడు. ప్రతికూల ఆలోచనల వలయం నుండి బయటపడటానికి సంకల్పం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఎంతైనా అవసరం. అవసరమైతే సంకోచించకుం డా మానసిక నిపుణుల సహాయం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవితాన్ని తిరిగి పొందవచ్చు.


సుధాకర్ ఎవి, 9000674747

# లౌకిక రాజ్యాంగాన్ని మార్చేందుకే డీలిమిటేషన్

**అరుణ్ శ్రీవాస్తవ**

**లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపుదలకోసం డీలిమిటేషన్‌కై రాజ్యాంగ సవరణ బిల్లుకు వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఆమోదం సంపాదించేందుకు బిజెపి అప్రజాస్వామిక వ్యూహాలు రచిస్తోంది. డీలిమిటేషన్, సీట్లసంఖ్య 50శాతం పెంపు వెనుకనున్న అసలు ఉద్దేశం ప్రమాదకరమైనది.**

ఉత్తర భారతదేశ జనాభా పరిమాణం, హిందీ–హిందూ మెజారిటీ, హిందూ మెజారిటీని ఏకం చేయటం, 'హిందీ–హిందూ–హిందుస్థాన్' అనే ఏకీకృత సాంస్కృతిక గుర్తింపును ముందుకు తీసుకెళ్లడం వంటి ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక లక్ష్యం ప్రచారానికి, 2014 నుండి బిజెపి ఎన్నికల ఆధిపత్యానికి దోహదపడింది. భారత రాజ్యాంగంలోని లౌకిక, సామ్యవాద పునాదులను మార్చాలనే లక్ష్యంగా పెట్టుకోగా, భారతదేశ ప్రాథమిక స్వరూపాన్ని, గుర్తింపును, హిందూ దేశ (రాష్ట్రం)గా మార్చడానికి 'నియోజకవర్గాల పునర్విభజన'ను తొలి రాజ్యాంగపరమైన అడుగుగా ఉపయోగించాలని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తోంది.



రాబోయే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో మరోసారి ప్రవేశపెట్టనున్న డీలిమిటేషన్ బిల్లు, ఆర్‌ఎస్‌ఎస్/బిజెపి శిబిరం విభజన రాజకీయాలలో ఒక ముఖ్యమైన భాగం. పార్లమెంటు స్వరూపాన్ని, పార్లమెంటరీ వ్యవస్థను శాశ్వతంగా మార్చి, పార్లమెంటరీ బలాన్ని హిందీ మాట్లాడే ఉత్తరాది ప్రాంతాల వైపు, ముఖ్యంగా హిందుత్వ కాషాయ రాజకీయాలను విశ్వసించే వారి వైపు నిర్ణయాత్మకంగా మళ్లించడానికి ఇది తయారుచేయబడింది. పార్లమెంటరీ వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురానంత వరకు, భారతదేశాన్ని అధికారికంగా హిందూ దేశంగా ప్రకటించే దిశగా మార్చాలనే తమ లక్ష్యాన్ని సాధించలేమనే వాస్తవం కాషాయ వర్గానికి బాగా తెలుసు.

భారతదేశ జనాభా 1971లో 55 కోట్ల నుండి 2026 నాటికి సుమారు 146 కోట్లకు పెరిగింది. ఈ భారీ జనాభా మార్పులకు అనుగుణంగా ఎన్నికల పటాన్ని నవీకరించడానికే పునర్విభజనను రూపొందించారు. పునర్విభజన ఒక చట్టపరమైన విధి అయినప్పటికీ, ఇది వివిధ కారణాల వల్ల తీవ్ర వివాదాస్పదంగా ఉంది. మొదటిది, ఉత్తర, దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం. ఉత్తర రాష్ట్రాలు (ఉత్తరప్రదేశ్, బిహార్ వంటివి) అధిక జనాభా పెరుగుదలను చూశాయి. ప్రస్తుత జనాభా ఆధారంగా సీట్లను పునఃసర్దుబాటు చేయడం వల్ల పార్లమెంటులో వారి ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని, అదే సమయంలో కుటుం బ నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యం తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. లోక్‌సభ మొత్తం సామర్థ్యాన్ని (850 సీట్ల వరకు) విస్తరించడానికి మోదీ పునర్విభజన బిల్లును, రాజ్యాంగ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ విస్తరణ లక్ష్యం, దక్షిణ రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను స్థిరంగా ఉంచుతూ, కొత్తగా కేటాయించిన సీట్లను ఉత్తర రాష్ట్రాలకు కల్పించడం.

భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ ప్రాంతాలుగా విభజిస్తున్నట్లు కాషాయ వర్గం బహిరంగంగా ఎన్నడూ అంగీకరించనప్పటికీ, భారతదేశాన్ని పాలించాలంటే ఉత్తర భారతదేశం తమ అదుపులో ఉండాలనే స్పష్టమైన భావనను అది పెంచుకుంటోంది. ఇది తమ ప్రస్తుత పార్లమెంటరీ బలంతో దక్షిణ భారతదేశంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు బలమైన శక్తిగా ఎదగలేవనే వాస్తవాన్ని కూడా అంగీకరించడమే. ఒక నిర్దిష్ట ప్రాంతంలో బలమైన పునాది వేసుకోవాలంటే, ఆ రాజకీయ పార్టీ ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలను, కోరికలను గ్రహించాలి. ఆర్‌ఎస్‌ఎస్ ఈ లక్ష్యాన్ని ఎప్పటికీ సాధించలేదు. అది ఇప్పటికే హిందీ మాట్లాడే హిందువుల పార్టీగా గుర్తింపు పొందింది. దశాబ్దాలుగా ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ భారతదేశంలో చురుకుగా ఉంటూ, భారీ సంఖ్యలో కార్యకర్తలను చేర్చుకున్నప్పటికీ, బిజెపికి బలమైన ఎన్నికల పునాదిని సృష్టించడంలో ఇప్పటివరకు విజయం సాధించలేదు.

కర్ణాటకలో బి.ఎస్. యడియూరప్ప నాయకత్వంలో బిజెపి అధికారంలోకి రావడాన్ని, ఆ రాష్ట్రంలో దానికి బలమైన పట్టు ఉన్నట్లుగా భావించకూడదు. ఒక్కలి, లింగాయత్ వర్గాల మధ్య ఉన్న వైరుధ్య సంబంధాలను ఆసరాగా చేసుకుని బిజెపి అధికారంలోకి వచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, ఆ సంస్థలో రెండవ అత్యున్నత అధికారి అయిన దత్తాత్రేయ హోసబాలె కర్ణాటకకు చెందినవారైనప్పటికీ, ఆ రాష్ట్రం అనేకమంది ప్రముఖ బిజెపి నాయకులను అందించినప్పటికీ, ఆ రాష్ట్రంలో హిందుత్వ రాజకీయాలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయన్నది వాస్తవం. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కాషాయ కూటమి తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, అది ఈ ప్రాంత ప్రజలతో మమేకం కాలేకపోయింది.

దామాషా పద్ధతిలో నియోజకవర్గాల పునర్విభజన, లోక్‌సభలో దక్షిణ రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని, వాణిని తగ్గిస్తుంది. తద్వారా వాటిని శక్తిహీనంగా, రాజకీయంగా ప్రాముఖ్యత లేనివిగా మార్చే అవకాశం ఉంది. డీలిమిటేషన్ ప్రక్రియ అన్ని రాష్ట్రాలకు దామాషా ప్రకారం సీట్లు పెంచుతుందని (సుమారు 50శాతం), సాపేక్షికంగా దామాషా కాపాడబడుతుందని, ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదనే వాదన అర్థరహితం. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్ సీట్లు 80 నుంచి 120కి పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి సంఖ్యాబలం పార్లమెంటులో తగ్గుతుంది.

2026 ఏప్రిల్‌లో మోదీ, బిజెపి ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు, పార్లమెంటరీ సీట్ల కేటాయింపుపై 50 ఏళ్లుగా ఉన్న స్తంభనను అంతం చేయడానికి రూపొందించిన భారతదేశ ఎన్నికల పటం నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణ. ఈ బిల్లు లోక్‌సభ గరిష్ట సభ్యుల సంఖ్యను 543 నుండి 850కి పెంచాలని ప్రతిపాదిస్తుంది. ఈ విస్తరణను, 33% మహిళా రిజర్వేషన్ కోటా అమలుతో వ్యూహాత్మకంగా జత చేశారు. భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడం కోసం, హిందూ జనాభా ను పెంచాలని ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం నొక్కి చెబుతోందన్నది ఇక్కడ ప్రస్తావించాల్సిన విషయం. ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భాగవత్, ముగ్గురు సంతానం విధానాన్ని గట్టిగా సమర్థించారు. జనాభా సమతుల్యతను కాపాడటానికి, సామాజిక పతనాన్ని నివారించడానికి ప్రతి భారతీయ కుటుంబానికి ముగ్గురు పిల్లలు ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ వాదిస్తున్నది.

సంఘ్ ప్రాథమిక లక్ష్యం హిందువుల సంఖ్యను పెంచడమే అయినప్పటికీ, వాస్తవానికి దేశవ్యాప్తంగా పట్టణ మధ్యతరగతి హిందువులు కుటుంబ నియంత్రణను పాటిస్తున్నారు. చాలామంది గరిష్టంగా ఒకరు లేదా ఇద్దరు పిల్లలను కనడానికే ఇష్టపడుతున్నారు. కానీ, సామాజిక స్థిరత్వాన్ని కాపాడటానికి ఒక కుటుంబానికి ముగ్గురు పిల్లలు అవసరమని భాగవత్ వాదిస్తున్నారు.

అయితే, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనడానికి అన్ని వర్గాల హిందువులు విముఖత చూపడం, ఆర్‌ఎస్‌ఎస్/బిజెపి మోదీలను నియోజకవర్గాల పునర్విభజన మార్గాన్ని ఎంచుకునే లా చేసింది. ఇది ఉత్తర భారతదేశంలోని హిందూ జనాభాను రాజకీయంగా బలోపేతం చేయడానికి ఒక పరోక్ష యంత్రాంగం. నియోజకవర్గాల పునర్విభజన చట్టం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పార్లమెంటుపై పూర్తి ఎన్నికల నియంత్రణను సాధించగలిగితే, వారిని ఎన్నికల ద్వారా తొలగించడం దాదాపు అసాధ్యం. మోదీ ప్రభుత్వం ప్రాంతీయ వైవిధ్యాన్ని, దక్షిణాది ప్రాబల్యాన్ని అధిగమించడానికి రాజ్యాంగ సరిహద్దులను దుర్వినియోగం చేయాలని చూస్తోంది. గత లోక్‌సభ సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఓడిపోయిన తర్వాత, మోదీ, కాషాయ కూటమి మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రతిపక్ష శ్రేణులలో చీలిక సృష్టించడానికి బిజెపి ఇటీవల తీసుకున్న చర్య కూడా ఈ మొత్తం పథకంలో భాగమే. బెంగాల్‌లో బిజెపి అధికారంలో ఉన్నప్పటికీ, అమిత్ షా టిఎంసి పార్లమెంటరీ పార్టీని చీల్చారు. ఈ పార్లమెంటరీ చీలిక కారణంగా రాష్ట్రంలో పాలనపై ఎలాంటి ప్రభావం ఉండదు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు తమ సంఖ్యాబలాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది ఒక ఎత్తుగడ. ప్రతిపక్ష పార్టీల నుండి ఇటీవల జరిగిన ఫిరాయింపులు పార్లమెంటులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ బలాన్ని మెరుగుపరిచాయి. వారి అసలు ఉద్దేశం భారత రాజ్యాంగాన్ని మార్చడమే. 400 సీట్లు దాటడం వెనుక ఉన్న ఉద్దేశ్యం రాజ్యాంగాన్ని మార్చ గలిగిన స్థితిలో ఉండటమే. బెంగాల్‌లోని టిఎంసి, మహారాష్ట్రలోని శివసేన (యుబిటి)లను వీడిన ఎంపిల ఇటీవలి ఫిరాయింపులు, మిత్రపక్షాల మద్దతుతో ఎన్‌డిఎ బలం 300 మార్కును దాటింది. కానీ ఇది ఇప్పటికీ మూడింట రెండు వంతుల కచ్చితమైన మెజారిటీకి తక్కువే. రాజ్యసభ కూడా ఇలాంటి సవాలునే విసురుతోంది. దీంతో ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్ష ఎంపిలు ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశం ప్రభుత్వ బిల్లు ఆమోదానికి కీలకంగా మారింది.

# రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం..ఆందోళనలో అన్నదాతలు

రాష్ట్రంలో కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. సాగు–త్రాగునీటి సమస్య తీవ్రం కాబోతున్నదా! అంటే ఔవుననే చెప్పక తప్పదు! రాష్ట్రవ్యాప్తంగా సగటున 33% లోటు వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 67% లోటు నమోదయింది. 548 మండలాల్లో జాడలేని వానలు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్లో 1,32,38,446 ఎకరాలు సాగయ్యేది. సాగయింది 59,83,971 ఎకరాలు మాత్రమే. వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడినవి. దిక్కుతోచని పరిస్థితుల్లో.. వానకోసం ఎదురుచూపులలో రైతాంగం..

తెలంగాణ ప్రాంతానికి సాగునీరు అందించే నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాలు అడుగంటాయి. డెడ్ స్టోరేజ్ కి చేరుకోవడంతో కృష్ణమ్మ వెలవెల పోయింది. తెలంగాణలో వర్షపాతానికి కీలకం నైరుతి రుతుపవనాలు. 80 శాతానికి పైగా వర్షం వాటి ఆధారంగానే పడుతున్నది. అయితే ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షాలు అంతగా కురవలేదు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ ఆ మూడు నెలల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ తెలియజేస్తున్నది.

ఈ సీజన్‌లో జులై 15 వరకు 30 శాతం లోటు వర్షపాతం నమోదయింది. ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు పెద్దఎత్తు న నష్టం చేరకుండా రాష్ట్ర సర్కార్ 'కంటిజెన్సీ ప్లాన్ వానకాలం' 2026న విడుదల చేసింది. భూగర్భ జలాలు అడుగంటుతున్నందున బోర్ల కింద సాగు చేసే రైతులు వరిసాగు 25 శాతానికి తగ్గించుకోవాలని, ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించింది.

రాష్ట్రంలో జూన్ 1 నుండి జులై 15 నాటికి 33.53 శాతం లోటు వర్షపాతం నమోదయింది. రాష్ట్రంలో ఇప్పటివరకు ములుగు, నాగర్కర్నూల్, రంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం రికార్డు అయింది. 27 జిల్లాల్లో లోటు. మండలాల వారీగా చూస్తే 358 మండలాల్లో లోటు వర్షపాతం, 85 మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం రికార్డు అయింది. 142 మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదయింది. ఎల్ నినో నేపథ్యంలో రాష్ట్రంలో వచ్చే మూడు నెలలు కూడా లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి. అయితే సాధారణ వర్షపాతం నమోదైన మండలాల్లోనూ ఒకటి రెండు భారీ వర్షాలు పడటంతో అలా కనిపిస్తున్నప్పటికీ ఆ ప్రాంతాల్లోనూ కరువుచాయలే ఉన్నాయని వాతవరణ పరిశోధన కేంద్రం తెలియజేస్తున్నది.



శ్రీశైలం గరిష్ట సామర్థ్యం 215.81 టిఎంసిలకుగాను ప్రస్తుతం 39.2 టిఎంసిలకు పరిమితమైంది. శ్రీశైలం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ 810 అడుగులకు చేరువలో ఉంది. అలాగే తాగునీటికి వెన్నెముకగా ఉన్న నాగార్జునసాగర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జలాశయం గరిష్ట సామర్థ్యం 312.05 టిఎంసిలగాను ప్రస్తుతం 137.86 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉన్నాయి. నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ 510 అడుగుల చేరువలో ఉంది. జలాశయాల్లో నీరు అడుగంటినప్పటికీ అత్యవసరంగా తాగునీటి తాపం తీర్చేందుకు ఎపికి 10 టిఎంసిలు, తెలంగాణకు 16 టిఎంసిలను కృష్ణానది యాజమాన్య బోర్డు కేటాయించింది. రెండు ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు వరద ప్రదాయనిగా ఉన్న జూరాల ప్రాజెక్టులో నీటి నిలువలు అడుగంటాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 9.657 టిఎంసిలు కాగ, ప్రస్తుతం కేవలం 0.44 టిఎంసిలకే పరిమితమైంది.

గోదావరి బేసిన్ లోని ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు బాగా తగ్గిపోయినవి. మెదక్ జిల్లా రైతాంగానికి సాగు, త్రాగు నీరు కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే సింగూరు కింద క్రాఫ్ హాలిడే ప్రకటించగా.. సింగూరు సామర్థ్య నిలువ 29.91 టిఎంసిలకు గాను ప్రస్తుత నిల్వ 4.53 లు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు కింద నిర్మించిన రిజర్వాయర్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవటంతో గత రెండున్నర సంవత్సరాలుగా జలాశయాలు నీటిని నింపకపోవడంతో కొన్ని జలాశయాలు అడుగంటాయి. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచినీటిని ఎత్తిపోసి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు నింపి రైతుల పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం అన్నపూర్ణ లో 2.72 టిఎంసిలు, రంగనాయక సాగర్ లో 0.89 టిఎంసిలు.

మల్లన్న సాగర్ లో 7.897 టిఎంసిలు నీళ్లు ఉన్నాయి. మరికొద్ది రోజుల్లోనే ఈ నీరంతా ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొన్నది.

శ్రీరామ్ సాగర్, ఎల్లంపల్లి, మానేరు, కడెం, కొమరం, సీతమ్మ సాగర్ దుమ్ముగూడెం, ఇచ్చంపల్లి స్వర్ణ సదర్ ఘాట్, పోచారం తదితర జలాశయాలు డెడ్ స్టోరేజ్‌కి చేరుకొని ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలో మిగతా రాష్ట్రాల కంటే తెలంగాణలోనే నీటి ఎద్దడి అధికంగా ఉంది. దక్షిణ భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో 40 నుంచి 50% జలాశయాల్లో నీటి నిలువలు ఉండగా తెలంగాణలో 25 నుంచి 36% వరకు నీటి నిల్వలు మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నాయి.

రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అప్రమత్తమవుతున్నది. దానికోసం పంటల మార్పిడి పై విస్తృత ప్రచారం చేస్తున్నది. అదే సమయంలో ప్రాజెక్టులో నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నది. రాష్ట్రంలో గోదావరి బేసిన్ 52.64 శాతం, కృష్ణ బేసిన్ 46.60 శాతం, చిన్న నదీ పరీవాహక ప్రాంతాలు 0.76 శాతం వాటా కలిగి ఉన్నాయి. జులై 15 నాటికి 30 నుంచి 40% వరకు తక్కువ స్థాయిలో వర్షపాతం నమోదయి ఉన్నందున.. ప్రాజెక్టుల్లో నీరు లేక వర్షాలు కురవక వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విత్తనాలు వేసి నెలరోజులు గడిచిన ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత కారణంగా పత్తి, మొక్కజొన్న, పెసర, పసుపు తదితర విత్తనాలు మొలక దశలోనే వాడిపోతున్నాయి. వరి నారు పోసుకొని నాట్ల కోసం ఎదురుచూస్తున్నారు.

ఈ దశలో వ్యవసాయ శాఖ వారు అన్నదాతలు ఆరు తడి పంటలు వేసుకోవాలని సూచనలిస్తున్నారు.

**గ్రేటర్‌లో త్రాగునీటి ఇబ్బంది**

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో 1.30 కోట్ల జనాభాకు రోజుకు 813.28ఎంజిడిలు డిమాండ్ ఉండగా, రోజు తప్పించి రోజు.. ప్రస్తుతం వాటర్ బోర్డు 560 ఎంజిడి లు మాత్రమే సరఫరా చేయగలుగుతుంది. ఈ లెక్కన లోటు 243.28 ఎంజిడి లు గా ఉంది. అయితే 2027 ఆఖరి నాటికి సిటీలో జనాభా 1.57 కోట్లకు చేరుకుంటుందని అప్పుడు నీటి డిమాండ్ 835ఎంజిడిలు ఉండవచ్చునని అధికారులు అంచనా వేశారు. పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా గోదావరి 2,3 దశలు పూర్తి చేసుకోవాలని నివేదికలు తెలుపుతున్నాయి.

## అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందాన్ని
# తక్షణమే రద్దు చేయాలి

22న రాష్ట్రవ్యాప్తంగా ట్రంప్, మోదీ దిష్టిబొమ్మల దహనం

రైతులకు పిలుపునిచ్చిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

యాదగిరిగుట్టలో ముగిసిన మూడు రోజుల రాష్ట్ర శిక్షణా తరగతులు




**ప్రజాపక్షం/యాదాద్రి :** అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దానిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఇచ్చిన పిలుపులో భాగంగా, ఈనెల 22న రాష్ట్రవ్యాప్తంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీల దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు సోమవారం ఉత్సాహ పూరిత వాతావరణంలో ముగిశాయి. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముగింపు సమావేశంలో పశ్య పద్మ మాట్లాడుతూ.. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తే దేశీయ రైతాంగం కోలుకోలేని దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వంటనూనెలు, యాపిల్స్, డైరీ ఉత్పత్తుల ధరలు మార్కెట్లో భారీగా పడిపోయి రైతులు రోడ్డున పడతారని పేర్కొన్నారు. 'అమెరికా రైతులకు అక్కడి ప్రభుత్వం భారీ సబ్సిడీలు ఇస్తోంది. కానీ, మన దేశంలో రైతులకు తగిన మద్దతు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వారితో పోటీ పడటం అసాధ్యం' అని ఆమె స్పష్టం చేశారు. ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకునే వరకు ఢిల్లీ నుంచి గల్లీ దాకా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఈనెల 28, 29 తేదీల్లో జాతీయ స్థాయిలో ఎస్కేఎం ఆధ్వర్యంలో రైతు, కార్మిక సంఘాలతో సంయుక్త కన్వెన్షన్ నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

**'భూభారతి'ని రాష్ట్రమంతటా అమలు చేయాలి..** రాష్ట్ర ప్రభుత్వం 'ధరణి' స్థానంలో తీసుకురానున్న 'భూభారతి' చట్టం అమలును కేవలం పైలట్ ప్రాజెక్టులకే పరిమితం చేయొద్దని ఆమె డిమాండ్ చేశారు . సమగ్ర భూ సర్వే చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలు చేయాలని కోరారు. మూడు రోజుల శిక్షణా శిబిరంలో విద్య, వైజ్ఞానిక అంశాలతో పాటు సాగు చట్టాలు, సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు, సాగు నీటి ప్రాజెక్టులపై ప్రతినిధులకు అవగాహన కల్పించారు. 'నీట్' (NEET) పేపర్ లీకేజీని నిరసిస్తూ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త మరియు పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూ తీర్మానం చేశారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు దీక్ష చేస్తున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు హెల్త్ బులెటిన్లు విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరారు. భూమి హక్కులను కాపాడేందుకు భూభారతి చట్టంలో చేయాల్సిన చేర్పులు, మార్పులపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, రైతు సంఘాల సలహాలు, సూచనలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ శిక్షణా శిబిరంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బోగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు, కొల్లూరి రాజయ్య, దొడ్డ వెంకటయ్య, డి.జి.నరేందర్ ప్రసాద్, ఎం.ప్రభులింగం, కొండపర్తి గోవిందరాజు, వర్ల వెంకటయ్య, కంజర భూమయ్య, నర్ల వెంకటయ్య, ఏషాల అశోక్, లక్ష్మయ్య, ఎస్.రవి, దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల గళాన్ని లాఠీలతో అణిచివేయలేరు

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'చలో పార్లమెంట్' కార్యక్రమంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు జరిపిన లాఠీచార్జి దమనకాండను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి. నర్సింహ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసు లాఠీలతో స్పందించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. ఎన్‌టిఎలో చోటుచేసుకున్న అవినీతి ఆరోపణలు, పరీక్షల నిర్వహణపై వ్యక్తమైన ఆందోళనలకు సమాధానం చెప్పకుండా నిరసనలను అణచివేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత 12ఏళ్లుగా కేంద్రంలోని నరేంద్రమోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దేశ భక్తి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, జాతీయ ఆస్తుల విక్రయం, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గనులు, విద్యుత్, రైల్వేలు వంటి కీలక రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు విస్తృత అవకాశాలు కల్పించడం ద్వారా అంబానీ, అదానీ లాంటి గ్రూపులు అపారంగా లబ్ధి పొందాయని ఆరోపించారు. మరో వైపు దేశ ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య–వైద్య రంగాల సంక్షోభం, రైతుల ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా నష్టపోతుండగా దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ కుబేరుల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు ఈ పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ విద్యార్థులు, యువత గొంతును నొక్కే ప్రభుత్వాలకు ప్రజలే తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధమైన తీర్పు ఇస్తారని ఇటి.నర్సింహ అన్నారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని, లాఠీచార్జికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎన్‌టిఎలో సమగ్ర సంస్కరణలు చేపట్టి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఢిల్లీలో విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జీ అమానుషం : ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్**

ఢిల్లీలో 'చలో పార్లమెంట్' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం దమనకాండకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇది నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్‌టిఎలో అవినీతి, పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లాఠీఛార్జీలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు లాఠీచార్జీకి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు – యువత న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు కోరారు.

**నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : డిహెచ్‌పిఎస్**

నీట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ఖండించారు. నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడి విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, లాఠీచార్జీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో నీట్ పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, భద్రత కల్పించేలా సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.




## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం

జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పేపర్ లీకేజీపై న్యాయం కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా పార్లమెంట్ మార్చ్‌ను చేపట్టిన విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జీ అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్షకు సంఘీభావంగా సోమవారం హైదరాబాద్‌లో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు.విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, నీట్ నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని, లాఠీఛార్జికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ అవకతవకల వల్ల లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ న్యాయం కోసం దేశ యువత రోడ్ల మీదికొచ్చి ఆందోళన చేస్తుంటే ప్రధాని మోడీ మౌనం వహించటం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థులతో చర్చించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మరో కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జీ చేయటం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు డిజి.నర్సింహారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్, ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, సిపిఐ(ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటరమేశ్, అనగంటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని సూచనలు అందిస్తాం

నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి అవసరమైన అన్ని సూచనలను ప్రభుత్వానికి అందిస్తామని ఎల్‌నినో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంతోని ప్రజా ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి సోమవారం బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ బృందంతో సమావేశమై ఆయన రాష్ట్ర వ్యవసాయ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ రైతు కమిషన్ ప్రభుత్వానికి అందిస్తున్న సూచనలు, సిఫార్సులపై డాక్టర్ చిన్నారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై రైతు కమిషన్ రూపొందించిన రెండు నివేదికలను నిపుణుల కమిటీకి అందజేశారు. ఈనెల 22న ప్రజాభవన్‌లో నిపుణుల కమిటీ తొలి సమావేశం నిర్వహించనున్నట్లు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు కెవిఎన్ రెడ్డి, భవానీ రెడ్డి డాక్టర్ చిన్నారెడ్డికి స్వాగతం పలికి సన్మానించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఇన్‌చార్జ్ మెంబర్ సెక్రటరీ సంధ్యారాణి, స్పెషల్ ఆఫీసర్ కేశవులు, వ్యవసాయ రంగ నిపుణులు విష్ణువర్ధన్ రెడ్డి, కమిషన్ అధికారులు పాల్గొన్నారు.

## 2029 ఎన్నికల నాటికి
# మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుచేయాలి

మహిళా సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాల్సిందేనని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ప్రగతిశీల మహిళా సంఘం, చైతన్య మహిళా సంఘం తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో లోక్ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పి.ప్రేంపావని మాట్లాడుతూ 1994లో యునైటెంట్ ఫ్రంట్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించిందని గుర్తుచేశారు. బిసి మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ నేపథ్యంలో ప్రముఖ సిపిఐ నాయకురాలు, మాజీ ఎంపి గీతా ముఖర్జీ నేతృత్వంలో పార్లమెంటరీ కమిటీ ఏర్పాటై, నిర్దేశిత గడువుకు ముందుగానే తన నివేదికను సమర్పించిందని చెప్పారు.

అప్పటి ప్రతిపక్ష నాయకురాలు సుష్మాస్వరాజ్ కూడా మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉందని పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రకటించారని ఆమె గుర్తు చేశారు. అనంతరం కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. మహిళల రాజకీయ సాధికారతపై బిజెపికి చిత్తశుద్ధి ఉంటే 2029 ఎన్నికలకల్లా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఫైమీదా మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తమ పోరాటం కొనసాగుతుందని, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే మహిళలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాలు పడాల నళిని, అంజూమ్, జ్యోతి శ్రీమాన్, ఐద్వా జాతీయ నాయకురాలు జ్యోతి, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అనసూయ, స్వరూప తదితర మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యమా.. అరాచకమా?

నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోదీ మౌనం వీడాలి

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

విద్యార్థులపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నా

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీ ఘటనలతో లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ వ్యవహారానికి రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ పరిస్థితిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. దేశ యువతకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై ఉందన్నారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతియుతంగా పార్లమెంట్ వైపు మార్చ్ నిర్వహించిన విద్యార్థులు, యువజన సంఘాలపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అత్యంత దురదృష్టకరం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మంత్రి తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## కొడంగల్ నియోజకవర్గంలో నేటి నుంచి
# సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలన, నియోజకవర్గ అభివృద్ధి పనులు, 'సర్'పై సమీక్షించనున్నారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్‌ను సిఎం పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తారు. రాత్రి కొడంగల్‌లోనే ముఖ్యమంత్రి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ స్థానిక నాయకులు, బిఎల్‌ఎలతో 'సర్'పై సమావేశం కానున్నారు. ఈ సమావేశం అనంతరం సిఎం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

# ఆయు‘ర్వే’దన



**నిర్వేదంలో..ఆయుర్వేదం..**

**204 బెడ్స్‌లో 20కి దాటని ఇన్‌పేషంట్ల సంఖ్య ...?**

**ఆక్యుపెన్సీ తగ్గితే.. వైద్య సీట్లు లేదా ఏకంగా కళాశాలే రద్దు..!**

**నిర్లక్ష్యానికి గురవుతున్న 'ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి'**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించడంలో ఎంతో ఆదరణ ఉన్న 'ఆయుర్వేద వైద్యం' ప్రస్తుతం 'నిర్వేదం'లో పడింది. అనేక దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స నందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆయుర్వేద ఆస్పత్రిని పట్టించుకునేవారే కరువయ్యారు. ఆ ఆస్పత్రిలో రోగులు లేక (ఇన్‌పేషంట్లు) తీవ్ర దీనావస్థకు చేరుతోంది. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలోని మొత్తం 204 బెడ్స్‌లలో కేవలం 15 నుంచి 20 మంది కూడా ఇన్‌పేషంట్ల సంఖ్య మించడం లేదు. వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఈ ఆస్పత్రిలో ఇన్‌పేషంట్ల సంఖ్య తగ్గడంతో భవిష్యత్తులో హైదరాబాద్‌లోని ఆయుర్వేద కళాశాల సీట్ల సంఖ్య కూడా తగ్గే ప్రమాదం ఉన్నట్టు వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆయుర్వేద వైద్య కళాశాలనే పూర్తిగా రద్దయ్యే ప్రమాదం లేకపోలేదనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

హైదారబాద్, ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి రోజురోజుకూ దీనంగా మారుతోంది. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఇన్‌పేషంట్లుగా చేరి చికిత్సను పొందేవారు. కానీ గత ఒకటి, రెండు నెలల నుంచి ఈ ఆస్పత్రిని పట్టించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. వచ్చిన కొందరు పేషంట్లను కూడా ఇన్‌పేషంట్లుగా చేరడం లేదు. దీంతో రోజు రోజుకూ ఇన్‌పేషంట్లు చేరడం లేదు. ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాల విషయంలో ఆస్పత్రి వర్గాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడంలో విఫలమైందా? లేదా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదా? అనేది వైద్య వర్గాల్లో చర్చనీయంశంగామారింది. ఉన్నతాధికారులు కూడా పెద్దగా దృష్టి కేంద్రీకరించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆస్పత్రిలో కావాల్సిన నీరు, మంచినీళ్లు, డ్రేనేజీ సమస్యతో పాటు సరిపడ మందులు కూడా సరఫరాకావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌పేషంట్లుగా చేరేవారికి సమయానికి మందులను సరఫరా చేయకపోయినా, వారికి కనీస మౌలిక సదుపాయాలను కల్పించకపోతే రోగులకు పరిస్థితి ఆందోళనకరంగా ఉంటుందని, వైద్యం అందించడం పెద్ద సమస్యగా మారుతుందనే వైద్య వర్గాలు చెబుతున్నాయి.

ఆయుర్వేదంలో పంచకర్మ చికిత్సలో భాగంగా మందులను ఉపయోగిస్తే మరుగుదొడ్డికి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే శరీరానికి ఎక్కువగా నూనెను రుద్దడం వల్ల కూడా వేడినీళ్ల వాడకం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ ఆస్పత్రిలో కాయచికిత్స, పంచకర్మ, శల్య, శాలక్య, ప్రసూతి తంత్రస్త్రీరోగ, కౌమారభృత్య (పెడియాట్రిక్స్), రీసెర్చ్ (పరిశోధన) ప్రధాన విభాగాల ఉన్నాయి. ఆస్పత్రి మౌలిక సదుపాయాలు, వైద్యుల సమన్వయం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపిస్తే ఆయుర్వేద ఆస్పత్రి నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొన్నది.

**50 శాతం మించి ఇన్‌పేషంట్లు లేకపోతే.. ఇక వైద్య కళాశాల రద్దు..!**

నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్‌సిఐఎస్‌ఎం) ప్రకారం వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న వైద్య ఆస్పత్రిలో కనీసం 50 నుంచి 60 శాతం ఇన్‌పేషంట్లు (ఆక్యూపెన్సీ) ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. తద్వారా వైద్య విద్యార్థులకు శిక్షణకు అనుగుణంగా ఉంటుందని, పరిశోధనలు సాఫీగా సాగుతాయని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయుర్వేద వైద్య కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్‌లో 63 సీట్లు, పిజిలో 48 సీట్లు ఉండగా, ఈ కళాశాలకు అనుబంధమైన ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఆక్యూపెన్సీ శాతం చాలా తక్కువగా ఉన్నది. 204 బెడ్స్‌కుగాను కేవలం 20 బెడ్స్‌లలోనే ఇన్‌పేషంట్లుగా ఉన్నారు. దీంతో వైద్య విద్యార్థులకు కూడా శిక్షణకు అనుకూల వాతావరణం కనిపించడంలేదు. నిబంధనల ప్రకారం వైద్య కళాశాల సీట్లను తగ్గించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇలాగే ఇన్‌పేషంట్ల సంఖ్య గణనీయంగా తగ్గితే మాత్రం వచ్చే వైద్య విద్యా సంవత్సరంపైన తీవ్ర ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదు. 'ఎన్‌సిఐఎస్‌ఎం' నిబంధనల ప్రకారం సీట్లు సంఖ్య తక్కువ కావడం వల్ల వైద్య కళాశాలనే రద్దు చేసే అవకాశాలు ఉంటాయని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో కేవలం హైదరాబాద్, వరంగల్‌లో రెండు ఆయుర్వేద వైద్య కళాశాలలు ఉన్న విషయం తెలిసిందే. ఇన్‌పేషంట్ల సంఖ్య, మౌలిక సదుపాయాల విషయంలో ఉన్నతాధికారులు ఇప్పటి వరకు కనీసం సమీక్ష సమావేశాన్ని కూడా నిర్వహించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించి, ఆయుర్వేద ఆస్పత్రిపైన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పలువురు కోరుతున్నారు.

## అనుభవజ్ఞులైన నర్సులకు విదేశీ ఉద్యోగాల బాట

మంత్రి వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూరప్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో నైపుణ్యం కలిగిన భారతీయ నర్సులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోందని, ఆ అవకాశాలను తెలంగాణ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్), గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆయన సమక్షంలో టామ్‌కామ్‌గ్లోబల్ నర్స్ ఫోర్స్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇతర దేశాల్లో నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమన్నారు. తెలంగాణ నైపుణ్యాన్ని ప్రపంచ ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే విశ్వసనీయ వేదికగా టామ్‌కామ్ ఎదుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, టామ్‌కామ్ జిఎం, గ్లోబల్ నర్స్ ఫోర్స్ ప్రతినిధి పరమానంద సంత్రా తదితరులు పాల్గొన్నారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఇఇ-II (60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్.

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు**

NIT No. 16/EE-60/QBZ/CMC/2026-27, Dt: 20.07.2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడినది. వివరాలకు @https://tender.eprocurement.gov.inలో లాగ్‌ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీ వివరాలు క్రింది విధముగా ఉన్నాయి.

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 16/EE-60/ QBZ/ CMC/ 2026-27, Dt: 20.07. 2026 | 1. అంతర్గత మురుగునీటి పైప్‌లైన్లు మరియు మ్యాన్‌హోల్ ఛాంబర్ల మరమ్మతులు - 3 పనులు. 2. సి.సి. రోడ్డు నిర్మాణం - 2 పనులు. 3. బోర్‌వెల్ మోటార్లు మరియు పంప్‌సెట్ల మరమ్మతులు - 1 పని. | రూ. 82.50 లక్షలు | 22.07.2026 02.00 PM to 29.07.2026 02.00 PM | ఇ.ఇ., సర్కిల్-60, సిఎంసి, కుత్బుల్లాపూర్. సెల్ నెం. 7995468066 / 7331181426 |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-60, క్యూబిజెడ్, సిఎంసి.

DIPR R.O. No. : 6382-PP/CL/ADVT/2026-27, Date: 20-07-2026

# ఎల్‌నినో ప్రభావంపై మిషన్ మోడ్‌లో పనిచేయాలి

## అధికారులకు మంత్రులు పొన్నం, అజహారుద్దీన్ పిలుపు





**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కాదు.. ముందస్తు ప్రణాళికతోనే ముందుకు సాగాలి.. ప్రతి నీటి బొట్టు అమూల్యమైనది.. తాగునీరు, విద్యుత్ అవసరం మేరకే ఉపయోగించుకోవాలి.. తాగునీరు, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అధికారులు మిషన్ మోడ్‌లో పనిచేయాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహారుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రజాభవన్‌లో నైరుతి రుతుపవనాలపై ఎలనినో ప్రభావం, జిల్లాలో నెలకొన్న వర్షపాత లోటు నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా స్థాయి కంటింజెన్సీ సమీక్ష సమావేశం హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మంత్రి మహమ్మద్ అజహారుద్దీన్ మాట్లాడుతూ, తాగునీటి లీకేజీలు, వృథా, కలుషితాన్ని పూర్తిగా నివారించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జల మండలి ఎండి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి లభ్యత, జలాశయాల్లో నిల్వలు, పంపిణీ వ్యవస్థ, కార్యాచరణ సన్నద్ధతపై వివరించారు. తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిఎండీ జితేష్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ ద్వారా సమర్థవంతమైన లోడ్ నిర్వహణతో రానున్న నెలల్లో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. బల్దియా బాస్ కర్ణన్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి నిర్వహణ, పట్టణ వరదలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యానికి సంబంధించి సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సురేందర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణంగా ఈ కాలానికి 214.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 124.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై 42 శాతం వర్షపాత లోటు ఉన్నట్లు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు ప్రణాళికలతో సంసిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బాల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు జుల్ఫికర్ అలీ, కౌసర్ మొహియుద్దీన్, మహమ్మద్ ముబీన్, మజీద్ హుస్సేన్, శ్రీ గణేష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు సుందరీకరణ,సంరక్షణ,అభివృద్ధి, పునరుద్ధరణ పనులలో భాగంగా చేపట్టనున్న మురుగు నీటి మళ్లింపు (యుజిడి) పైప్‌లైన్ నిర్మాణ పనులు, చెరువు అభివృద్ధి పనులను మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇరిగేషన్ ఇఇ మల్లేష్, డిఇఇఉదయ్ భాస్కర్, ఎఇఇ లింగస్వామిలతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ పటేల్ చెరువులో కలుషిత నీరు చేరకుండా చేపడుతున్న మురుగు నీటి మళ్లింపు పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలు, నరేష్ పాల్గొన్నారు.

## సంఘసేవకులకు మాజీ ప్రధాని పివి ఎక్స్‌లెన్సీ అవార్డు




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** మాజీ ప్రధాని పివి నర్సింహ్మారావు 105వ జయంతి సందర్భంగా నగరంలోని ఆంధ్ర సారస్వత పరిషత్ హాల్‌లో ఆదివారం కళా నిలయం సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఎల్మీనేడు గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు బజారు భిక్షపతి, పోచారం గ్రామానికి చెందిన బండి శ్రీరాములకు మాజీ ప్రధాని పివి నర్సింహ్మారావు ఎక్స్ లెన్సీ అవార్డుల ప్రధానంతో పాటు వారికి మోమెంటో, ప్రసాంశా పత్రాలు అందచేసి ఘనంగా సన్మానించారు. సేవా అవార్డులకు సహకరించిన కళా నిలయం వ్యవస్థాకులు నరేందర్‌కు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి



**ప్రజాపక్షం/కొత్తూరు:** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయని మండల సర్పంచులు సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. సోమవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి ఏడు లక్షలతో గ్రామ పంచాయతీ నుండి హనుమాన్ దేవాలయం వరకు సిసి రోడ్డు పనులను సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిడి భారతమ్మ, కటికే మైబుజీ, గ్రామస్తులు డీలర్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు దేశాల రమేష్, మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి రమేష్, కాంగ్రెస్ నాయకులు మామిడి అర్జున్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అకనపల్లి సహదేవ్, డి.బుచ్చయ్య, కె.పెంటాజీ పాల్గొన్నారు.

## ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాయని ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్ వివరించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీలో తొమ్మిది లక్షలతో చేపట్టిన అండర్ డ్రైంగ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందునాయక్ మాట్లాడుతూ ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈర్ల శ్రీలత తిరుపతయ్య, ఈర్ల యాదయ్య, మల్లయ్య, లక్ష్మణ్‌నాయక్, తిక్కన్నతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత స్వయం శక్తితో ఎదగాలి



**ప్రజాపక్షం/కేశంపేట:** యువత ఉద్యోగాల కోసం ఎదురు చేడకుండా స్వయం శక్తితో స్వయంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకొని ఆర్థికంగా ఎదగాలని బోదునంపల్లి సర్పంచ్ ఎదురే నాగేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామానికి చెందిన అనాపూసల నరేష్ తలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కారు మెకానిక్ షాపును ప్రారంభించారు. యువతన ప్రైవేట్ రంగాల్లో అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎదిరే బీరప్ప, మెయిల్ గిరి యాదగిరి, వెంకటాపురం నరసింహా, ఎదిరే వెంకటేష్, ఎదిరే శ్రీకాంత్, మెంట శ్రీకాంత్, మెంట శ్రీను, బాయిగడ్డ శివ, ఆనపూసల కృష్ణయ్య, అనపూసల జంగయ్య, మల్లేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్-కొండాపూర్ మార్గంలో ట్రాఫిక్ జామ్

### భారీగా నిలిచిన వాహనాలు.. ప్రయాణికులకు తిప్పలు

**ప్రజాపక్షం/మియాపూర్ :** మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. జెన్‌పాక్ట్ ఇండియా నుండి కొండాపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. వారంలో మొదటి రోజు కావడంతోపాటు కార్యాలయాలకు వెళ్లే వేళల్లో ఈ రద్దీ ఏర్పడటంతో ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్లపై కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని రంగంలోకి దిగారు. రద్దీ ఎక్కువగా ఉన్న కీలక కూడళ్ల వద్ద అదనపు సిబ్బందిని మోహరించి రాకపోకలను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. రహదారిపై నిలిచిన వాహనాలను క్లియర్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, కొద్దిసేపట్లోనే రవాణా సాధారణ స్థితికి వస్తుందని ట్రాఫిక్ అధికారులు వెల్లడించారు. వాహనదారులు సహనం పాటించి, సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సమన్వయమే కీలకం


### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సమన్వయమే కీలకం అని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. సోమవారం సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గోల్కొండ రిసార్ట్‌లో బోర్డర్ క్రైమ్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి సిపి రమేష్ అధ్యక్షత వహించగా, హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ, సంగారెడ్డి, మెదక్, తదితర సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, సరిహద్దు ప్రాంతాల్లో జరిగే నేరాలను అరికట్టడంలో పోలీసు శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన సమాచార మార్పిడి, సంయుక్త కార్యాచరణ అత్యంత కీలకమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సిసి టివి నెట్‌వర్క్, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్‌రాష్ట్ర ముఠాలు, సైబర్ నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రతి సరిహద్దు పోలీసు యూనిట్ పరస్పరం సమాచారాన్ని వెంటనే పంచుకుంటూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఒటి ), స్పెషల్ బ్రాంచ్, సైబర్ క్రైమ్ తదితర విభాగాల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఆయా విభాగాల అధికారులు తమ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, ఎదురవుతున్న సవాళ్లు, నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు, పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేసే అంశాలపై, కార్యాచరణ ప్రణాళికలు, అమలు వ్యూహాలను సమావేశంలో వివరించారు. రౌడీ షీటర్లు, చరిత్ర కలిగిన నేరస్తులు, అంతర్‌రాష్ట్ర ముఠాల కదలికలపై సమాచార మార్పిడి, సంయుక్త చెక్‌పోస్టులు, పెట్రోలింగ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా తక్షణ సమాచార వినిమయం, మిస్సింగ్ వ్యక్తులు, గుర్తు తెలియని మృతదేహాల వివరాల భాగస్వామ్యం, సిసి టివి కవరేజ్ విస్తరణ, సైబర్ నేరాలపై సమన్వయం, విఐపి బందోబస్తు, మతపరమైన పండుగలు, భారీ కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, సామాజిక ఉద్రిక్తతల నివారణ, సహజ విపత్తుల సమయంలో సంయుక్త చర్యలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో జాయింట్ సిపి(ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, హైదరాబాద్ జాయింట్ సిపి(ట్రాఫిక్) జోయెల్ డావిస్, కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్, కుత్బుల్లాపూర్ డిసిపి ఎన్.కోటిరెడ్డి, శేరిలింగంపల్లి డిసిపి చింతమనేని శ్రీనివాస్, ట్రాఫిక్ డిసిపి ఐ శేషాద్రిని రెడ్డి, డిసిపి(క్రైమ్స్)ముత్యం రెడ్డి, డిసిపి (స్పెషల్ బ్రాంచ్) వైవిఎస్ సుధీంద్ర, డిసిపి(మహిళా, శిశు భద్రత విభాగం) సృజన కరణం, డిసిపి (సైబర్ క్రైమ్స్) పుష్ప, రోడ్ సేఫ్టీ విభాగం అధికారులు, మేడ్చల్ ఎస్ఒటి డిసిపి శోభన్ కుమార్, ట్రాఫిక్ డిసిపి2 రవికుమార్, వివిధ సరిహద్దు కమిషనరేట్లు, జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## పండ్ల మొక్కలతో పచ్చని భవిష్యత్తు

### హైదరాబాద్ మావేరిక్స్ క్లబ్ అధ్యక్షుడు అజయ్ కుమార్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పండ్ల మొక్కలతో పచ్చని భవిష్యత్తుకు శ్రీకారం చుట్టవచ్చునని, నేడు నాటిన ఒక చిన్న మొక్క రేపటి తరాలకు నీడ, పండ్లు, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యాన్ని అందించే మహావృక్షంగా ఎదుగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావేరిక్స్ అధ్యక్షురాలు అజయ్ కుమార్ అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావేరిక్స్ వారి సహకారంతో రావి నారాయణ రెడ్డి కాలని ఫజ్ 3 భూపోరాట కేంద్రంలో వివిధరకాల పండ్లను అందించే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇది కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదు. సమాజం, ప్రకృతి, భవిష్యత్ తరాల పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేసిన ఒక స్ఫూర్తిదాయక ఉద్యమంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అఫ్ హైదరాబాద్ మావేరిక్స్ కార్యదర్శి పగడాల భార్గవి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు సురేష్ బాబు, ఉపాధ్యక్షులు మాధవి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సీత ఆనంద్, మెంబర్షిప్ డైరెక్టర్ శేఖర్ గోగినేని, డైరెక్టర్ విజయలక్ష్మి, డైరెక్టర్ మెంటల్ హెల్త్ వరలక్ష్మి, వాసిరెడ్డి నాగేశ్వర రావు, డైరెక్టర్ లిటరసీ, సతీష్, ప్రసన్న, మధుసూదన్‌రావు, రత్నాకర్, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయకార్యదర్శి కేతారాజు నర్సింహా పాల్గొన్నారు.

## మంచినీటి కష్టాలు తీర్చండి

### మాజీ కార్పొరేటర్ నర్సింహా రెడ్డి

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత, అని కాలి బిందెలతో నిరసన చేయాల్సిన పరిస్థితి రావడం ప్రస్తుత పాలకుల వైఫల్యానికి నిదర్శనం అని మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు సోమవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో నెలకొన్న తీవ్ర త్రాగునీటి సమస్యను స్థానికులు మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన కాలనీని సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ వీకర్ సెక్షన్ కాలనీలో ఇండ్లకు సంబంధించిన బోర్లు అన్ని ఎండిపోయాయని నీరు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు అనుగుణంగా మంచి నీరు సరఫరా చేయాల్సింది పోయి ప్రజలు కాలీ బిందెలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని తీవ్రంగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు కాసాని అశోక్ యాదవ్, పరమేష్ యాదవ్, గోనెల స్వామి, మల్లేష్, యాదగిరి, రాములు, రాజశేఖర్ రెడ్డి, చందర్,వనమ్మ, దమయంతి, ప్రేమలత, లక్ష్మి, అరుణ, ప్రభావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

### రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఎం.సుజాత



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వర్షాలు జూలై 31 వరకు కురవని పక్షంలో రైతులు చేపట్టవలసిన ప్రత్యామ్నాయ పంటలపై రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఎం.సుజాత పలు సూచనలు చేశారు. వర్షపాతం నమోదు కాకపోతే, రైతులు నష్టాలను తగ్గించుకొని అందుబాటులో ఉన్న తేమను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు కింది ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని డిఎఒ తెలిపారు. అందులో భాగంగా వరి: మిగిలిన వరి సాగు విస్తీర్ణంలో టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు, కాకర, బీర, వంకాయ, ఆకుకూరలు వంటి కూరగాయల సాగు, అలాగే ఆయిల్ పామ్, పండ్ల తోటలు, పూల సాగు చేపట్టవచ్చు. అదనంగా మొక్కజొన్న తోపాటు కంది లేదా కంది, జొన్న(1:4)అంతర పంట విధానాన్ని అనుసరించవచ్చు అని తెలిపారు. అదేవిధంగా జొన్న మిగులు విస్తీర్ణంలో ఉలవలు సాగు చేయవచ్చు. అవసరమైన విత్తనాలు రైతుల వద్దే అందుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాకుండా మొక్కజొన్న ను మిగులు విస్తీర్ణంలో ఆముదం, చిరుధాన్యాలు,కూరగాయల సాగు చేపట్టాలని సూచించబడింది. విత్తనాలు గుర్తింపు పొందిన విత్తన విక్రేతల వద్ద అందుబాటులో ఉంటాయాన్నారు. పత్తి సాగు సాధ్యం కాని ప్రాంతాల్లో అలసంద,మేత జొన్న(ఫాడర్ జోవర్),స్వల్పకాలిక కంది రకాలను సాగు చేయాలి. అలసంద, కంది విత్తనాలు విత్తన విక్రేతల వద్ద అందుబాటులో ఉన్నాయి. మేత జొన్న విత్తనాలను పశుసంవర్ధక శాఖ 75 శాతం రాయితీపై పంపిణీ చేస్తుంది. రైతులు స్వంత విత్తనాలను కూడా వినియోగించుకోవచ్చు. స్వల్పకాలిక కంది రకాల సాగును ప్రోత్సహిస్తున్నారు. విత్తనాలు విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. వివరములకు ఆయ మండల వ్యవసాయ విస్తరణ అధికారిని కానీ మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సుజాత తెలిపారు.

## ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు తీసుకెళ్లేందుకు కృషి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇబ్రహీం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లెందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇబ్రహీం వివరించారు. సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్ళంతుకు కృషి చేస్తానని వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డికి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి తెలిపారు.



## సిద్దాపూర్ డంపింగ్‌యార్డు రద్దు చేయాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జంగయ్య

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పచ్చని పంట పొలాల మధ్య చిచ్చుపెట్టేందుకే ప్రభుత్వం మరోమారు చెత్త డంపింగ్ ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య ఆరోపించారు. సోమవారం షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మండలాల కార్యదర్శులు, ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలతోపాటు గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడే అస్కారం ఉంటుందన్నారు. సిద్దాపూర్‌లో పారిశ్రామిక ప్రాంతం ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం రైతుల నుండి భూములు సేకరించి ఇవ్వడం జరిగిందని వివరించారు. కానీ ఈ ప్రభుత్వం మాత్రం చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పచ్చని పొలాల మధ్య విషం చిమ్ముతున్న కాలుష్య చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం సరైన పద్దతి కాదని హెచ్చరించారు. జారీ చేసిన జిఒను తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ కొత్తూరు మండల కార్యదర్శి ఎండి షకీల్, కేశంపేట మండల కార్యదర్శి గోవింద్ నాయక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, జిల్లేడు చౌదరిగూడ మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్, కొందుర్గు మండల కార్యదర్శి బాగాళ్ళ నరసింహా, ఆకాష్ నాయక్, ఎండి మహ్మముద్ తదితరులు పాల్గొన్నారు.



GREATER HYDERABAD మహానగరి
GREATER HYDERABAD
హైదరాబాద్
మంగళవారం
21-07-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily




## కొంపల్లి లో 'వన్డే వన్ వార్డ్'

**ప్రజాపక్షం/దుండిగల్ :** వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా సిఎంసి కమిషనర్ జి.సృజన, ఐఎఎస్ కొంపల్లి సర్కిల్ 56 పరిధిలోని కొంపల్లి వార్డ్ లోని నార్త్ ఎన్‌సిఎల్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భం గా కాలనీ లోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నివాసులతో సమావేశం నిర్వహించి పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, వర్షపు నీటి పారుదల, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించాలని సిఎంసి కమిషనర్ ఆదేశించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించడమే వన్ డే వన్ వార్డ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఎఎస్, డిప్యూటీ కమిషనర్ డి.లావణ్య, మేడ్చల్ ట్రాఫిక్ ఎసిపి వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అల్లం రవి కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.విరాట్ రాజ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.తిరుపతి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఐ.రాణి, యుబిడి అధికారులు, హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ స్క్రీనింగ్ లక్ష్యాలను చేరుకోవాలి

### డిఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ నిర్వహణ ఆశించిన మేరకు లేదని, స్క్రీనింగ్ లక్ష్యాలను చేరుకొనేలా మరింత సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం మల్లాపూర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు ఏ మేరకు కొనసాగుతున్నాయన్న విషయాలను సమీక్షించారు. మాతా శిశు ఆరోగ్య కిట్లను అర్హులైనా వారికి సకాలంలో అందేలా చూడాలని, క్షయవ్యాధి నియంత్రణ విషయంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందించే ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు చేరేలా చూడాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని ఐఎల్‌ఆర్‌ను తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ వ్యాక్సిన్ల నిలువ, ఉష్ణోగ్రత సక్రమంగా ఉండేలా ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

## అలియాబాద్ హెచ్‌బిఎల్ బస్టాప్‌లో బస్సులు నిలపండి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్‌లో హెచ్‌బిఎల్ రిక్వెస్ట్ బస్టాప్ వద్ద ఆర్‌టిసి బస్సులు నిలపడం లేదని హాకింపేట డిపో మేనేజర్ సరితకు అలియాబాద్ మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. అలాగే లాల్‌గడి మలక్‌పేటలోని అంబేద్కర్ కాలనీ వద్ద రిక్వెస్ట్ స్టాప్‌లో బస్సులు ఆపడం లేదని కౌన్సిలర్ కైర గణేష్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మలక్‌పేట గ్రామానికి నూతన బస్ సర్వీస్‌ను ప్రారంభించాలని డిపో మేనేజర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ తప్పకుండా రిక్వెస్ట్ బస్టాప్‌ల వద్ద ఆర్‌టిసి బస్సులను ఆపుతామని ప్రయాణికులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గాదె వెంకటేష్, కైర గణేష్‌లు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాలను పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట రెవెన్యూలో అక్రమ నిర్మాణలు జోరుగా నడుస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అలియాబాద్ మున్సిపల్ ప్రజలు ఆరోపిస్తున్నారు. మలక్‌పేట చెరువు సమీపంలో షెడ్లు, వాటర్ సంపులు, అనుమతులు లేని భవనాలు వెలుస్తున్నాయని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయకుండా అధికారులు కార్యాలయానికే పరిమితం అవుతున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. నూతనంగా ఏర్పాటైన మున్సిపల్‌ను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అదికారులపై ఉందని కోకొల్లలుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని దీంతో మున్సిపల్‌కు రావాల్సిన ఆదాయానికి గండిపడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బఫర్‌జోన్, చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నట్లు సమాచారం. అక్రమ నిర్మానాలపై కొరడా ఝులిపించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పేకాట స్థావరంపై దాడి...12 మంది అరెస్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నిషేదిత జూదం నిర్వహిస్తున్న 12 మందిని అరెస్టు చేసిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్‌జికె డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్ 1లోని బ్లాక్ నంబర్1లో 5వ అంతస్తు గది నంబర్ 501లో దాడిచేసి నగదు పందెం పెట్టి నిషేధిత జూదం ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసకున్నారు. విచారణలో ఎంజి బేగ్ జూదం నిర్వహిస్తున్నట్లు ఎండి అమీరుద్దీన్ అతనికి సహకరిస్తున్నట్లు గుర్తించారు. నిందితుల నుండి 16 వేల 900 రూపాయల నగదు,19 పేకాట ముక్కలు,13 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.



# అధ్యాపకులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధ్యాపకులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి సూచిం చారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సిఎస్‌టిడి), సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ (సిఒఇఎల్) సంయుక్తంగా వారంరోజుల పాటు నిర్వహించనున్న మైక్రో క్రెడెన్షియల్ డెవలప్మెంట్‌పై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్. డి.పి.) శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ పొందిన అధ్యాపకులు రూపొందించిన మైక్రో క్రెడెన్షియల్స్‌లో పట్టు సాధించడం వల్ల ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు వీలవుతుందన్నారు. అధ్యాపకుల అభివృద్ధికి తోడ్పడేలా అధునాతన డిజిటల్ సాంకేతికతలతో కూడినఐసిటి ల్యాబ్‌లను ప్రారంభించామన్నా రు.

ప్రయోగశాలలు సాంకేతికత ఆధారిత విద్యా బోధనకు కేంద్రంగా, ఆన్‌లైన్, బ్లెండెడ్ లెర్నింగ్ కార్యక్రమాలను అందిం చే విధంగా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. పుష్ప చక్రపాణి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు మైక్రో క్రెడెన్షియల్ డెవలప్‌మెంట్ వంటి ఎఫ్.డి.పి. శిక్షణా కార్యక్రమాలు, స్కూల్ టీచర్లకు త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై శిక్షణ వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. శ్రీదేవి, ప్రొఫెసర్ పల్లవి కాబ్డే, ప్రొఫెసర్ రవీంద్రనాథ్ సోలమన్, ప్రొఫెసర్ సుధారాణి, ప్రొఫెసర్ ఆనంద్ పవార్, ఒఇఆర్ నిపుణురాలు సుషమ్న రావు, పలు విభాగాల డీన్లు, తెలంగాణలోని పలు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఎలకు సహకరించాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఆగస్టు 3న ముగియనున్న దృష్ట్యా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తమతమ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్క ఓటరు నమోదు అయ్యేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పిలుపిచ్చారు. ఆనంద్‌బాగ్‌లో సోమవారం నిర్వహించిన మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తూ పూరించిన వాటిని తిరిగి తీసుకొంటున్న బిఎల్‌ఏలకు సహకరించటం, ఓటర్ల కు ఎస్ఐఆర్ విషయంలో అవగాహన కల్పించటం, కొత్త యువ ఓటర్ల పేర్లు నమోదు అయ్యేలా చూడటంలో కాంగ్రెస్ శ్రేణులు బాధ్యత వహించాలన్నారు. నియోజకవర్గంలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకులు సమీర్ కౌశిల్ , మాజీ కార్పొరేటర్ జితేంద్రనాథ్, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట లక్ష్మి కాంతరెడ్డి, బిబ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బికె శ్రీనివాస్, గుండా నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## సూరారం, శివాలయ నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

### బాధితులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కూన



**ప్రజాపక్షం/నిజాంపేట్:** కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధిలోని సూరారం, శివాలయ నగర్‌లో సర్వేనంబరు 49 ప్రభుత్వ స్థలంలో అక్రమంగా రాత్రికి రాత్రి నిర్మాణాలను చేపడుతున్నారు. విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీమ్‌ల ఆధ్వర్యంలో నిర్మాణాలను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అక్కడికి చేరుకుని ఇళ్ల కూల్చివేతలపై అధికారులతో మాట్లాడి తాత్కాలికంగా నిలిపివేయించారు. శ్రీశైలం గౌడ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేవిధంగా చూస్తానని స్థానికుల కు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నిరుపేదలు నివసించే బస్తీల్లో రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపడితే సహించేది లేదని అన్నారు. బడా వ్యాపారస్థులు, బడా సంస్థల యా.జమాన్యాలు కబ్జా చేసిన ప్రభుత్వ స్థలాల్లో కూల్చివేతలను చేపట్టి స్థలాలను కాపాడాలని హెచ్చరించారు. శివాలయనగర్ బాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



## యువశక్తికి సాధికారత బాట

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు ఉపాధి నైపుణ్యాలు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సాధికారత శిక్షణా కార్యక్రమం విద్యార్థుల్లో విశేష స్పందన పొందింది. ఐఈఈఈఎస్ఐటి విద్యార్థి విభాగం సమాచార సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో టాస్క్ సిన్‌క్రోనీ ఏపెన్ సహకారంతో జులై17న యువ సాధికారత అంశంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ డి క్రూజ్ సారి సిన్హా యువతకు నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం ఉపాధి నైపుణ్యాలు వృత్తి అవకాశాలు సామాజిక బాధ్యత వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. డా.జివిఎల్. ఆనంద్ బాబు, డా.నితీషా శర్మ, శేఖర్ రెడ్డి, పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.యువత సమగ్ర అభివృద్ధికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో స్టాన్లీ డిక్రూజ్ సారి సిన్హాలను జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పండుగ ఏర్పాట్లు పూర్తి చేయాలి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** త్వరలో జరుగనున్న బోనాల పండుగ సందర్భంగా నియోజకవర్గంలో వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మెరుగు పరచటం, మౌలిక సదుపాయాలు కలిగించటంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు పూర్తిస్థాయిలో తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం ఆయన ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాను కల్సి సమర్పించిన వినతిపత్రంలో చిలుకానగర్ డివిజన్ సమస్యలతో పాటు వివరంగా తెలియచేసారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, అభయాంజనేయ స్వామి గుట్ట, మైసమ్మ గుడి ప్రాంతాల నుండి వచ్చే నీరు, డ్రైనేజి నీటి అవుట్‌లెట్ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. అదే విధంగా చిలుకానగర్ చౌరాస్తాలోని హనుమాన్ ఆలయం నుండి మైసమ్మ ఆలయం వరకు రోడ్డు పనులకు ఇప్పటికే ఆమోదం లభించినప్పటికి సగం వరకు వేసిన రోడ్డు పనులను కొనసాగించక పోవటం వల్ల కలుగుతున్న ఇబ్బందుల నేపథ్యంలో త్వరలో మిగిలిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. బిఆర్‌ఎస్ శ్రేణులు గుడి మధుసుధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చేర్యాల శ్రీనివాస్, గడ్డం పాపిరెడ్డి తదితరులు ఎమ్మెల్యేతో పాటు జడ్‌సిని కలిసిన వారిలో ఉన్నారు.

## పండుగకు ముందే 8వ డివిజన్ కళకళలాడేలా చర్యలు



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** బోనాల మహోత్సవాలు సమీపిస్తున్న వేళ పోచారం 8వ డివిజన్‌లో పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించాలని కోరుతూ ఘట్‌కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ ఉప్పల్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. పోచారం 8వ డివిజన్‌లో అనేక ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయక రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కొద్ది రోజుల్లో బోనాల మహోత్సవాలు ప్రారంభం కానుండటంతో ఆలయాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భద్రతను దృష్టిలో ఉంచుకుని పనిచేయని దీపాలన్నింటినీ మరమ్మతు చేయాలని అవసరమైన చోట కొత్త దీపాలను ఏర్పాటు చేసి పండుగకు ముందే మొత్తం డివిజన్ వెలుగులతో కళకళలాడేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిని స్వీకరించిన జోనల్ కమిషనర్ రాధిక సమస్యను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రెండు వివాహాలతో అప్పులు...బైకు చోరీలు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రెండుసార్లు వివాహాలు చేసుకుని తన కుటుంబానికి ఏర్పాడిన రూ. 9 లక్షల అప్పులతో సతమతమవుతున్న ఓ యువకుడు స్నేహితుడితో కల్సి బైకు చోరీలు చేసి వాటిని తక్కువ మొత్తానికి అమ్మి సొమ్ము చేసుకొంటూ చివరికి కటకటాలపాలయ్యాడు. నేరేడ్‌మెట్ పోలీసులు వాహనాలు సోమవారం తనిఖీ చేస్తున్న క్రమంలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా చోరీ చేసిన బైకుపై తిరుగుతున్న మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన కార్ డ్రైవర్ గుడిసె శ్రీకాంత్ (32)ను అనుమానాస్పదంగా కనిపించటంతో అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి విచారణలో తన స్నేహితుడు సతీష్‌తో కల్సి వివిధ ప్రాంతాల్లో బైకు చోరీలు చేస్తూ ప్రవీణ్ అనే వ్యక్తికి అమ్ముతున్నానని చెప్పాడు. దీంతో చోరీ వాహనాలు కొనుగోలు ప్రవీణ్‌ను సైతం అదుపులోకి తీసుకొన్న పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి స్నేహితుడు సతీష్ కోసం గాలిస్తున్నామని మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ మీడియా సమావేశంలో తెలిపారు. నిందితుడి నుండి 11 చోరీ చేసిన బైకులను స్వాధీనం చేసుకొన్నామన్నారు. బైకు చోరీల కేసులను ఛేదించటంలో విశేషంగా కృషి చేసిన నేరేడ్‌మెట్ పోలీసుల బృందంలోని ఎస్సై చంద్రశేఖర్, ఏఎస్సై జాకబ్, కానిస్టేబుళ్లు బాలకృష్ణ(5085), గౌతంకుమార్ (11334),జోరాజు (11594), డి.శ్రీనివాస్( 11537), రాఘవాచారి (5995), ఉదయ్‌కుమార్‌లను డిసిపి అభినందించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే తమ వాహనాలను పార్కింగ్ చేయాలని, డిస్క్, వీల్, హ్యాండిల్ లాక్‌లాంటివి ఏర్పాటు చేసుకొంటూ అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైతే జిపిఎస్ ట్రాకింగ్, యాంటీ థెఫ్ట్ అలారం లాంటివి సైతం ఏర్పాటు చేసుకోవాలని, సిసిటివిలు ఉండేలా చూసుకోవాలని డిసిపి సూచించారు.



## నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/దౌల్తాబాద్:** వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలోనికడ పరిధిలోని దుద్యాల్, హకీంపేట్ ఇంటిగ్రెటెడ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పరిశీలించనున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రాతో కలిసి కలెక్టర్ దీపక్‌తివారి పరిశీలించారు. హెలిప్యాడ్, ఇంటిగ్రెటెడ్ ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మొత్తం 9బ్లాక్‌లలో బారికేడ్లు, పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ ఎస్‌పి రాజేష్ మానా, డిఎస్‌పి శ్రీనివాస్, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందు భద్రతా సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి పర్యటన మార్గం హెలిప్యాడ్, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ, వైద్యం, అగ్నిమాపక, తదితర వాటిపై అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆలయ భూములను స్వాధీనం చేసుకోండి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** హైకోర్టు ఆదేశాల ప్రకారం జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలాన్ని సుమారు 14ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే నెలలో హైకోర్టు తీర్పునిస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలకు పూనుకోలేదని, దానివల్ల మిగతా భూమి కూడా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే హై కోర్టు ఇచ్చిన తీర్పుని అనుసరించి భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, బాబు, తదితరులు పాల్గొన్నారు.



## అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

### విద్యుత్ కార్యాలయ ఆవరణలో మద్యం సీసాలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలు అందించేందుకు నిర్మించిన ప్రజా ప్రయోజన కేంద్రాలు. అలాంటి పవిత్రమైన ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. కానీ దీనికీ విరుద్ధంగా వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల కేంద్రంలో గల విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ఖాళీ మద్యం సీసాలతో దర్శనమిస్తోంది. కార్యాలయ ప్రాంగణంలో అక్కడక్కడా ఖాళీ మద్యం సీసాలు పడి ఉండటాన్ని కార్యాలయానికి వచ్చిన ప్రజలు గమనించి అధికారులు విధులు నిర్వహిస్తున్నారా లేదా మద్యం త్రాగుతున్నారా అని విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ ఆవరణలో మద్యం సేవించిన వారెవరు, సీసాలు అక్కడికి ఎలా చేరాయి అనే విషయాలపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఘనంగా మున్సిపల్ చైర్మన్ జామ్ రవి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి జన్మదిన వేడుకలు సోమవారం మూడుచింతలపల్లిలో ఘనంగా నిర్వహించారు. మూడుచింతలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్పోర్ట్స్ డ్రెస్‌లను కుటుంబ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. అలాగే జగ్గంగూడలోని వికలాంగుల ఆశ్రమంలో అనాథల మధ్య కేక్‌కట్ చేసి జన్మదినం జరుపుకున్నారు. ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదానం చేశారు. ఎంసిపల్లి గ్రామానికి చెందిన ఏక్‌నాథ్ అనే వ్యక్తి పక్షవాతంతో అనారోగ్యం పాలైయ్యాడు. ఎక్‌నాథ్ కూతురు శిల్ప ఉన్నత చదువులకు రూ.10వేలు అందజేశారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బం ది చైర్మన్ జాం రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీరజ్‌గౌడ్, నవీన్‌నాయక్, నాయకులు బాబు, తదితరులు పాల్గొన్నారు.



## ఎఐఎస్ఓ వినతిపత్రం



**ప్రజాపక్షం/నాంపల్లి:** సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా ఫుల్ స్టాక్ అకాడమీ బీబీఏ కోర్సును నిర్వహిస్తున్నట్లు వెలుగులోకి వచ్చిందని.. ఈ అక్రమ చర్యలో అక్షదీప్ డిగ్రీ కాలేజ్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తూ, ప్రైవేట్ అకాడమీకి సహకరించి ప్రజలను విద్య పేరుతో దోచుకుంటున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయని తెలంగాణ ఎఐఎస్ఓ కన్వీనర్ జి.రమేశ్ కుమార్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు.

## సమస్యలు పరిష్కరించుకోవాలి



**ప్రజాపక్షం/చార్మినార్:** బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జెడ్సి కన్నం సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు జెడ్సి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజలు సమస్యలపై ఫిర్యాదులు చేయడం జరిగింది. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, జోనల్ ఏయంసీ రాజారావు, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/లాల్‌దర్వాజా:** చారిత్రక అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 78వ బోనాల వార్షిక ఉత్సవాల ఆహ్వాన పత్రికను మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బంజారాహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ తరపున బోనాల ఉత్సవాల నిర్వహణకు అన్ని రకాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో ఈ సారి కర్ణాటక రాష్ట్రం నుంచి లక్ష్మీ ఏనుగు పాల్గొనడం జరుగుతుందని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ఆర్.ప్రభాకర్, కార్యదర్శి కె.దత్తాత్రేయ, ప్రతినిధులు జగ్మోహన్ కపూర్, ఏ.సతీష్, ఎస్‌పి.క్రాంతి కుమార్, ఎం.వినోద్ కుమార్, సాయికిరణ్, రవీందర్ చారి, ఎల్.అరుణ్, సాహిల్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## మెట్టు పుట్టినరోజు వేడుకలు



**ప్రజాపక్షం/గోషామహల్:** తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాన్ని గోషామహల్ బిబ్లాక్ వైస్ ప్రెసిడెంట్ సైనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శ్రీనివాస్, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

## శాంతి నవయువక సంఘం సమావేశం



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** రానున్న బోనాల జాతరను పురస్కరించుకొని గోల్నాక శాంతి నవయువక సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘం సలహాదారులు కత్తుల సుదర్శన్, కొండపు రాజు, కట్టెల సతీష్, కర్రె సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో సంఘం నూతన ప్రధాన కార్యదర్శిగా రాచమల్ల సాయి మహేష్(ఆర్ఎస్ మహేష్)ను నియమిస్తూ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సంఘం సభ్యులు రెడ్డపాక రాము, రంగుల వేణు, రెడ్డిపాక కన్న, రెడ్డపాక శ్యామ్, రెడ్డపాక బాలకృష్ణ, రంగుల రాజేష్, ఉదయ్, సురేష్, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఇకెవైసి కేంద్రాలు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక ఈకేవైసీ కేంద్రాలను పౌరసరఫరాల శాఖ సహాయ అధికారిణి డి.దీప్తి సోమవారం సందర్శించారు. అంతేకాకుండా అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె అధికారులతో కలిసి రేషన్ షాపులు, ప్రత్యేక కేంద్రాలకు రాని చేతగాని వృద్ధులు, దివ్యాంగుల ఇండ్లకు వెళ్లి వారితో ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 31వ తేదీ వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు.

## సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

**ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ:** జూలై 23 నుంచి జరిగే పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఓయూ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు సిలబస్ పూర్తికాలేదని ఆరోపిస్తూ ఓయూ పరిపాలన భవనం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. యూజిసి నెట్, సీఎస్ఐఆర్ పరీక్షలతో పాటు ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవాల కారణంగా ఈ అకాడమిక్‌లో కొంత నష్టపోయినట్లు చెప్పారు. దీనికి తోడు సైన్స్ కళాశాలలోని ఏ డిపార్ట్‌మెంట్‌లోనూ సిలబస్ పూర్తి కాలేదని వాపోయారు. ఈ విషయంపై వర్సిటీ ఉపకులపతి ఆచార్య కుమార్‌కు వినతిపత్రం అందించినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు.

# సిఎంసి ప్రజావాణిలో... 37 పౌర ఫిర్యాదుల స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పౌరుల నుంచి వివిధ రకాల సేవలకు సంబంధించి మొత్తం 37 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖాధిపతులను అధికారులు ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడి కేటాయించామని, దీని ద్వారా పౌరులు తమ ఫిర్యాదుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ గీతారాధిక, సుభద్రాదేవి, చీఫ్ సిటీప్లానర్ బి. వెంకన్న, చీఫ్ ఇంజనీర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఆకట్టుకున్న 'ఆరూహి' భరత నాట్య ప్రదర్శన

**ప్రజాపక్షం / రవీంద్రభారతి:** తొమ్మిదేళ్ల చిన్నారి భరత నాట్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకొన్నది. అచ్యుత డ్యాన్స్ అకాడమీ గురువు ఎం. ప్రియాంక ఆశీర్వాదంతో, తల్లిదండ్రులు దోమ్మాటి సంజు, స్వర్ణ దీవెనలతో కుమార్తె ఆరూహి భరత నాట్య ప్రదర్శన ఆహూతులను ఆకర్షించింది. నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ బోనాల జాతర –2026 కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపి ఆర్.కృష్ణయ్య చిన్న వయసులోనే అద్భుతంగా భరత నాట్య ప్రదర్శన చేసిన ఆరూహిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రదర్శనలిచ్చి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. అనంతరం కృష్ణయ్య ఆరూహికి అవార్డు, మెమోంటో ఇచ్చి, అభినందించారు.



## ఒసి జారీని సి అండ్ డి వ్యర్థాల తరలింపుతో.. అనుసంధానం చేయాలి : ఎంఎంసి కమిషనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్త భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసి) జారీని సి అండ్ డి వ్యర్థాల తరలింపు ఆధారాలతో అనుసంధానం చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మౌలాలి సర్కిల్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ, జెజె నగర్, నిర్మలానగర్, సైనిక్‌పురి ఎక్స్ రోడ్ ప్రాంతాల్లో సోమవారం సమగ్ర క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, పచ్చదనం, నిర్మాణ వ్యర్థాల (సి అండ్ డి) నిర్వహణపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హోటళ్లు, చికెన్ సెంటర్లు, కూరగాయల మార్కెట్ల వద్ద వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ చేపట్టాలని, సాట్ ఆటోలకు అనుసంధానం కాని ఇళ్లను గుర్తించి జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. రోడ్లను ఆక్రమించి నిర్మించిన సిమెంట్ ర్యాంపులను తొలగించాలన్నారు. అలాగే ప్లాంటర్ బాక్సుల్లో కలుపు మొక్కలను తొలగించి, అవెన్యూ ప్లాంటేషన్ సంరక్షణకు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సహకారంతో ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని వ్యాపార సంస్థలు తమ ట్రేడ్ లైసెన్స్, ఫాసీ పత్రాలను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని కమిషనర్ సూచించారు.





## ఖాళీ స్థలాల్లో, రోడ్ల పక్కన చెత్త వేయవద్దు

### అక్రమంగా చెత్త వేస్తే కఠిన చర్యలు
### సిఎంసి అదనపు కమిషనర్ వేణు గోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో చాలా కాలంగా పేరుకుపోయిన లెగసీ వ్యర్థాలు, నిర్లక్ష్యంగా పారేసిన చెత్తను వేగవంతంగా తొలగించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ లిమిటెడ్ (హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ) సహకారంతో 'బియాండ్ రొటీన్ ఎక్స్‌ట్రా అవర్ సర్వీస్' పేరుతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. సిఎంసి అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) వేణుగోపాల్ రెడ్డి టిప్పర్ వాహనాలు, లోడింగ్ యంత్రాలను జెండా ఊపి ఈ డ్రైవ్‌ను ప్రారంభించారు. మొదటి దశలో కూకట్‌పల్లి జోన్ పరిధిలోని శ్రీలా పార్క్ ప్రైడ్ రోడ్ వద్ద వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నిత్య పారిశుద్ధ్య పనులకు అదనంగా ప్రత్యేక సిబ్బందితో ఈ కార్యక్రమాన్ని అన్ని జోన్‌లలో విస్తరిస్తామన్నారు. ఖాళీ స్థలాల్లో, రోడ్ల పక్కన చెత్త వేయకుండా ప్రజలు, వ్యాపారులు సహకరించాలని, తడిపొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలని కోరారు. అక్రమంగా చెత్త వేస్తే కఠిన చర్యలు ఉంటాయని, వాణిజ్య సంస్థలకు 'నో బిన్ నో ట్రేడ్' విధానాన్ని కఠినంగా అమలు చేస్తామని వేణు గోపాల్ రెడ్డి హెచ్చరించారు.





## ఔటర్ రింగ్ రోడ్డుపై పచ్చదనం నిర్వహణకు ఆధునిక సాంకేతికత

### యంత్రాలతో గ్రీనరీ నిర్వహణ
### డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌కు ప్రతిష్ఠాత్మకంగా నిలిచిన నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)పై పచ్చదన నిర్వహణను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా చేపడుతున్నారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ యూరప్ నుంచి దిగుమతి చేసిన ప్రత్యేక యాంత్రిక పరికరాలతో గ్రీనరీ నిర్వహణను వేగవంతం చేస్తున్నారు. ఒక్కో యంత్రం ధర సుమారు రూ.10 లక్షలు కాగా, ఓఆర్ఆర్ నిర్వహణ సంస్థ వీటిని వినియోగంలోకి తీసుకొచ్చింది. ఈ ఆధునిక యంత్రాల ద్వారా రోజుకు 5 నుంచి 7 కిలోమీటర్ల మేర గడ్డి, పొదలను కత్తిరించే సామర్థ్యం ఉంది. ఇదే పనిని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించాలంటే 10 మంది కార్మికులు ఐదు రోజుల పాటు పనిచేయాల్సి వస్తుంది. దీంతో సమయం, వ్యయం తగ్గడంతో పాటు నిర్వహణ పనుల సామర్థ్యం గణనీయంగా పెరుగుతోంది. ప్రధాన రహదారిపై నిర్వహణ పనుల సందర్భంగా గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు, ప్రాణనష్టాలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎండిఏ క్రమంగా మానవ శ్రమపై ఆధారపడే విధానానికి స్వస్తి పలుకుతోంది. రహదారిపై పనిచేసే సిబ్బంది, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని యాంత్రిక పద్ధతులను విస్తృతంగా అమలు చేస్తోంది. నీటి ట్యాంకర్ల రాకపోకలను పూర్తిగా తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసే చర్యలు ప్రారంభమయ్యాయి. డ్రిప్ స్ప్రింక్లర్ల ద్వారా మొక్కలకు అవసరమైన నీటిని నేరుగా అందించే విధానాన్ని అమలు చేయనున్నారు. దీని వల్ల నీటి వినియోగంలో పొదుపుతో పాటు ఓఆర్ఆర్‌పై ట్యాంకర్ల సంచారం తగ్గి రహదారి భద్రత మరింత మెరుగుపడనుంది.





## నిమ్స్‌లో బాలింతలకు హరీశ్‌రావు పరామర్శ

**ప్రజాపక్షం/పంజాగుట్ట:** నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలింతలను మాజీ మంత్రి హరీశ్ రావు పరామర్శించారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి బాలింతల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధితుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కాగా, ఈ నెల 13న సిజేరియన్ వికటించి ఐదుగురు బాలింతలకు తీవ్ర అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హరీష్‌రావు నిమ్స్‌కు వెళ్లి పరామర్శించడం జరిగింది.

## సబ్బండ వర్గాలకు న్యాయం చేయాలి

### -మాజీ ఎఐసిసి సభ్యుడు బక్క జడ్సన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, రైతులు, సాంస్కృతిక కళాకారులు, ప్రకటన రంగ ప్రతినిధులు, ఇతర ఉద్యమకారులకు న్యాయం చేయాలని, తెలంగాణ ఉద్యమ ఆశయాల అమలుపై సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయాలని మాజీ ఏపీపీసీసీ చైర్మన్, మాజీ ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు.

## వరుణ జపం

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు తొలగి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ జూలై 21 ఉదయం 8.30 నుంచి 11గంటల వరకు ఉస్మాన్‌సాగర(గండిపేట్) జలాశయంలో చిలుకూరు బాలాజీ ఆలయం ఆధ్వర్యంలో వరుణ జపం నిర్వహించనున్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు సిఎస్ లక్ష్మీ నరసింహన్ నేతృత్వంలో ఆలయ అర్చకులు, వేదపండితులు నడుములోతు నీటిలో నిలబడి వైదిక అనుష్ఠానాన్ని నిర్వహిస్తారు. వేదభవనానికి చెందిన డా.వి.శ్రీరామ ఘనపాటి నాయకత్వంలో ఋత్వికులు తైత్తిరీయ సంహితలోని వరుణ జప మంత్రాలను 108 సార్లు పారాయణం చేయనున్నారు. రాష్ట్రంలోని చెరువులు, నదులు, జలాశయాలు నిండిపోవాలని, పంటలు పునరుజ్జీవం పొందాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, లోకక్షేమం చేకూరాలని ఈ మహా ప్రార్థన నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనాలని దేవాలయ అధికారులు ఆహ్వానించారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నియోజకవర్గం పరిధిలోని వెంకటేశ్వర డివిజన్ దేవరకొండ బస్తీలో ప్రజా సమస్యలపై సమరంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కలుషిత నీటి సరఫరా, దెబ్బతిన్న రోడ్లు, వెలగని వీధి దీపాలు తదితర సమస్యలను వివరించారు. స్పందించిన ఎంజిఆర్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తాహెర్, ఫయాజ్, రాజు, ఇమ్రాన్, శివ, రాజేష్, అర్షత్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లలో నారాయణ విద్యార్థుల ప్రతిభ

### ఐబిఒలో 2 స్వర్ణాలు
### 2 రజత పతకాలతో దేశానికి కీర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ స్థాయి సైన్స్ పోటీలలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి అద్భుత ప్రదర్శనతో భారతదేశ కీర్తిని అంతర్జాతీయ వేదికపై మారుమోగించారు. ఇటీవల ముగిసిన 37వ అంతర్జాతీయ బయాలజీ ఒలింపియాడ్ (ఐబిఎం) 2026, అలాగే 58వ అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్ (ఐసిహెచ్ఓ) 2026 పోటీలలో నారాయణ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి 2 స్వర్ణాలు, 2 రజత పతకాలను కైవసం చేసుకున్నారు. శాస్త్రీయ రంగంలో దేశానికి అద్భుతమైన ప్రతిభను అందించడంలో తమకున్న అగ్రగామి స్థానాన్ని నారాయణ విద్యాసంస్థలు ఈ విజయంతో మరోసారి చాటిచెప్పాయి.

**బయాలజీ ఒలింపియాడ్‌లో త్రివర్ణ పతాకం**

లిథువేనియాలోని విల్నియస్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన 37వ అంతర్జాతీయ బయాలజీ ఒలింపియాడ్ (ఐబిఎం 2026)లో నారాయణ విద్యార్థిని భవ్యా గున్వాల్ గోల్డ్ మెడల్ (స్వర్ణం) సాధించగా, అన్మోల్ కుమార్, నిశిత్ కలాని రజత పతకాలు (సిల్వర్ మెడల్స్) సాధించారు. ఈ పోటీలలో మొత్తం 78 దేశాల నుండి 307 మంది విద్యార్థులు పాల్గొన్నారు. భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన నలుగురు విద్యార్థుల బృందంలో ముగ్గురు నారాయణ విద్యాసంస్థలకు చెందినవారే కావడం విశేషం. కఠినమైన ఆరు గంటల ప్రాక్టికల్, థియరీ పరీక్షలను ఎదుర్కొని, టీమ్ ఇండియా మొత్తం 1 గోల్డ్ 3 సిల్వర్ పతకాలను సాధించడంలో నారాయణ విద్యార్థులు కీలక పాత్ర పోషించారు.




**కెమిస్ట్రీ ఒలింపియాడ్లో వరుసగా రెండో ఏడాది స్వర్ణం**

ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో జరిగిన 58వ అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్ (ఐసిహెచ్ఓ 2026)లో నారాయణ విద్యార్థి సందీప్ కూచి గోల్డ్ మెడల్ (స్వర్ణం) సాధించి దేశ ప్రతిష్టను పెంచాడు. ఈ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో టీమ్ ఇండియా 4 స్వర్ణ పతకాలతో చారిత్రాత్మక రికార్డు సృష్టించగా, అందులో సందీప్ కూచి ప్రదర్శన అత్యంత కీలకమైనది. గత ఏడాది (2025) దుబాయ్‌లో జరిగిన 57వ ఐసిహెచ్ఓ పోటీల్లోనూ స్వర్ణం సాధించిన సందీప్, ఇప్పుడు వరుసగా రెండోసారి కూడా అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి తన అసాధారణమైన మేధోశక్తిని నిరూపించుకున్నాడు.

**జాతీయ పోటీ పరీక్షలలోనూ తిరుగులేని ఆధిపత్యం**

అంతర్జాతీయ విజయాలతో పాటు దేశంలోనే అత్యంత కఠినమైన జాతీయ స్థాయి పోటీ పరీక్షలలోనూ నారాయణ విద్యార్థులు అగ్రశ్రేణి ర్యాంకులు సాధించారు. అంతర్జాతీయ కెమిస్ట్రీ విజేత సందీప్ కూచి ఇటీవల విడుదలైన జెఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలలో ఆల్ ఇండియా 5వ ర్యాంక్ సాధించగా, బయాలజీ ఒలింపియాడ్ స్వర్ణ పతక విజేత భవ్యా గున్వాల్ నీట్‌యుజి 2026లో ఆల్ ఇండియా 71వ ర్యాంక్ సాధించి రికార్డు సృష్టించారు. భవ్యా గతంలో రొమేనియాలో జరిగిన ఐజెఎస్ఓ 2024లో గోల్డ్ ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఐబిఎం 2025లో సిల్వర్ మెడల్స్ సాధించి నిరంతర ప్రతిభను చాటుతోంది.

**ఒకే వారంలో 3 స్వర్ణాలు, 2 రజతాలు**

ఇటీవలే కొలంబియాలో జరిగిన 56వ అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐపిహెచ్ఓ 2026)లో నారాయణ విద్యార్థి శ్రేష్ఠ సురయ గోల్డ్ మెడల్ సాధించిన సంగతి తెలిసిందే. ఆ విజయంతో కలుపుకుని కేవలం ఒకే ఒక్క వారంలో నారాయణ విద్యార్థులు మొత్తం 3 స్వర్ణాలు, 2 రజత పతకాలను దేశానికి అందించడం విద్యా రంగంలో ఒక అద్భుతమైన రికార్డుగా నిలిచింది.

**ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు వేదిక : డైరెక్టర్ శరణి పొంగూరు హర్షం**

'నారాయణ విద్యాసంస్థలు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు వేదికగా నిలిచాయని చెప్పడానికి ఈ అంతర్జాతీయ విజయాలే నిదర్శనం. అంతర్జాతీయ బయాలజీ, కెమిస్ట్రీ ఒలింపియాడ్స్ 2026లో మన విద్యార్థులు 2 స్వర్ణాలు, 2 రజతాలు సాధించడం దేశానికి, మా సంస్థకు ఎంతో గర్వకారణం. విద్యార్థుల కఠోర శ్రమ, అధ్యాపకుల అంకితభావం, నారాయణ అకడమిక్ వ్యవస్థకు ఇది ప్రత్యక్ష నిదర్శనం. 47 సంవత్సరాలకు పైగా ఉన్న అనుభవం, నైపుణ్యం, అంకితభావం అనే సూత్రాలతో విద్యార్థుల కలలను నిజం చేస్తూ, అంతర్జాతీయ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించడంలో నారాయణ ఎల్లప్పుడూ ముందుంటుంది' అని నారాయణ గ్రూప్ డైరెక్టర్ పి. శరణి నారాయణ ఒక ప్రకటనలో అన్నారు.






# విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్య ధిక్కారం

జవాబుదారీ వహించకుండా
బ్యారికేడ్స్ వెనుక నక్కిన ప్రధాన్
సిపిఐ ప్రధానకార్యదర్శి
డి.రాజా విమర్శ
సిపిఐ(ఎం) ఇతర వామపక్షాల
ఖండన:మంత్రి రాజీనామాకు డిమాండ్

**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) "సంసద్ చలో" మార్చ్ సందర్భంగా ప్రదర్శకులకు వ్యతిరేకంగా పోలీసు అణచివేత చర్యను భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) సహా వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్యంపట్ల కేంద్ర ప్రభుత్వ తీవ్ర ధిక్కారాన్ని ప్రతిబింబిస్తోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నిశితంగా విమర్శించారు."విద్యార్థులపై క్రూరంగా లాఠీచార్జి చేశారు, పార్లమెంటు వైపు రాకుండా ఏడు అడుగుల బ్యారికేడ్లను వెల్డింగ్ చేయడం, విద్యార్థులు లోపల ఉండగానే మెట్రోస్టేషన్లను మూసివేయడం,శాంతియుత ప్రదర్శకులకు వ్యతిరేకంగా అసాధారణస్థాయిలో పోలీసు బలగాలను మోహరించడం వంటి చర్యలన్నీ ప్రజాస్వామ్యంపట్ల బిజెపి ప్రభుత్వ ధిక్కార చర్యలకు నిదర్శనంగా నిలిచాయి, దేశంలో ప్రజాస్వామ్యం ఎప్పుడూ చర్చలు, సంభాషణల ద్వారా మాత్రమే మనుగడ సాగిస్తుంది తప్ప, అణచివేతవల్ల ప్రజాస్వామ్యం వర్ధిల్లదు" అని డి.రాజా హెచ్చరిక చేశారు. పోటీ పరీక్షలలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలపై విద్యార్థుల్లో పెల్లుబికిన ఆందోళనను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభు త్వం తిరస్కరించడంవల్లనే ఈనాడు భారీసంఖ్యలో విద్యార్థులు, యువకులు అనివార్యంగా వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని, విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జవాబుదారి వహించకుండా పోలీసు బలగాల వెనుక, బ్యారికేడ్స్ వెనుక దాక్కుంటున్నారని విమర్శించారు.



"శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై జంతర్ మంతర్ వద్ద అత్యంత క్రూరంగా లాఠీచార్జి చేశారు, దేశ విద్యావ్యవస్థను నాశనం చేసినవారు ఈరోజున పోలీసు బ్యారికేడ్ల వెనుక దాక్కుంటున్నారు" అని సిపిఐ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్‌లో నిశితంగా విమర్శించింది. కాగా పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతాపార్టీ నాయకత్వాన జరుగుతున్న ఆందోళనోద్యమానికి వామపక్షాలు పూర్తి మద్దతు ఇచ్చాయి. ధర్మేంద్ర ప్రధాన్ ఈ పరిణామాలకు జవాబుదారీ వహించాలని కోరాయి. కేంద్ర ప్రభుత్వ ప్రేరేపిత క్రూర పోలీసు చర్యను తీవ్రంగా ఖండించాయి. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీసహా ఆపార్టీలోని ఇతర సీనియర్ నాయకులు బృందాకారత్,పొలిట్ బ్యూరో సభ్యులు విజూ కృష్ణన్,అరుణ్ కుమార్,మరియం ధవాలే కూడా జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలకు తమ సంఘీభావం ప్రకటించారు. పరీక్షల్లో అవకతవకలకు జవాబుదారీ వహించాలని కోరారు. సిపిఐ(ఎం) కూడా ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, శాంతియుతంగా జరుగుతున్న ప్రదర్శకులపై ప్రభుత్వం బలప్రయోగంతో ప్రతిస్పందించిందని విమర్శించింది. "ప్రతి లాఠీచార్జీ దెబ్బ, ప్రయోగించిన ప్రతిబాష్పవాయుగోళం, వెల్డింగ్ చేసిన ప్రతి ఎత్తైన బ్యారికేడ్, మూసివేసిన ప్రతి మెట్రోస్టేషన్ బిజెపి భయానికి చిహ్నం,తన సొంత దేశ యువకులను ఎదుర్కోలేని, వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని, వారి డిమాండ్లను ఎంతమాత్రం పట్టించుకోని ప్రభుత్వం ఒక పిరికి ప్రభుత్వం" అని సిపిఐ(ఎం) ఎక్స్ వేదికగా విమర్శించింది.

# దేశ చరిత్రలో యువతను వ్యతిరేకించిన ప్రధాని మోదీనే

తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన
రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ:** దేశ యువతను అత్యంత తీవ్రంగా వ్యతిరేకించే ప్రధానమంత్రి భారత చరిత్రలో నరేంద్ర మోదీ మాత్రమేనని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహించలేక విఫలమైన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుండి రాజీనామా లేఖను మోదీ తీసుకోలేకపోయారని,ఆయన దేశ యువత వ్యతిరేకి అని విమర్శించారు. "152 ప్రశ్నాపత్రాలు పరీక్షల నిర్వహణకు ముందుగానే వెలుగుచూశాయి, 7.50 కోట్ల మంది విద్యార్థులు బలైపోయారు, ఈ విషయంలో కనీసం ఒక్క వ్యక్తిని కూడా శిక్షించలేదు, ఎవరికి శిక్ష విధిస్తారు? ఎంతో కష్టపడి చదుకున్న యువతరానికి శిక్ష విధిస్తారా" అని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హిందీలో ఒక పోస్టింగ్ పెట్టారు. ఆయన పోస్టింగ్‌కు ఒక వీడియో సందేశాన్ని కూడా అనుసంధానించారు. విద్యార్థులు న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన డిమాండ్లు చేస్తున్నారని సమర్థించారు.
పోలీసులు విద్యార్థులను తీవ్రంగా కొడుతున్న దృశ్యాలను కూడా ఆయన అప్‌లోడ్ చేశారు. మన విద్యార్థులు విద్యావ్యవస్థ గురించి న్యాయబద్ధమైన ప్రశ్నలు అడుగుతున్నారు, కానీ వారికి ప్రభుత్వం పోలీసు దెబ్బలతో సమాధానం చెప్పింది, ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన నేరస్థులు స్వేచ్ఛగా వీధుల్లో తిరుగుతున్నారు,న్యాయసమ్మతమైన ప్రశ్నలు అడిగిన విద్యార్థులను మాత్రం రోడ్లమీద ఈడ్చి ఈడ్చి కొడుతున్నారు, ఈ ప్రభుత్వం విద్యార్థులను పరీక్షల్లో కేవలం ఫెయిల్ చేయడం మాత్రమేకాదు, ప్రభుత్వం వారిపై లాఠీలతో దాడులు చేస్తోంది" అని రాహుల్‌గాంధీ విమర్శించారు. "మనదేశంలో మెజార్టీ వర్గం విద్యార్థులు,యువకులే ఉన్నారు, కానీ మోదీ మాత్రం భారత చరిత్రలో అందరికంటే యువతరానికి తీవ్రమైన వ్యతిరేకి" అని ఆ వీడియో సందేశంలో రాహుల్ విమర్శించారు.
ఢిల్లీ వీధుల్లో తిరిగే విద్యార్థులు,విద్యార్థినులు నేరస్థులు కాదు, వారు తమ హక్కులను డిమాండ్ చేస్తున్నారు, ఒక మంచి విద్యావ్యవస్థను కలిగి ఉండటం,విద్యార్థులకు గౌరవం ఉండటం,న్యాయబద్ధమైన విద్యావ్యవస్థలో పరీక్షలు అవకతవకలు లేకుండా నిర్వహించడం వంటివన్నీ విద్యార్థులు కోరుతున్న హక్కులు,ప్రభుత్వం చేస్తున్న చేష్టలు, పోలీసులు చర్యలు విద్యార్థులకు తీవ్ర నిరాశా, నిస్పృహలు, అసహ్యాన్ని కలిగిస్తున్నాయి, వారికి అంతకంటే ప్రవర్తించడానికి మరోమార్గం లేదు, విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్నారు, లాఠీచార్జి చేస్తున్నారు, ఇది ప్రజాస్వామ్య చర్య కాదు, ఇది భారతదేశ విధానం కాదు, ఇది దేశంలో విద్యార్థులపట్ల అనుసరించే విధానం కాదు, విద్యార్థులు న్యాయబద్ధమైన డిమాండ్లు చేస్తున్నారే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థుల డిమాండ్లను సమ్మతించాలి, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల అసమ్మతిని తొలగించడానికి ఏదో ఒకటి చెయ్యాలి" అని రాహుల్ గాంధీ తన సందేశంలో పేర్కొన్నారు. దేశంలో విద్యావ్యవస్థ తీరుపట్ల ప్రతిఒక్కరూ విసిగిపోయారు, అలసిపోయారు, ఆర్ఎస్ఎస్ మన విద్యావ్యవస్థను తన గుప్పెట్లోకి తీసుకుంది, ఇన్ని వ్యవస్థలను ఒకేఒక్క సంస్థచేత నడిపిస్తున్నారు, అందువల్ల భారతదేశంలో యువకులు ఈ విధంగా స్పందించడం సహజం, దేశంలో యువకులను గౌరవించాలి అని పేర్కొన్నారు. దేశంలో విద్యార్థులు ఈ సమస్యలను కేవలం వారాల తరబడి మాత్రమే లేవనెత్తడం లేదు, అనేక సంవత్సరాలుగా ఈ మౌలిక సమస్య మనదేశంలో కొనసాగుతోంది, మోదీ దేశ ప్రజలను గౌరవించడం లేదు, దేశంలో యువతకు ఎంతమాత్రం గౌరవం ఇవ్వడంలేదు, వారి సమస్యలను పట్టించుకోవడంలేదు, వారికి అసత్యాలమీద, హింసమీదే విశ్వాసం ఎక్కువ, వారు భారతదేశ మౌలిక సూత్రాలకు విరుద్ధం అని రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో నరేంద్రమోదీపై విమర్శల దాడి చేశారు.

# విద్యార్థులపై లాఠీఛార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి

మోదీ సర్కార్‌పై విపక్షాల ఫైర్



**న్యూఢిల్లీ :** విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ప్రజాస్వామ్యంపై దాడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, నీట్ ప్రశ్న పత్రం తో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయని తెలిపారు. అయోధ్యలో విరాళాల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యత వహించాలని ఖర్గే డిమాండ్ చేశారు. విద్యా విధానంలో అనేక సమస్యలు ఉన్నాయని ఎంపి ప్రియాంక గాంధీ అన్నారు. వాటిపై చర్చ జరపకుండా విద్యార్థులపై ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపి శశి థరూర్ కూడా స్పందిస్తూ సిజెపి నిరసనలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. చర్చలకు ప్రభుత్వం నిరాకరించడం వల్లే ఈ ఆందోళనలు, అవాంతరాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో యువత తమ అసంతృప్తిని, కోపాన్ని వ్యక్తం చేయడానికి ఒక వేదిక ఉండాలని, ఆందోళనలను బలప్రయోగంతో అణచివేయడం సరికాదని ఆయన హితవు పలికారు. యువతలో పేరుకుపోయిన నైరాశ్యానికి ఈ ఆందోళనలు అద్దం పడుతున్నాయని చెప్పారు.

**యువత డిమాండ్లు వినాలి : కేజ్రీవాల్**

ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్షలాది మంది యువత న్యాయం కోసం వీధుల్లోకి వస్తే వారి మాట వినాల్సిందిపోయి లాఠీ చార్జ్‌కు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం అహంకారాన్ని విడిచిపెట్టి యువత డిమాండ్లను వినాలని, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, పార్లమెంట్ వైపు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా నిరసనకారుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. యువత లేవనెత్తుతున్న అంశాలపై చర్చించి పరిష్కారం చూపాలని సూచించారు.

# మా డిమాండ్లు నెరవేర్చాల్సిందే

కేంద్రమంత్రి జెపి నడ్డాకు సిజెపి
ప్రతినిధి బృందం మెమోరాండం

**న్యూఢిల్లీ :** కాక్రోజ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'చలో పార్లమెంట్' ఉద్రిక్తంగా మారిన వేళ కేంద్రం దిగివచ్చింది. నిరసనకారులు సెంట్రల్ ఢిల్లీలోకి చొచ్చుకెళ్లి పార్లమెంటు వరకు పాదయాత్రకు ప్రయత్నించిన నేపథ్యంలో, ప్రభుత్వం తరపున కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి జెపి నడ్డా సంప్రదింపులను ప్రారంభించారు. దీంతో సిజెపికి ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాను కలిసింది. 'సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే విడుదల చేయడం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థులందరికీ కోటి రూపాయల పరిహారం' వంటి డిమాండ్లు నెరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. లేదంటే మళ్లీ నిరసన తెలియజేస్తామన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అవకతవకల కారణంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో సహా సిజెపి డిమాండ్లపై ప్రభుత్వ నాయకత్వంతో ఏకీభవించడానికి కొంత సమయం కావాలని కోరడంతో పాటు, అంతర్గత చర్చలు జరుపుతానని నడ్డా తమకు హామీ ఇచ్చారని సిజెపి తెలిపింది. నిరసనకారులతో ప్రభుత్వ సంప్రదింపులను ప్రారంభించిన నడ్డాను సిజెపి ప్రతినిధులు కలిసినట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. సిజెపి నిరసనపై ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్నాయని, ప్రభుత్వం అధికారిక ప్రకటన జారీ చేసే అవకాశం ఉందని వారు తెలిపారు.



సిజెపి ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, తాను, సిజెపి జాతీయ అధికార ప్రతినిధి అశుతోష్ రాంకా ఆరోగ్యశాఖ మంత్రిని ఆయన నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు కలిసినట్లు చెప్పారు. తమ డిమాండ్లతో కూడిన లిఖితపూర్వక లేఖను సమర్పించగా, ఆయన ఈలోగా అంతర్గతంగా మాట్లాడతానని తమకు హామీ ఇచ్చారని, ఆ ప్రక్రియలోనే ఉన్నామని దాస్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. వాటిపై తమ నాయకత్వంతో ఏకీభవించడానికి నడ్డా కొంత సమయం కోరారని రాంకా తెలిపారు. ప్రభుత్వంతో సంప్రదింపుల మార్గాన్ని తెరవడానికి ఆదివారం రాత్రి ఆలస్యంగా న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంప్రదించారని రాంకా చెప్పారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచే మరింత తీవ్రమైన చర్చలు జరిగాయని, సుమారు 11:45 గంటల ప్రాంతంలోనే నడ్డాజీని కలవడంపై ఏకాభిప్రాయం కుదిరిందని ఆయన అన్నారు.

# ఎంపిలను కలిసేందుకు యూత్ లీడర్లను అనుమతించేదాకా దీక్ష

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్
మరో సందేశం విడుదల

**న్యూఢిల్లీ :** పార్లమెంటులో ఎంపిలను కలిసేందుకు తమ యూత్ లీడర్లను అనుమతించే వరకూ తన ఆమరణ దీక్ష కొనసాగుతుందని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మరో సందేశాన్ని విడుదల చేశారు. వాంగ్‌చుక్ రాసిన చీటీని ఆయన భార్య గీతాంజలి ఎక్స్ వేదికగా పంచుకున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాన్కే కేంద్ర మంత్రి జెపి నడ్డాను కలిసిన తరువాత సోనమ్ వాంగ్‌చుక్ ఈ సందేశాన్ని విడుదల చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న సోనమ్ ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. న్యూఢిల్లీలో జరిగిన నిరసనలపై వాంగ్‌చుక్ స్పందించారు. శాంతియుత నిరసనలు తెలుపుతున్న వారితో భద్రతా దళాలు క్రూరంగా వ్యవహరించడం చూశాక తాను దీక్షను కొనసాగించేందుకు నిర్ణయించుకున్నట్టు చెప్పారు. యూత్ లీడర్లు పార్లమెంటులో ఎంపిలను కలిసేందుకు అనుమతించే వరకూ లేదా ఆసుపత్రిలో తనను కలిసేందుకు వారిని అనుమతించే వరకూ ఈ దీక్ష కొనసాగుతుందని అన్నారు. విద్యారంగంలో లోపాలకు విద్యాశాఖ మంత్రి బాధ్యత తీసుకునేలా కేంద్రం చర్యలు తీసుకుంటుందనే తాను ఆశిస్తున్నట్టు వాంగ్‌చుక్ తెలిపారు. ఎంతగా రెచ్చగొడుతున్నా యువత సంయమనం పాటించడం తనను కదిలించిందని అన్నారు. తమ సమస్యలను పార్లమెంటులో చెప్పుకునేందుకు యువతకు అవకాశం కల్పించి ఈ సమస్యకు కేంద్రం ముగింపు పలకాలని కోరారు.



రేపు కూడా నిరసనకారులు ఇదే తరహా సంయమనంతో ఉండాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇదిలా ఉంటే, వాంగ్‌చుక్‌కు సంబంధించి మెడికల్ రిపోర్టులు, ఇతర రికార్డులను తమకు సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిని, ఎయిమ్స్, మరో ప్రైవేటు లేబోరేటరీని ఆదేశించింది. ఆసుపత్రి నుంచి వాంగ్‌చుక్ డిశ్చార్జ్ కుదరదని ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జ్ ధర్మాసనం ఆదేశించిన నేపథ్యంలో వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డివిజన్ బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది.

# ప్రభుత్వ జవాబుదారీతనానికి పట్టుబడతాం

ప్రజల హక్కుల కోసం
పూర్తి శక్తితో పోరాడుతాం
ఇండియా కూటమి నేతల ప్రకటన

**న్యూఢిల్లీ :** రామమందిర విరాళాల దోపిడీ, విద్యావ్యవస్థ క్రమబద్ధమైన పతనం వంటి అంశాలపై ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తామని, ప్రజల హక్కుల కోసం పూర్తి శక్తితో పోరాడుతామని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సోమవారం ప్రకటించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో 'ఇండియా' కూటమి ఫ్లోర్ లీడర్ల సమావేశమై, ప్రతిపక్ష వ్యూహంపై చర్చించారు. ఈ సమావేశానికి ఖర్గేతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగోయ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, టిఎంసికి చెందిన సౌగతా రాయ్, సాగరిక ఘోష్, శివసేన (యుబిటి)కి చెందిన సంజయ్ రౌత్, జెఎంఎంకి చెందిన మహువా మాజీ, సిపిఐకి పి. సందోష్ కుమార్, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ తదితరులు హాజరయ్యారు.



సమావేశం తర్వాత ఎక్స్ వేదికగా స్పందించిన ఖర్గే, పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ప్రజల గొంతుకగా నిలుస్తాయని, ప్రతి అంశంపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తాయని పేర్కొన్నారు. 'శ్రీ రామమందిర విరాళాల దోపిడీ, విశ్వాసానికి సంబంధించిన మోసం విషయం కావచ్చు కోట్లాది మంది భక్తులు ఆలయ నిర్మాణం కోసం తమ కష్టార్జితాన్ని భక్తితో సమర్పించారు; వారికి న్యాయం జరగాలి, తక్షణమే స్వతంత్ర విచారణ జరపాలి, పూర్తి వివరాలను బహిర్గతం చేయాలి. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థ క్రమబద్ధమైన పతనం, 2014 నుండి ఇప్పటి వరకు 152 పేపర్ లీకేజీలు జరిగాయి, 25 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుండి తొలగించాలి' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం ప్రయోగం అని పిలుస్తున్న ఇథనాల్ మిశ్రమాన్ని 3.5 కోట్ల మంది వాహన యజమానులపై బలవంతంగా రుద్దే అంశం కూడా తమ గళాన్ని వినిపిస్తామన్నారు. ప్రజల కష్టార్జితాన్ని దోచుకోవడమే బిజెపికి ఉన్న ఏకైక మార్గమా అని ఖర్గే ప్రశ్నించారు. ఈ అంశాలతో పాటు, దేశ ప్రజలపై ప్రభావం చూపే ఇతర ముఖ్యమైన విషయాలు, రాబోయే బిల్లుల గురించి కూడా ప్రశ్నలు లేవనెత్తుతామని ఆయన తెలిపారు. ప్రతి అంశంపై ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని 'ఇండియా' ప్రతిపక్ష కూటమి డిమాండ్ చేస్తుందని, ప్రజల హక్కులు, ప్రజల గొంతుక, ప్రజల విశ్వాసం కోసం పోరాటం పూర్తి శక్తితో సాగుతుందని ఖర్గే వివరించారు.

# జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ఢిల్లీలో ఎన్‌సి నిరసన

జమ్ముకశ్మీర్ ప్రజల హక్కులు,
గౌరవాన్ని పునరుద్ధరించాలని
నినాదాలు

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) సోమవారం ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసింది. పార్లమెంటు, సుప్రీంకోర్టులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజున, ఎన్‌సి అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు 'జమ్ముకశ్మీర్ హౌస్' వద్ద సమావేశమయ్యారు. 'అప్నా వాదా పూరా కరో (మీ హామీని నెరవేర్చండి)', 'జమ్ముకశ్మీర్ ప్రజల హక్కులు, గౌరవాన్ని పునరుద్ధరించండి, 'పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించండి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. నిరసనకారులు 'మోదీ కా వాదా, క్యున్ రహా ఆధా? (మోదీ హామీ ఎందుకు అసంపూర్తిగా మిగిలిపోయింది?)' వంటి నినాదాలు కూడా చేశారు. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్' వైపు నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది; అక్కడ జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణపై ఒక సదస్సు జరుగుతోంది. ప్రధానమంత్రి, హోంమంత్రి పార్లమెంటులోనూ, సుప్రీంకోర్టులోనూ, అలాగే జమ్ముకశ్మీర్ ప్రజలకు ఇచ్చిన పూర్తి స్థాయి రాష్ట్ర హోదా హామీ కోసం తాము పోరాడుతున్నామని ఫరూక్ అబ్దుల్లా విలేకరులతో అన్నారు. 'ప్రభుత్వం ఈ దేశ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తుందని ఆశిస్తున్నాను. వారు దేశ శ్రేయస్సు కోసం పనిచేస్తారని, లఢాఖ్ సమస్యలు పరిష్కారమవుతాయని, జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరించబడుతుందని ఆశిస్తున్నాను' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. కేంద్రానికి అది ఇచ్చిన హామీని గుర్తు చేయడానికి జమ్ముకశ్మీర్ ప్రజలు ఢిల్లీకి రావాల్సి రావడం దురదృష్టకరమని జమ్ముకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి అన్నారు. 'ఎన్నికల తర్వాత రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని మీరు జమ్ముకశ్మీర్ ప్రజలకు హామీ ఇచ్చారు. నేటికి దాదాపు ఏడాదిన్నర గడిచింది, కానీ ప్రధానమంత్రి గానీ, హోంమంత్రి గానీ ఆ హామీని నెరవేర్చలేదు' అని ఆయన అన్నారు.




జమ్ముకశ్మీర్ ప్రజలకు ఇచ్చిన హామీని కేంద్రానికి గుర్తు చేయడానికి ఎన్‌సి, కాంగ్రెస్, వారి మిత్రపక్షాలు ఢిల్లీలో సమావేశమయ్యాయని చౌదరి తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, 2019 ఆగస్టులో జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్ముకశ్మీర్, లఢాఖ్ అనే కేంద్రపాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించారు. 2023 డిసెంబరులో, రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పేర్కొంటూనే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు సమర్థించింది.

# 9 మంది రాజ్యసభ సభ్యులు ప్రమాణం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం వేళ కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్షాకాల సమావేశాల తొలి రోజున ప్రమాణం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యుల్లో ముఖేష్‌భాయ్ జె రత్వా (బిజెపి–గుజరాత్), పవన్ ఖేరా (కాంగ్రెస్–కర్ణాటక), మహేష్ కేవత్ (బిజెపి–మధ్యప్రదేశ్), జమేష్ పాంగ్‌సాంగ్ కొంగ్‌కల్ సంగ్మా (ఎన్‌పిపి– మేఘాలయ) ఖియాంగ్టే లాల్ట్ లుగ్కిమా (మిజోరం), సతీష్ పూనియా (బిజెపి–రాజస్థాన్), ప్రకాష్ చిక్ బరాక్ (బిజెపి–పశ్చిమ బెంగాల్), సుస్మితా దేవ్ (బిజెపి–పశ్చిమ బెంగాల్), సుఖేందు శేఖర్ రే (బిజెపి–పశ్చిమ బెంగాల్) ఉన్నారు. అంతకుముందు ఎన్నికైన మరి కొందరు సభ్యులు సమావేశాల మధ్య కాలంలో అప్పటికే ప్రమాణ స్వీకారం చేశారు.

## వర్షాలు, వర్షాకాల సమావేశాలు ఫలప్రదమైతే..

# దేశం, జీవరాశి శ్రేయస్సుకు దోహదం

ప్రధాని మోదీ ఆశాభావం

**న్యూఢిల్లీ :** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఫలప్రదంగా సాగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం పిలుపునిచ్చారు. సభలో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా జరిగితే గందరగోళానికి లేదా గొంతు పెంచాల్సిన అవసరానికి తావుండదని ఆయన పేర్కొన్నారు. సమావేశాల ప్రారంభానికి ముందు మోదీ పార్లమెంటు ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. రుతుపవనాలు తమ సానుకూల ప్రభావాన్ని చూపడం మొదలుపెట్టాయని, అదే సమయంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కూడా ప్రారంభమవుతున్నాయని ప్రధాన మంత్రి అన్నారు. 'ఈ రెండూ ఫలప్రదంగా ఉన్నప్పుడు, అవి దేశం, సమస్త జీవరాశి శ్రేయస్సుకు దోహదపడతాయి. రుతుపవనాలు అనుకూలంగా ఉండాలని, అలాగే పార్లమెంటు సమావేశాలు కూడా అంతే ఫలప్రదంగా సాగాలని మనం ఆశిద్దాం' అని ఆయన అన్నారు. సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో దేశం అభివృద్ధి పథంలో వేగం పుంజుకుందని, పార్లమెంటు స్ఫూర్తి ఈ వేగానికి కొత్త శక్తిని ఇవ్వగలదని, జాతీయ లక్ష్యాలను సాధించడానికి సానుకూల దృక్పథం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. సభలో అర్థవంతమైన చర్చలు జరగాలని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని మోదీ నొక్కి చెప్పారు. దేశభక్తి, దేశం పట్ల అంకితభావంతో కూడిన గొంతుకలకు పార్లమెంటులో సరైన వేదిక లభించాలని, తద్వారా యువత గళాన్ని వినిపించి దేశానికి దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను రూపొందించిన యువ ఆవిష్కర్తలను అభినందిస్తూనే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మోదీ పరోక్ష వ్యాఖ్యలు చేశారు; తాను '56 ఏళ్ల యువకుడి' గురించి మాట్లాడటం లేదని ఆయన అన్నారు. గత ఏడాది రుతుపవనాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోవడం, అలాగే మొన్ననే ఒక యువ భారతీయ స్టార్టప్ అద్భుతమైన ఘనతను సాధి ంచడం వంటివి ఎంతో గర్వించదగ్గ క్షణాలని ఆయన అన్నారు.



పశ్చిమాసియాలో జరుగుతున్న సంఘర్షణ గురించి ప్రస్తావిస్తూ, ఇంధన అవసరాల కోసం ఇతరులపై ఆధారపడే భారత దేశం వంటి దేశాలకు ఈ యుద్ధం పెద్ద సంక్షోభాన్ని సృష్టించిందని మోదీ అన్నారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి, ఎరువులు, రసాయనాల సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పటికీ, భారత దేశం 7.7 శాతం వృద్ధి రేటును కొనసాగిస్తూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధా న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు.

# త్రిపుర డిజిపి అనుమానాస్పద మృతి

**అగర్తలా :** త్రిపుర డిజిపి అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయన తన సర్వీస్ పిస్టల్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. ఆయనను గమనించిన సిబ్బంది వెంటనే అగర్తలాలోని గోవింద్ బల్లభ్ పంత్ ఆసుపత్రికి తరలించారు. 'డిజిపి అనురాగ్ ధన్‌ఖ్‌డను మధ్యాహ్నం 12 గంటలకు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆయన నాడి కొట్టుకోవడం ఆగిపోయింది, రక్తపోటు లేదు. మేము 40 నిమిషాలకు పైగా సిపిఆర్ ఇచ్చి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరకు 12.48 గంటలకు ఆయన మరణించినట్లు ధ్రువీకరించాం. పోస్టుమార్టం తర్వాతే మరణానికి గల కచ్చితమైన కారణం తెలుస్తుంది' అని గోవింద్ వల్లభ్ పంత్ హాస్పిటల్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ప్రదీప్ భౌమిక్ తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఆయన మరణానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పోలీసులు ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ఈ వార్త గురించి తెలియగానే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సాహా, ప్రధాన కార్యదర్శి జికె సిన్హా సహా ఇతర సీనియర్ ప్రభుత్వాధికారులు డిజిపి కార్యాలయానికి వెళ్లారు.



(ఫైల్)

రాష్ట్ర పోలీస్ చీఫ్ బలవన్మరణానికి పాల్పడినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నేత జితేంద్ర చౌదరి న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. 'ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి బలవన్మరణానికి పాల్పడడం రాష్ట్రంలోని శాంతి భద్రత పరిస్థితిని సూచిస్తోంది. డిజిపి మరణానికి గల అసలు కారణాలు, దాని వెనుకున్న పరిస్థితులను తెలుసుకోవడానికి మేము న్యాయ విచారణ కోసం డిమాండ్ చేస్తున్నాం' అని అన్నారు.

## గయానాలో ఫెర్రీ బోల్తా: 66 మంది గల్లంతు



**జార్జ్‌టౌన్:** దక్షిణ అమెరికా ఉత్తర తీర ప్రాంత దేశం గయానా తీరంలో ప్రయాణం చేస్తున్న ఒక ప్రయాణికుల ఫెర్రీ బోల్తా పడింది. సహాయబృందాలు 67 మందిని రక్షించారు. కానీ మరో 66 గల్లంతయ్యారు. వారికోసం తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కొన్ని మృతదేహాలు లభ్యమయ్యాయి. గాలింపు కొనసాగుతోంది. సహాయ సిబ్బంది రక్షించినవారిలో ఆరుగురు బాలురు, తొమ్మిదిమంది బాలికలు, 11 మహిళలు, 41 మంది పురుషులు ఉన్నారు. ఉత్తర అట్లాంటిక్ తీరానికి ఏడు మైళ్ళదూరంలో బోల్తా పడిన ఈ ఫెర్రీలో 17 మంది సిబ్బంది ఉండగా, 116 మంది ప్రయాణికులున్నారు. 1939లో తయారు చేసిన ఈ ఫెర్రీకి 2024లో ఒకసారి మరమ్మతులు చేశారు. మరోసారి దీనికి మరమ్మతులు నిర్వహించాల్సి ఉండగా ఈ ప్రయాణం జరిగింది. ఐతే ఈ ఫెర్రీ నడిపే సిబ్బందిలో కొందరు భారీగా గంజాయి సేవించారన్న నిర్ధారణలు వచ్చాయి.ఐతే ఈ ఫెర్రీ ప్రమాణంలోగానీ, ప్రయాణ సమయంలోగానీ అక్రమాలు,దుర్మార్గాలు ఏమైనా జరిగితే తీవ్ర చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు. ఈ దిశగా దర్యాప్తు కూడా ప్రారంభించారు.
ఈ ఘటన వాస్తవానికి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగినప్పటికీ ఇంత వరకూ మృతదేహాల జాడ తెలియలేదు. నిపుణులైన డైవర్లను ప్రభుత్వం రంగంలోకి దింపింది. ఈ సమీపంలో ఉన్న చమురు గ్యాస్ కంపెనీ నౌకలు కూడా తమ సిబ్బందిని రంగంలోకి దింపాయి.జార్జ్ టౌన్ నుండి బయలుదేరిన తర్వాత నాలుగు గంటలు ప్రయాణం చేశాక ఫెర్రీ మునిగిపోయింది. ఐతే కొందరు లైఫ్ జాకెట్లతో ఒడ్డుకు ఈదుకువచ్చి సమాచారం తెలియజేశారు. ఈ ప్రమాదంలో ముర్రే అనే ఒక వ్యక్తితోపాటు ఆయన కుమారుడు బ్రతికారు. వారి కుటుంబంలో ఆయన భార్య, మనువలు, మనవరాళ్ళు ఆరుగురు జాడ తెలియకుండాపోయారు.

## హమాస్ అధినేతగా ఖలీల్ హయ్యా



**గాజా:** హమాస్ ఉగ్రవాద సంస్థ సర్వాధిపతిగా ఖలీల్ హయ్యా బాధ్యతలు చేపట్టారు. హమాస్ ఉన్నత పదవికి జరిగిన అంతర్గత ఎన్నికల్లో ఆయన గెలిచారు. అమెరికా మధ్యవర్తిత్వంతో పాలస్తినా–ఇజ్రాయెల్ మధ్య జరిగిన చర్చల్లో ఖలీల్ హయ్యా ప్రధాన అనుసంధానకర్తగా, నిర్దేశకుడుగా బాధ్యతలు నిర్వహించారు. గతంలో ఆయన గాజాలో హమాస్ రాజకీయ విభాగం పొలిటికల్ బ్యూరో అధిపతిగా పనిచేశారు. ఇప్పుడు ఆయన హమాస్ ఉగ్రవాద ఉద్యమానికి సంపూర్ణస్థాయీ అధిపతిగా ఎన్నికయ్యారని ఇజ్రాయెల్ పత్రిక ప్రకటించింది. హమాస్ అధిపతి యాహ్యా సిన్వర్ హతుడైనప్పటినుండి గడచిన రెండు సంవత్సరాలుగా హమాస్ సంస్థను ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత బృందం నడిపిస్తోంది. ఈ ఉన్నతబృందంలో ఖలీల్ హయ్యా కూడా ఒకరుగా ఉన్నారు. గాజాస్ట్రిప్‌లో జన్మించిన ఖలీల్ హయ్యా తన జీవితంలో ఎక్కువభాగం అక్కడే గడిపారు. కానీ 2023 అక్టోబరులో ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి ప్రణాళిక అమలు చేయడానికి ముందుగా ఖలీల్ హయ్యా ఖతార్‌కు తరలివెళ్ళారు. ఇప్పుడు అక్కడి నుండే ఆయన కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

# ఇరాన్ దాడిలో మరో అమెరికా సైనికుడు మృతి

- హోర్ముజ్‌లో రెండు చమురు ట్యాంకర్లు పేల్చివేత
- ఇరాన్ కమాండ్ సెంటర్, క్షిపణి, డ్రోన్ కేంద్రాలపై అమెరికా దాడులు
- దాడులను అడ్డుకున్న బహ్రైన్, కువైట్



**దుబాయ్:** పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్ చేస్తున్న దాడులలో మరో అమెరికా సైనికుడు ఉత్తర ఇరాక్‌లో హతుడయ్యాడు. దీంతో ఇప్పటివరకూ యుద్ధంలో మరణించిన అమెరికా సైనికుల సంఖ్య 17కు పెరిగింది. గడచిన మూడు రోజుల్లో నలుగురు సైనికులను అమెరికా కోల్పోయింది. ఇద్దరు సైనికులు ప్రత్యక్ష దాడిలో మరణించగా, ఒక సైనికులు గల్లంతయ్యాడు. మరో సైనికుడు తాజా దాడిలో మరణించాడు. రో 450 మంది అమెరికా సైనికులు ఇప్పటివరకూ గాయపడ్డారు. ఇరాక్‌లో ఇరాన్ ఐఆర్‌జిసి సైన్యాలు చేసిన దాడిలో అమెరికా సైనికులు మరణించాడు. హోర్ముజ్ జలసంధిలో రెండు చమురు ట్యాంకర్లను ఇరాన్ పేల్చివేసింది. ఇరాన్ ప్రాదేశిక జలాలలోంచి కాకుండా అక్రమ మార్గంలో దొడ్డిదారిన వెళ్ళేందుకు యత్నించిన రెండు చమురు ట్యాంకర్లను పేల్చివేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. తాము నిర్దేశించిన మార్గాలలోనే నౌకలు ప్రయాణం చేయాలని మరోసారి ఐఆర్‌జిసి హెచ్చరిక జారీ చేసింది. అమెరికాకు చెందిన ఐదు ఎంక్యూ–9 డ్రోన్లను కూల్చివేసినట్లు పేర్కొంది. జోర్డాన్‌లో విమానాశ్రయాలపై దాడులు చేసింది. అమెకాగా ఒమన్ తీరానికి 15 కి.మీ దూరంలో ఒక నౌకపై గుర్తు తెలియని ప్రొజెక్టైల్ దాడి చేసినట్లు బ్రిటన్ సముద్ర పర్యవేక్షణ సంస్థ ప్రకటించింది. మరోవైపు అమెరికా సెంట్‌కామ్ సైనికబలగాలు సోమవారం తెల్లవారకముందుగానే ఇరాన్‌పై వరుసగా తొమ్మిదోరోజు కూడా భారీ దాడులను పూర్తిచేశాయి. ఇరాన్ కమాండ్ సెంటర్, గగనతల రక్షణ వ్యవస్థ, ఇరాన్ కోస్తాతీర ప్రాంత నిఘా కేంద్రాలు, సముద్ర సామర్థ వ్యవస్థలు, ఆయుధ నిల్వ కేంద్రాలు, క్షిపణులు, డ్రోన్ల ప్రయోగించే వేదికలు ఉండే స్థావరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, రేవు నగరం బుషెర్‌లపై అమెరికా సైన్యాలు భారీస్థాయిలో గగనతల దాడులతో విధ్వంసం సృష్టించాయి. మరోవైపు బహ్రైన్, కువైట్‌లలో వరుస పేలుళ్ళు సంభవించాయి. దక్షిణ ఇరాన్ నగరాలలో పేలుళ్ళు సంభవించాయి. ఇరాన్ డ్రోన్లను అడ్డుకున్నామని జోర్డాన్, కువైట్ దేశాలు ప్రకటించాయి. జోర్డాన్‌లో ఇరాన్ వరుస దాడులతో తీవ్ర విధ్వంసం సృష్టిస్తూ ఉండటంతో ఆ దేశంలో ఉన్న ఇరాన్ రాయబారిని పిలిపించి జోర్డాన్ ప్రభుత్వం తీవ్ర నిరసన తెలియజేసింది. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ చమురు మార్కెట్ తీవ్ర అనిశ్చితికి గురైంది. బ్రెంట్ క్రూడాయిల్ ఒక బ్యారెల్ ధర 90 డాలర్లు దాటిపోయింది. భారత స్టాక్ మార్కెట్లు కూడా పతనమయ్యాయి.

# స్పెయిన్ వీధుల్లో లక్షలమంది సెలబ్రేషన్స్


- జట్టు సభ్యులకు మాడ్రిడ్‌లో వీరోచిత ఆహ్వానం
- ఫౌంటెన్ కూలి మైనర్ బాలుడు దుర్మరణం



**మాడ్రిడ్:** న్యూజెర్సీలో జరిగిన 2026వరల్డ్ కప్ ఫైనల్స్‌లో అర్జెంటీనాపై స్పెయిన్ జట్టు ఘన విజయం సాధించడంతో ఆ దేశంలో లక్షల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఉత్సవం చేసుకుంటున్నారు. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్, రాజు ఫెలిప్ మాడ్రిడ్‌లో తమ దేశ జట్టుకు వీరోచిత ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో లెనక్కలేనంతమంది పాల్గొన్నారు. స్పెయిన్‌లో ఫుట్‌బాల్ ఆటపై అమితమైన అభిమానం ఉన్న ఆ దేశ ప్రజలు ఘన స్వాగతం ద్వారా దేశ గర్వాన్ని చాటిచెప్పారు. అర్జెంటీనాపై 1–0 తేడాతో ఘన విజయం సాధించిన కోచ్ లూయిస్ డిలా ఫ్లుంటే బృందం సోమవారం మధ్యాహ్నం 12.50 గంటలకు బంగారు ట్రోఫీని చేతబట్టుకుని మాడ్రిడ్‌పై కాలుమోపారు. ఈ జట్టు ప్రధానమంత్రి మోంక్లోవా ప్యాలెస్ అధికార నివాసం సమీపం నుండి సిబెల్స్ స్క్వేర్ వరకూ ఊరేగింపుగా వెళ్ళారు. లక్షలమంది ఈ వేడుకలలో పాల్గొన్నారు.ఆ సంప్రదాయ వేడుకల ప్రాంగణంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు.
కానీ అంతకుముందు ప్రజలు స్వచ్ఛంధంగా చేసుకున్న భారీ వేడుకలలో ఒక విషాదం చోటు చేసుకుంది. ఒక ఫౌంటెన్ కూలిపోవడంతో ఈ వేడుకల సందర్భంగా 13 సంవత్సరాలు వయసుగల మైనర్ బాలుడు దుర్మరణం చెందాడు. చారిత్రక నగరం సియుడాడ్ రోడ్రిగోలో అభిమానులు ఆదివారం అర్ధరాత్రి దాటాక సంబరాలు చేసుకుంటున్న సమయంలో ప్రమాదంలో ఈ బాలుడు మరణించాడు. పోలీసులు ఫౌంటెన్ శిథిలాలు తొలగించి బాలుణ్ణి ఆరోగ్యకేంద్రానికి తరలించారు. కానీ అప్పటికే అతడు మరణించాడు. దీంతో ప్రజలు ఆ కుటుంబానికి తమ సంఘీభావం ప్రకటించి వారికి అండగా నిలబడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో స్థానిక కౌన్సిల్ మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించింది. దీంతో సియుడాడ్ రోడ్రిగోలో ప్రజలకు ఈ ఘన విజయ వేడుకలు ఒక విషాదంగా మారాయి.

## చంద్రుడిపై కాలుమోపి 57 ఏళ్ళు

### అంతర్జాతీయ మూన్ డే వార్షికోత్సవం



**వాషింగ్టన్:** క్రూర మృగాలను జయించి గొప్ప మానవ సమాజాన్ని నిర్మించిన మనిషి ఎవరెస్టు శిఖరాగ్రాన్ని అధిరోహించాడు. ఇప్పుడు పూర్తిగా బాహ్య అంతరిక్షాన్ని శోధిస్తూ, ఇతర గ్రహాలలో నగరాలు ఎలా నిర్మించాలా అని ఉద్ధృత పరిశోధనలు చేస్తున్నాడు. ఈ విజయాలకు నాందిగా మనిషి మొదటిసారి చంద్రుడిపై కాలుమోపి జులై 20వ తేదీ నాటికి 57 సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు కొత్త లక్ష్యాలను ఉద్ఘాటించారు. 2027 నాటికి నాసా 30 రోబోలను చంద్రుడిమీద దింపాలని ప్రణాళిక చేస్తోంది. చంద్రుడిపై కాలనీలు నిర్మించి మార్స్ గ్రహాన్ని మానవ నివాసానికి అనుకూలంగా మలచుకునేందుకు అక్కడి నుండే తదుపరి పరిశోధనలకు శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టబోతున్నారు. అంటే ఒకరకంగా రాబోయే రెండు దశాబ్దాలలో చందమామ కుడా మరో భూగోళంగా మారి, మానవ ఆవాసాలకు, భూమి–చంద్రుడి మధ్య సాధారణ రాకపోకలకు ఒక ప్రధాన కేంద్రంగా మారనున్నది.
1969లో అపోలో–11 ద్వారా విజయవంతంగా జరిగిన చంద్రయాత్రలో వ్యోమగామి నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి దక్షిణ ధృవంపై కాలుమోపారు. ఆ రోజును ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మూన్ డే గా పాటించాలని ఐక్యరాజ్య సమితి ఏనాడో ప్రకటించింది.సమస్త మానవాళి బాహ్య అంతరిక్షాన్ని ప్రపంచ దేశాలు దుర్వినియోగం చేయకుండా శాంతియుత ప్రయోజనాలకు ఉపయోగించాలనే లక్ష్యంలో భాగంగా కూడా ఈ అంతర్జాతీయ చంద్ర దినోత్సవం ఏటా పాటించాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించింది. వీటన్నింటికీ ముందుగానే 1967లో అంతర్జాతీయ అంతరిక్ష మాగ్నాకార్టా అమలులోకి వచ్చింది. బాహ్య అంతరిక్ష శోధనలో అంతర్జాతీయ సహకారం,అంతరిక్ష కార్యకలాపాల నియంత్రణ,శాంతియుత ప్రయోజనాలు వంటివన్నీ ఈ మాగ్నాకార్టాలో ఉన్నాయి.
చంద్రుడిపై నీటి జాడలున్నాయని భారత్ ప్రపంచానికి తెలియజేసింది. చంద్రుడి రాళ్ళను తెచ్చి పరిశోధనలు చేస్తున్నారు. 2035 నాటికి చంద్రుడిపై మానవ ఆవాసాలు నిర్మించి అనంత రోదసీని జల్లెడ పట్టేందుకు అగ్రదేశాలు పోటీ పడుతున్నాయి. రాబోయేకాలంలో ఇస్రో గగన్‌యాన్‌కు విజయవంతంగా సన్నాహాలు చేస్తోంది. ఈ విషయంలో ముఖ్యంగా అమెరికా, చైనా, భారత్ నిర్దిష్ట లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు వెళుతున్నాయి. 2026 ఏప్రిల్ 1–11 వ తేదీ వరకూ ఆర్టెమిస్–2 అంతరిక్ష యాత్ర,సుదూరంగా ఉన్న చంద్రుడి వెనుక చీకటి లోకాన్ని నలుగురు నాసా వ్యోమగాములు చుట్టి వచ్చి ఒక అపూర్వమైన విజయాన్ని సాధించడం మానవజాతి చరిత్రలో మరో మైలురాయి ఘట్టంగా మారింది. 2028 నాటికి ఆర్టెమిస్ 4–5 మిషన్స్‌తోపాటు చైనా కూడా 2030 నాటికి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమైంది.
ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ కూడా చంద్రుడిపైకి యాత్రికుల్ని తీసుకువెళ్ళి సురక్షితంగా తిరిగి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ విధంగా దాదాపు 60 దేశాలు చంద్రుడిపై దృష్టి సారించాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ సందర్భంగా అంతరిక్ష శోధకులు పలు వ్యాఖ్యలు విడుదల చేశారు. వందల కోట్ల సంవత్సరాలక్రితం ఒక భారీ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టడంతో భూమి నుండి ఒక పెద్ద భాగం విడిపోయిన చంద్రుడు ఒక సహజసిద్ధ ఉపగ్రహంగా అంవతరించాడు. ప్రతి సంవత్సరం భూమికి 3.8 సెంటీమీటర్లు దూరంగా జరుగుతున్న చంద్రుడు అనంత కాలగమనంలో ఏదో ఒకనాటికి పూర్తిగా స్థిరకక్ష్య నుండి దూరమైపోయి సూర్యుడిచుట్టూ పరిభ్రమించే ఒక స్వతంత్ర గ్రహంగా ఆవిర్భవించనున్నాడని శాస్త్రవేత్తలు అంచనావేశారు.

# ‘ఇందిరమ్మ ఇళ్లు’

(మొదటి పేజీ తరువాయి)



శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేరేవరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. హైదరాబాద్ పరిధిలో గజం రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల వరకు, ఎకరం రూ.300 కోట్లు పలికే అత్యంత విలువైన కోర్ ప్రాంతాలలో సైతం పేదలకు టవర్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ పథకం కింద నిర్మించే ఇళ్ల నుంచి వచ్చే ఏడాది లబ్ధిదారులతో బోనాలు ఎత్తిస్తామని ఆయన హామీనిచ్చారు.

**తొలి విడతలో 16 నియోజకవర్గాలు**

మొదటి దశలో క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాలను ఎంపిక చేసి, నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున మొత్తం 7,680 నుండి 8,000 ఫ్లాట్లను నిర్మిస్తామన్నారు. త్వరలోనే మరో 8 నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి ఈ పథకాన్ని విస్తరిస్తామని మంత్రి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గత పాలకులు హైదరాబాద్ నగరానికి 3035 కిలోమీటర్ల దూరంలో ఉపాధికి దూరంగా ఇళ్లను నిర్మించడం వల్ల పేదలు అక్కడకు వెళ్ళలేకపోయారని మంత్రి పొంగులేటి విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం పేదలు నివసించే నియోజకవర్గాన్నే యూనిట్‌గా తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. త్వరలోనే మధ్యతరగతి ప్రజలకు కూడా ఇళ్ల విషయంలో ఒక శుభవార్త అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు.

**ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటున్నాం : మంత్రులు**

ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ గుడిసెలు లేని తెలంగాణే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే అత్యంత పారదర్శకంగా ఇళ్ల కేటాయింపులు జరుపుతున్నామన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన హౌసింగ్ విభాగాన్ని తాము పునరుద్ధరించామని, ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా ఉచిత బస్సు, ఉచిత కరెంట్, రేషన్ కార్డులతో పాటు ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల హామీని కూడా నెరవేరుస్తున్నామని చెప్పారు. మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ హైదరాబాద్ కోర్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, శాసనసభ్యులు దానం నాగేందర్, మల్ రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేశ్, ప్రకాష్ గౌడ్, శ్రీగణేష్, ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి, హౌసింగ్ ఎం.డి. వి.పి. గౌతమ్, కలెక్టర్, ప్రియాంక ఆల పాల్గొన్నారు.

**నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ**

క్యూర్ పరిధిలో ఫ్లాట్ల కోసం నేటి నుండి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హులైన లబ్ధిదారులు మీసేవ, అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ (నెంబర్ : 8096958096) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.100 కాగా, ఈఎండి కింద రూ.10,000 టోకెన్ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ లాటరీలో ఇల్లు రాని పక్షంలో ఈ రూ.10 వేల మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే లబ్ధి దారునికి తిరిగి చెల్లిస్తుంది.

**పథకం విధివిధానాలు..**

**మొత్తం ఖర్చు – సబ్సిడి :** ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, ఇందులో రూ.5 లక్షలను ప్రభుత్వం సబ్సిడి (ఉచితంగా) రూపంలో అందిస్తుంది.
లబ్ధిదారుని వాటా : మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు నాలుగు విడతల్లో ప్రభుత్వానికి చెల్లించాలి. (గతంలో కట్టిన రూ.10 వేల ఈఎండిని ఇందులో మినహాయిస్తారు).
**ఉచిత రిజిస్ట్రేషన్ :** సుమారు రూ.4060 లక్షల విలువైన 525 చదరపు అడుగుల స్థలాన్ని లబ్ధిదారులైన ఆడపడుచుల పేరిట ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తుంది.
**నిబంధనలు :** ఈ ఫ్లాట్లను 10 ఏళ్ల వరకు అమ్ముకోవడానికి లేదా అద్దెకు ఇవ్వడానికి వీల్లేదు. అయితే అత్యవసరాల కోసం బ్యాంకుల్లో రుణం పొందేందుకు తణఖా పెట్టుకోవచ్చు.
**ఫ్లాట్ వివరాలు :** ప్రతిపాదిత 525 చదరపు అడుగుల ఫ్లాట్‌లో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్ ఉంటాయి.

**అర్హతలు – ఎంపిక విధానం**

దరఖాస్తుదారుడి కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉండాలి. క్యూర్ పరిధిలో దరఖాస్తుదారుడి పేరిట ఎలాంటి సొంత స్థలం కానీ, ఇల్లు కానీ ఉండకూడదు. కుటుంబం నుండి ఒకే దరఖాస్తును స్వీకరిస్తారు. లబ్ధిదారుల ఎంపికలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు రిజర్వేషన్లు వర్తించనున్నాయి. రాజకీయాలకు అతీతంగా, పూర్తి పారదర్శకంగా 360 డిగ్రీల వడపోత అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. దరఖాస్తులు ఎక్కువగా వస్తే బహిరంగంగా లాటరీ (డ్రా) పద్ధతి ద్వారా ఇళ్లను కేటాయిస్తారు.

**తొలి విడతలో ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రాంతాలు..**

1. రాజేంద్రనగర్ : మైలార్‌దేవ్ పల్లి
2. మహేశ్వరం : జల్‌పల్లి
3. శేరిలింగంపల్లి : రాయదుర్గం
4. ఇబ్రహీంపట్నం : తట్టిఅన్నారం, బండ్లగూడ
5. మల్కాజిగిరి : కౌకూర్
6. నాంపల్లి : రెడ్‌హిల్స్, నీలోఫర్ ఆసుపత్రి సమీప పోలీస్ క్వార్టర్స్
7. ఖైరతాబాద్ : హకీంపేట్ దర్గా, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ
8. కార్వాన్ : కుల్సుంపురా సమీప పోలీస్ క్వార్టర్స్
9. బహదూర్‌పురా : నందిముసలిగూడ
10. అంబర్‌పేట్ : సిటీ పోలీస్ లైన్స్
11. కూకట్‌పల్లి : కెపిహెచ్‌బి కాలనీ
12. మేడ్చల్ : పోచారం ఎల్‌ఐజి కాలనీ
13. కుత్బుల్లాపూర్ : గాజులరామారం
14. సనత్ నగర్ : పాటిగడ్డ
15. సికింద్రాబాద్ కంటోన్మెంట్ : మారేడ్‌పల్లి మహేంద్రహిల్స్
16. మలక్‌పేట్ : గడ్డిఅన్నారం ఆర్ అండ్ బి క్వార్టర్స్.

## మారిన ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

పట్టుకుని గుంపులుగా పార్లమెంటు వైపు వెళ్లే రహదారుల గుండా నినాదాలు చేస్తూ కవాతు చేయడంతో సెంట్రల్ ఢిల్లీ జనసముద్రంగా మారిపోయింది. రాత్రంతా రైలు, బస్సుల్లో ప్రయాణించి వచ్చిన చాలామంది వీపున బ్యాక్ ప్యాక్‌లు మోయగా, నగరాన్ని వర్షం ముంచెత్తుతున్నా మరికొందరు గొడుగులతో నడిచారు. వారి చుట్టూ, అల్లర్ల నిరోధక దుస్తులు ధరించిన పోలీసులు రహదారుల వెంబడి బారులు తీరారు, నిరసనకారులను అదుపులోకి తీసుకోవడానికి బస్సులు సిద్ధంగా ఉంచారు. పార్లమెంటుకు వెళ్లే ప్రతి మార్గాన్ని పొడవైన బారికేడ్ల వరుసలు అడ్డుకున్నాయి. నిరసనకారులు పార్లమెంటు వైపు కదులుతుండగా, ఢిల్లీ పోలీసులు పలుచోట్ల బహుళ అంచెల బారికేడ్లను ఉపయోగించి వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. నిరసనకారులు బారికేడ్లను ఛేదించుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో, పార్లమెంట్ స్ట్రీట్, పటేల్ చౌక్, రైల్ భవన్, ఇతర ప్రాంతాల సమీపంలో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి, లాఠీఛార్జ్‌కు పాల్పడ్డారు. ఈ ఘర్షణల్లో పోలీసు సిబ్బంది, నిరసనకారులు ఇద్దరూ గాయపడగా, సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. జూన్ 20 నుంచి సిజెపి ధర్నా చేస్తున్న జంతర్ మంతర్ నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, వయోవృద్ధులు పాల్గొన్నారు. కొందరు పిల్లలు పాఠశాల యూనిఫాంలో రాగా, మరికొందరు బొద్దింకల వేషధారణలో వచ్చారు. ప్రధాన రహదారులను మూసివేసిన తర్వాత పార్లమెంట్‌కు చేరుకునేందుకు చాలా మంది నిరసనకారులు పోలీసు బారికేడ్లను తప్పించుకోవడానికి, షార్ట్‌కట్‌ల కోసం ఇరుకైన సందులను ఎంచుకున్నారు. పరిస్థితి తీవ్రమవుతున్న కొద్దీ, రిజర్వ్‌లో ఉంచిన అనేక పారామిలిటరీ బలగాల కంపెనీలను కూడా రంగంలోకి దించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఐదు స్టేషన్లను మూసివేయడంతో ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్లలో గందరగోళం నెలకొంది. దీంతో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోగా, చాలా మంది నిరసనకారులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోయారు. రాజధానిలోని అత్యంత రద్దీగా ఉండే ఇంటర్‌చేంజ్ స్టేషన్లలో ఒకటైన రాజీవ్ చౌక్‌లో, మూసివేసిన ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ప్రయాణికులు గుమిగూడటం కనిపించింది. పటేల్ చౌక్ స్టేషన్‌లో, జంతర్ మంతర్ వద్ద ఉన్న సిజెపి నిరసన ప్రదేశానికి వెళ్తున్న వారిని చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది లాఠీచార్జ్ చేశారు. ప్రవేశ మార్గాలను మూసివేసిన తర్వాత, పలువురు ప్రయాణికులు బారికేడ్లు, తాళం వేసిన గేట్లను దాటి స్టేషన్ నుండి బయటకు వెళ్తున్న వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నాయి. నిరసనకారులు మండి హౌస్, రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ల లోపల గుమిగూడి ‘భారత్ మాతా కీ జై‘, ‘వందే మాతరం‘ నినాదాలు చేశారు. రాజీవ్ చౌక్ వద్ద వందలాది మంది ప్రజలు గుమిగూడి, చప్పట్లు కొడుతూ, దేశభక్తి నినాదాలు చేశారు.

### పోలీసుల అదుపులో అభిజీత్ దీప్కే

పరీక్ష పత్రాల లీకేజీలతో మొదలై, కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షతో ఊపందుకున్న ఈ నిరసన తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో వారిపై పోలీసులు బాష్పవాయువు, లాఠీఛార్జీలు ప్రయోగించారు. నిరసనలు ఊపందుకోవడంతో సెంట్రల్ ఢిల్లీలోని చాలా ప్రాంతాలు స్తంభించిపోయాయి. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. శాంతియుత నిరసనకారులపై పోలీసులు క్రూరంగా అణచివేస్తూ, కొడుతున్నారని, వీధుల్లోని విద్యార్థులకు మద్దతుగా నిలవాలని ఎంపిలను కోరుతున్నానని సౌరవ్ దాస్ అన్నారు. కొన్ని కిలోమీటర్ల దూరంలో, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేరిన కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, తాను చాలా బాగున్నానని, తన ఆరోగ్య సూచికలు సాధారణంగా ఉన్నాయని పేర్కొంటూ, సిజెపి పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనడానికి తాత్కాలికంగానైనా తనను వెళ్లనివ్వాలని వైద్య సూపరింటెండెంట్‌ను అభ్యర్థించారు. వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించినప్పటి నుండి నిరాహార దీక్ష చేస్తున్న సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే మాట్లాడుతూ, ‘మా డిమాండ్లు స్పష్టం: ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆత్మహత్య చేసుకున్న పిల్లల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందాలి, మరియు సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలి’ అని అన్నారు.

### ప్రధాన్‌తో అమిత్ షా భేటీ

పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపై ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిజెపి ఇచ్చిన నిరసన పిలుపులో భాగంగా వేలాది మంది పార్లమెంటు వైపు పాదయాత్రకు ప్రయత్నించిన నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని తన కార్యాలయంలో ప్రధాన్, షాను కలిసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఏమి జరిగిందో వెంటనే తెలియరాలేదు.

## స్తంభించిన పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడింది. అంతరాయాల నేపథ్యంలో సభలు ఆరుసార్లు తిరిగి సమావేశమైన తర్వాత, మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో మరుసటి రోజుకు వాయిదా వేశారు. అంతకుముందు, లోక్‌సభ కార్య విధాన నియమాలలోని రూల్ 377 ప్రకారం ప్రజా ప్రాముఖ్యత గల అంశాలను చేపట్టేందుకు సభకు అనుమతించాలని అధ్యక్షత వహించిన జగదంబిక పాల్ విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్ష ఎంపిలు తమ నిరసనను కొనసాగించడంతో, మధ్యాహ్నం 2.30 గంటలకు సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు, సభా కార్యకలాపాలు నిర్వహించడానికి తగినంత మంది సభ్యులు ఉన్నారని పాల్ చెప్పినప్పటికీ, కొంతమంది ప్రతిపక్ష ఎంపిలు తమను సభలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంతరాయాలు కొనసాగితే సభ సజావుగా పనిచేయలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో, ప్రశ్నోత్తరాల సమయం జరుగుతుండగా స్పీకర్ ఓం బిర్లా సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేయవలసి వచ్చింది. ఆరుగురు మాజీ ఎంపిల మృతిపై సంతాప తీర్మానాలను చదువుతున్నప్పుడు ఇద్దరు సభ్యులు నినాదాలు చేయడాన్ని బిర్లా అభ్యంతరం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగడంతో సభను మధ్యాహ్నం 12:30 గంటల వరకు వాయిదా వేశారు. కార్యకలాపాలు వాయిదా పడటానికి ముందు, భారత ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుండి 38కి పెంచిన ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లును న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అయితే మధ్యాహ్నం 12:30 గంటలకు కూడా సభలో అంతరాయమే కనిపించింది. జీరో అవర్‌ను చేపట్టాలని సభాపతి పదేపదే చేసిన విజ్ఞప్తులకు ప్రతిపక్ష సభ్యుల నుండి సానుకూల స్పందన రాలేదు. సభాపతిగా ఉన్న దిలీప్ సైకియా, కార్యకలాపాలను మధ్యాహ్నం 1 గంట వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 1 గంటకు సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్షాల నిరసనలు కొనసాగాయి. సభాపతిగా ఉన్న సైకియా, ప్రతిపక్ష సభ్యులను వారి వారి స్థానాలకు తిరిగి వెళ్లి కార్యకలాపాలలో పాల్గొనాలని కోరారు. ‘మీరు పదేపదే సభకు అంతరాయం కలిగిస్తున్నారు. బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించడం ఆమోదయోగ్యం కాదు’ అని ఆయన అన్నారు. ప్రతిపక్షం ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో, సైకియా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

### రాజ్యసభలోనూ విపక్షాల ఆందోళనలు

మరోవైపు వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో దోషులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో రాజ్యసభను మంగళవారానికి వాయిదా వేశారు. సభ నిబంధనలను గౌరవించాలని తాను పదేపదే చేసిన విజ్ఞప్తి ఫలించకపోవడంతో సభను వాయిదా వేసినట్లు డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తెలిపారు. రాజ్యసభ ఉదయం ప్రారంభం కాగానే పేపర్ల సమర్పణ, ఆ తర్వాత కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, సంతాప తీర్మానాల అనంతరం సభను మొదట వాయిదా వేశారు. పేపర్ల సమర్పణ అనంతరం, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే నీట్‌యుజి 2026 పేపర్ లీక్‌పై మాట్లాడుతూ ఈ సమస్య లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినదని అన్నారు. వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ (నిరసన జరుగుతున్న ప్రదేశానికి) చేరుకున్నారని, వారిపై లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం వారిని అణచివేసి, ఈ సమస్యను అణగదొక్కడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ సమయంలో ప్రతిపక్ష సభ్యులు ‘సిగ్గు, సిగ్గు‘ అని నినాదాలు చేశారు. ఈ గందరగోళం మధ్య, ఛైర్మన్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. సభ కార్యకలాపాలను రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటకు, ఆ తర్వాత సభను మధ్యాహ్నం 12.50 గంటకు, మళ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12.50 గంటలకు సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు నిరసన చేస్తున్న విద్యార్థులకు, వారిపై పోలీసులు తీసుకున్న చర్యకు అనుకూలంగా నినాదాలు కొనసాగించారు. వారు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఉన్న రామ మందిరంలో విరాళాల దొంగతనానికి వ్యతిరేకంగా కూడా నినాదాలు చేశారు. నినాదాలు కొనసాగుతుండటంతో, రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, సోమవారం జరిగిన సమావేశంలో ప్రభుత్వ శాసన వ్యవహారాలకు సమయాన్ని కేటాయించిన వ్యాపార సలహా కమిటీ నిర్ణయం గురించి డిప్యూటీ ఛైర్మన్ సభ్యులకు తెలియజేశారు. ప్రతిపక్ష సభ్యులు నినా సభ్యులు తమ పట్టు వీడకపోవడంతో సభను మధ్యాహ్నం 2:30 గంటల వరకు అరగంట పాటు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2:30 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, డిప్యూటీ స్పీకర్ ప్రతిపక్ష సభ్యులను శాంతింపజేయడానికి ప్రయత్నిస్తూ, వారు తమ స్థానాలకు తిరిగి వెళ్లి సభ సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. అయితే ప్రతిపక్షం ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో, హరివంశ్ సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు.

# ఫుట్‌బాల్ విశ్వవిజేత స్పెయిన్

ప్రపంచ ఫుట్‌బాల్ మహా సమరంలో స్పెయిన్ మెరుగైన రారాజులుగా నిలిచారు. అద్వితీయ ప్రదర్శనతో ఆకట్టుకున్న స్పానిష్ టీమ్ 16 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత రెండోసారి జగజ్జేతగా అవతరించింది. కోట్లాది మంది అభిమానులు ఉత్కంఠతో ఊపిరి బిగబట్టి చూసిన ఫైనల్ పోరులో స్పెయిన్ జట్టు తిరుగులేని ఆటతో ప్రత్యర్థిని ముంచెత్తింది. మైదానంలో ప్రతి అంగుళాన్ని తమ అద్భుతమైన పాసింగ్‌తో శాసిస్తూ, భీకర దాడులతో అర్జెంటీనా రక్షణ శ్రేణిని ముక్కలు చేసింది. ఫుట్‌బాల్ తప్పదనుకున్న సాకర్ కురుక్షేత్రాన్ని పూర్తిగా ఏకపక్షం చేసింది. మెస్సీ నాయకత్వంలోని ఫార్వర్డ్స్ పూర్తిగా తేలిపోయిన వేళ నిర్ణీత 90 నిమిషాల పాటు అర్జెంటీనా కీపర్ ఎమిలియానో అద్భుతంగా నిలిచినా, ఎక్స్‌ట్రా టైమ్‌లో సాగిన స్పెయిన్ దండయాత్రను అడ్డుకోలేకపోయాడు. 106వ నిమిషంలో ఫెర్రన్ టోరెస్ కొట్టిన బుల్లెట్ లాంటి గోల్‌తో స్పెయిన్ కోట బద్దలైంది. ఈ చరిత్రాత్మక విజయంతో పురుషుల, మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టైటిళ్లను ఒకేసారి కైవసం చేసుకున్న తొలి దేశంగా స్పెయిన్ సాకర్ చరిత్రను తిరగరాసింది. మరో కప్పు నెగ్గి కెరీర్‌ను ఘనంగా ముగించాలని ఆశించిన మెస్సీ కన్నీళ్లతో తన పోరాటం ముగించాడు.

క్రీడా ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన ఫిఫా సాకర్ మహా సంగ్రామంలో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాపై యూరోపియన్ కింగ్ స్పెయిన్‌దే పైచేయి అయింది. మెగా టోర్నీలో స్పానిష్ టీమ్ రెండోసారి విజేతగా నిలిచింది. ఆఖరిలో అద్భుతాలను నమోదు చేస్తూ వరుసగా రెండోసారి ఫైనల్‌కు వచ్చిన అర్జెంటీనాను స్పానిష్ టీమ్ అడ్డుకుంది. మెస్సీ మ్యాజిక్ చేయకుండా నిలువరించింది. అసలు ఆ జట్టుకు గోల్ కొట్టే అవ కాశమే రాకుండా చేసి.. చరిత్ర సృష్టించింది. 80 వేల మంది ప్రేక్షకులతో కిక్కిరిసిన మెట్‌లైఫ్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి మొదలై తెల్లవారుజాము వరకు సాగిన ఫైనల్లో స్పానిష్ టీమ్ 1–0తో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. 2010లో తొలి సారి కప్పు నెగ్గిన ఆ జట్టు మళ్లీ ఇన్నేండ్ల తర్వాత రెండో ట్రోఫీని అందుకుంది. ఈమ్యాచ్‌లో స్పెయిన్ ఎంతలా ఆధిపత్యం చెలాయించిందంటే.. ఒక దశలో స్పెయిన్ 16 షాట్లు కొట్టగా, అర్జెంటీనా కనీసం ఒక్క షాట్ కూడా టార్గెట్ వైపు కొట్టలేకపోయింది. స్పానిష్ టీమ్ టార్గెట్‌పై 11 సహా మొత్తంగా 20షాట్లు కొడితే అర్జెంటీనా కేవలం రెండే షాట్లు అది కూడా చివర్లో కొట్టగలిగింది.

**చప్పగా మొదలై...** రెండు మేటి జట్ల మధ్య ఆట తొలుత చప్పగా సాగింది. ఫస్ట్ హాఫ్ స్పెయిన్ జట్టు బంతిపై పూర్తి నియంత్రణ ప్రదర్శించింది. అర్జెంటీనా కంటే రెట్టింపు పాస్‌లు పూర్తి చేస్తూ వరుస దాడులతో ఒత్తిడి పెంచింది. అయితే, మెస్సీ సేన డిఫెన్స్ లైన్ అంతే ధీటుగా స్పందించి స్పెయిన్ దాడులను తిప్పికొట్టింది. ఐదో నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్ రైట్ ఫ్లాంక్‌లో బంతిని అందుకొని టార్గెట్‌పై దాడి చేసినా.. గోల్ కొట్టలేకపోయాడు. ఆ వెంటనే మెస్సీసేన సైతం కౌంటర్ ఎటాక్ ప్రారంభించింది. ఓ దశలో మెస్సీ బంతిని ప్రత్యర్థి బాక్స్ వద్దకు తీసుకెళ్లినా.. స్పెయిన్ కీపర్ చాకచక్యంగా అడ్డుకున్నాడు.




**స్పెయిన్ షాట్స్.. మార్టినెజ్ సేవ్స్..** సెకండాఫ్ మొదలైన వెంటనే స్పెయిన్ పూర్తిగా ఎటాకింగ్ మోడ్‌లోకి వెళ్లింది. బంతిని అర్జెంటీనా బాక్స్‌లోనే ఉంచిన రోడ్రి నేతృత్వంలోని ఆ జట్టు ఫార్వర్డ్స్ వరుస దాడులతో హోరెత్తించారు. కానీ, అర్జెంటీనా గోల్ కీపర్ మార్టినెజ్ అద్భుతగోడలా నిలబడటంతో ఆజట్టు ప్రయత్నాలు ఫలించలేదు. విరామం నుంచి వచ్చిన వెంటనే స్పెయిన్ ఆటగాడు పెడ్రి బాక్స్ వెలుపల నుంచి కొట్టిన ప్రమాదకర షాట్తో పాటు 64వ నిమిషంలో ఓల్మో షాట్, 67వ నిమిషంలో యామల్ క్రాస్ను టోర్రెస్ హెడర్ ద్వారా గోల్ కొట్టే ప్రయత్నాన్ని నిలువరించాడు. ఇక, 77వ నిమిషంలో స్పెయిన్ ఒక్కసారిగా దాడుల మోత మోగించింది. పెడ్రి, యమాల్, కుబార్సి వేసిన వరుస షాట్లు కొట్టినా అవి మార్టినెజ్ పెట్టని గోడను దాటలేదు. స్పెయిన్ దాడులను నిలువరించడంలో మునిగిన మెస్సీసేన గోల్ కోసం కనీస ప్రయత్నం కూడా చేయలేకపోయింది.

**ఎంజోకు రెడ్ కార్డ్...** నిర్ణీత సమయంలో టార్గెట్ ఒక్క షాట్ కూడా కొట్టలేకపోయినా అర్జెంటీనాకు ఇంజూరీ టైమ్లో షాక్ తగిలింది. స్పెయిన్ ప్లేయర్ కుబార్సిని ఫౌల్ చేసిన ఎంజో ఫెర్నాండెజ్కు రిఫరీ రెండో ఎల్లో కార్డు చూపించాడు. ఫలితంగా అతడు రెడ్ కార్డ్ అందుకుని మైదానాన్ని వీడాడు. దాంతో డిఫెండింగ్ చాంపియన్ పది మందితోనే ఆడాల్సి వచ్చింది. ఈ తరుణంలో ఫెర్రన్ టోర్రెస్ను పారడెస్ ఫౌల్ చేయడంతో స్పెయిన్కు డీ బాక్స్ వెలుపల ఫ్రీ కిక్ రూపంలో మరో అద్భుత అవకాశం లభించింది. దీనికి స్పానిష్ వండర్ కిడ్ యమాల్ గోల్ పోస్ట్‌కు కుడి అంచువైపు కొట్టినా..అర్జెంటీనా కీపర్ మార్టినెజ్ ఊహించని రీతిలో డైవ్ చేసి బంతిని ఆపాడు. ఇరు జట్లు నిర్ణీత సమయంలో గోల్ చేయకపోవడంతో విజేత ఎవరో తేలడానికి మ్యాచ్ ఎక్స్‌ట్రా టైమ్‌కు చేరింది.

**టోరెస్ విన్నింగ్ గోల్...** ఎక్స్‌ట్రా టైమ్ మొదలైన వెంటనే స్పెయిన్ ఆటగాడు నికో విలియమ్స్ (96వ నిమిషంలో) బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి సంబరాల్లో మునిగిపోయాడు. అయితే, గోల్ ప్రయత్నంలో స్పానిష్ ప్లేయర్ మైకెల్ మెరినో.. అర్జెంటీనా డిఫెండర్ నికోలస్ ఒటామెండి కాలిని తొక్కి ఫౌల్ చేసినట్టు గుర్తించిన రిఫరీ ఆ గోల్‌ను నిరాకరించడంతో స్పెయిన్ ఆటగాళ్లు నిరుత్సాహపడ్డారు. కానీ, ఎక్స్‌ట్రా టైమ్‌లో బ్రేక్ నుంచి వచ్చిన వెంటనే స్పెయిన్ సంచలన గోల్ సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 106వ నిమిషంలో నికో విలియమ్స్ ఎడమవైపు నుంచి అర్జెంటీనా డిఫెన్స్‌ను చేధిస్తూ ఒక అద్భుతమైన క్రాస్ అందించాడు.దాన్ని అందుకున్న ఫెర్రన్ టోరెస్ ఏమాత్రం తడబడకుండా అర్జెంటీనా కీపర్ మార్టినెజ్, ముగ్గురు డిఫెండర్లను ఛేదిస్తూ బంతిని నెట్లోకి పంపాడు. దీంతో స్పెయిన్ 1–0తో ముందంజ వేసింది.

**ఎంబాపెదే గోల్డెన్ బూట్...** టోర్నీ ఆసాంతం రాణించిన ఎంబాపెనే గోల్డెన్ బూట్ (అత్యధిక గోల్స్ చేసినవారికి ఇచ్చే అవార్డు) వరించింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో అతడు రెండుగోల్స్ చేయడంతో టోర్నీలో అతడి గోల్స్ సంఖ్య 10కు చేరడంతో గోల్డెన్ బూట్ దక్కించుకున్నాడు.

## యువతరంగం

# సమాజం వినాల్సిన నిశ్శబ్ద కేక

ప్రభుత్వ ఉద్యోగం కోసం దాదాపు యాభై సార్లు పరీక్షలు రాసినా విజయం దక్క లేదు. తండ్రి ఆశలను నిలబెట్టలేకపోయాననే బాధతో 'క్షమించండి నాన్నా... నేను ప్రయత్నించాను' అనే ఐదు పంక్తుల లేఖ రాసి, ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్‌కు చెందిన 23 ఏళ్ల బిటెక్ గోల్డ్ మెడలిస్ట్ ఆనంద్ కుమార్ తన జీవితాన్నే ముగించుకున్న ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. రాష్ట్రంలో మూడో ర్యాంకు సాధించిన ప్రతిభావంతుడైన యువకుడు కూడా ఉద్యోగం దొరకక తీవ్ర మానసిక ఒత్తిడికి గురై చివరకు ఆత్మహత్యను ఎంచుకోవడం కేవలం ఒక కుటుంబ విషాదం మాత్రమే కాదు... దేశ యువత ఎదుర్కొంటున్న తీవ్రమైన సామాజిక, ఆర్థిక, మానసిక సంక్షోభానికి ప్రతీక. ఈ ఘటనలో బాధ కలిగించేది అతని మరణం మాత్రమే కాదు. 'నేను ప్రయత్నించాను' అనే చివరి మాటలు. ఓ కుమారుడు తన వైఫల్యానికి తండ్రికి క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఈ ప్రశ్నకు సమాధానం అందరూ వెతకాల్సిందే. ప్రభుత్వం, సమాజం, విద్యా వ్యవస్థ, తల్లిదండ్రులు, మన మందరం స్పందించాలి.

**ప్రభుత్వ ఉద్యోగమే జీవితమా?**

దేశంలో ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న గౌరవం, ఉద్యోగ భద్రత, స్థిరమైన వేతనం, సామాజిక గుర్తింపు కారణంగా లక్షలాది మంది యువత అదే లక్ష్యంగా సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్నారు. ఒక పోస్టుకు లక్షల మంది పోటీ పడుతున్న పరిస్థితి ఏర్పడింది. కొద్దిమంది మాత్రమే ఎంపిక అవుతారు. మిగిలిన వారిలో చాలామంది తమను తాము వైఫల్యంగా భావించడం ప్రారంభిస్తారు. దీనికి మరో కారణం కుటుంబాల అంచనాలు. చిన్నప్పటి నుంచే 'ప్రభుత్వ ఉద్యోగమే జీవిత విజయానికి గుర్తు' అనే భావన పిల్లల మనసుల్లో నాటబడుతోంది. ఇంజినీరింగ్, వైద్యం, మేనేజ్‌మెంట్ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చివరకు ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితమవుతున్నారు. ప్రైవేట్ రంగంలో అవకాశాలు ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రతపై ఉన్న సందేహాలు, తక్కువ వేతనాలు, అస్థిరత కారణంగా చాలామంది వాటిని అంగీకరించడానికి ఇష్టపడడం లేదు. ఫలితంగా నిరంతర పోటీ, నిరాశ, ఒత్తిడి పెరుగుతున్నాయి.

**స్పందన అవసరం**

ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వాలు కేవలం సంతాపం ప్రకటించడం సరిపోదు. ఉపాధి వ్యవస్థలో సమగ్ర మార్పులు అవసరం. మొదటిగా, ప్రభుత్వ ఖాళీలను సంవత్సరాల తరబడి ఖాళీగా ఉంచకుండా నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం భర్తీ చేయాలి. పరీక్షల ప్రకటన నుంచి నియామకం వరకు జరిగే ఆలస్యాలను తగ్గించాలి. ఒక పరీక్ష కోసం రెండేళ్లు, మూడేళ్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి యువతలో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. రెండవది, ప్రభుత్వ ఉద్యోగాలపై మాత్రమే ఆధారపడకుండా ప్రైవేట్ రంగంలో నాణ్యమైన ఉపాధి అవకాశాలను పెంచే విధానాలు అమలు చేయాలి. పరిశ్రమలు, స్టార్టప్‌లు, తయారీ రంగం, గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందితే లక్షలాది కొత్త ఉద్యోగాలు సృష్టించవచ్చు. మూడవది, ప్రతి జిల్లాలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఉచిత మానసిక ఆరోగ్య సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పరీక్షల్లో విఫలమవడం జీవిత వైఫల్యం కాదని చెప్పే కౌన్సెలింగ్‌ను విద్యార్థులకు అందించాలి. నాలుగవది, ఉన్నత విద్యాసంస్థల్లో కెరీర్ గైడెన్స్‌ను తప్పనిసరి చేయాలి. ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే అందుబాటులో ఉన్న ఇతర కెరీర్ అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల గురించి విద్యార్థులకు ముందుగానే అవగాహన కల్పించాలి.





**సమాజం, కుటుంబం కూడా బాధ్యత వహించాలి**

ఈ సమస్యకు ప్రభుత్వం ఒక్కటే బాధ్యురాలు కాదు. సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి. ఒక వ్యక్తి విలువను ఉద్యోగంతో కొలవడం మానుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన వారినే గొప్పవారిగా చూడడం, మిగిలిన వారిని తక్కువగా అంచనా వేయడం వంటి మనస్తత్వం మారాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై అధిక ఒత్తిడి పెట్టకూడదు. 'నువ్వు విజయం సాధించాలి' అనే ప్రోత్సాహం అవసరం. కానీ 'ఇది సాధించకపోతే జీవితమే వ్యర్థం' అనే భావన ప్రమాదకరం. పిల్లల మానసిక స్థితిని గమనిస్తూ వారితో తరచూ మాట్లాడాలి. వారి బాధలను వినాలి. అపజయాలను అంగీకరించే ధైర్యాన్ని నేర్పాలి. విద్యాసంస్థలు కూడా మార్కులు, ర్యాంకులు మాత్రమే కాకుండా భావోద్వేగ పరిపక్వత, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం, జీవన నైపుణ్యాలను బోధించాలి. పోటీ పరీక్షల్లో పదేపదే విఫలమవుతున్న విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి కౌన్సెలింగ్ అందించాలి. అలాగే మీడియా, సామాజిక మాధ్యమాలు కూడా విజయ కథలతో పాటు అపజయాన్ని అధిగమించిన వారి జీవితాలను ఎక్కువగా పరిచయం చేయాలి. 'ఒక పరీక్షలో విఫలమైతే జీవితం ముగిసిపోదు' అనే సందేశాన్ని సమాజంలో బలంగా తీసుకెళ్లాలి.

**ఉద్యోగం కంటే జీవితం విలువైనది**

కాన్పూర్ యువకుడు ఆనంద్ తన చివరి లేఖలో 'క్షమించండి నాన్నా... నేను ప్రయత్నించాను' అని రాశాడు. నిజానికి అతను క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రయత్నించిన వ్యక్తి ఎప్పుడూ ఓడిపోయినవాడు కాదు. కానీ అతను తన జీవిత విలువను ఒక ప్రభుత్వ ఉద్యోగంతో సమానంగా భావించే పరిస్థితికి చేరుకున్నాడు. అదే మన సమాజం ఎదుర్కొంటున్న అసలు విషాదం. ప్రతి యువకుడు, ప్రతి తల్లి తండ్రి, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి పాలకుడు ఈ ఘటనను ఒక హెచ్చరికగా తీసుకోవాలి. ఉద్యోగం అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే; జీవితం అంతా కాదు. విజయం అనేక రూపాల్లో వస్తుంది. అపజయం అంతిమ గమ్యం కాదు. కష్టకాలంలో సహాయం కోరడం బలహీనత అనుకోవడం తప్పు. నిజానికి సాయం కోరడం పరిపక్వతకు చిహ్నం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఉపాధి అవకాశాల విస్తరణ, పారదర్శక నియామక వ్యవస్థ, మానసిక ఆరోగ్య సేవలు, కుటుంబాల ప్రోత్సాహం, సమాజ దృక్పథంలో మార్పు వంటి అంశాలు కలిసి పనిచేయాలి. ఒక యువకుడి చివరి లేఖను మరో యువకుడి చివరి మాటగా మారనివ్వకుండా చూడడం మనందరి సామూహిక బాధ్యత.

## 'మధ్యాహ్న' కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్



**ప్రజాపక్షం/ములుగు :** మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అల్పాహార పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించకుండా వంట కార్మికులతోనే కొనసాగించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జంపాల రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో వంట కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. అల్పాహార పథకాన్ని అక్షయ పాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే వేలాది మంది వంట కార్మికులు ఉపాధి కోల్పోయి ప్రమాదం ఉందన్నారు. కోడిగుడ్ల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న రూ.6 సరిపోవడం లేదని, కోడిగుడ్లు, గ్యాస్, ఇతర నిత్యావసర సరుకులను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని కోరారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించి అల్పాహార పథకాన్ని వంట కార్మికుల ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, మాతంగి శ్యాంసుందర్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, పోరెడ్డి ప్రమీల, గున్నాల రాజకుమారి, సామ సమ్మక్క, కుడుముల సమ్మక్క, అంకం పద్మ, జనగాం శోభ, అల్లి అమృతతో పాటు పలువురు వంట కార్మికులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు జీతాలివ్వాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్




**ప్రజాపక్షం/నర్సంపేట :** హమాలీ కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ కార్మికుల యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు దేవన బోయిన రాంబాబు ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు వేతనాలు ప్రతినెల సమయపాలన పాటిస్తూ చెల్లించాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని సివిల్ సప్లై గోదాములలో హమాలీ కార్మికులకు మూడు నెలలుగా జీతాల జాప్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రతినెల కార్మికుల అకౌంట్లో జీతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జలగం బిక్షపతి, ముద్రబోయిన మహేందర్, కందిక చెన్నకేశవులు, గోవర్ధన్ మియాపురం, దేవన బోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో బిజెపిది నియంతృత్వ పాలన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాస్తుందని, నీట్ పేపర్ లీకేజీపై దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఆందోళన జరుగుతుంటే ప్రధాని మోదీ నియంతలా వ్యవహరిస్తూ కళ్ళుండి చూడలేని కాబోధిలా దుర్మార్గంగా పరిపాలిస్తున్నాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి ఆరోపించారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సోమవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యుడు పిట్టల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోదీ పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ పరిపాలన కొనసాగిస్తున్నాడన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారి సంక్షేమానికి కొమ్ముకాస్తున్నాడన్నారు. విచ్చలవిడిగా దేశ సంపదను, వనరులను కొల్లగొడుతూ, పేదల సంక్షేమాన్ని విస్మరించి వారిని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా బిజెపి ప్రభుత్వం అధికారం చెలాయిస్తుందన్నారు. అవినీతి పరులకు, అక్రమార్కులకు అండగా నిలవడమే కాకుండా వారిని అక్కున చేర్చుకోవడం హేయమైన చర్య అని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారం వేస్తుందని, గ్రామీణ ప్రజల బతుకులకు వరప్రసాదం లాంటి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి గార్చేందుకే మహాత్మా గాంధీ పేరు తొలగించిందని, రాష్ట్రాలపై భారం వేసిందని ఇలా అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న బిజెపి విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్ట్ నెలలో పాదయాత్రలు నిర్వహిస్తామని, సెప్టెంబర్‌లో ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చినట్లు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. దేశంలోని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ నీట్ పేపర్ లీక్ చేసిన దోషులను శిక్షించలేదని, నైతిక బాధ్యత వహించి సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేయలేదని, లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులను శిక్షించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఆందోళన కారులపై లాఠీచార్జీ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం దుర్మార్గపు చర్య... అని దీనిని సిపిఐ ఖండిస్తుందని, విద్యార్థులతో, నిరుద్యోగులతో చెలగాటం ఆడితే ప్రభుత్వం కుప్పకూలక తప్పదని వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి , బత్తుల బాబు, సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.




## హమాలీ కూలీలకు సంక్షేమ బోర్డు

సుతారి రాములు డిమాండ్

**ప్రజాపక్షం/ధర్మపురి :** హమాలీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్మపురి సివిల్ సప్లై గోదాములో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సాధారణ సమావేశం మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ముక్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కూలీ రేట్లు సవరించి అమ లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కా ర్యక్రమంలో ముడుగం రాజలింగం, కొడారి శం కర్, గుర్రం నరేష్, ఎస్.రాజు, కుడుకల శంకర్, జి.తిరుపతి, ఎం.అనిల్, జి.రమేష్, ఎం.రాజశేఖర్, సాయిబాబా పాల్గొన్నారు.




## విద్యార్థులకు కేంద్రప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రీ, సిపిఐ జిల్లా కార్యదర్శి సదానందం డిమాండ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలివుల్లా ఖాద్రీ, సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభలు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆరెపల్లి మానస్ కుమార్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోనీ సిపిఐ కార్యాలయంల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చలో పార్లమెంట్ కార్యక్రమంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు జరిపిన అమానుష లాఠీచార్జీ, అక్రమ నిర్బంధాలు, దమనకాండను తీవ్రంగా ఖండించారు. తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుంటూ నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను అడ్డుకునేందుకు 7 అడుగుల ఇనుప బ్యారికేడ్లను వెల్డింగ్ చేయడం, మెట్రో స్టేషన్లను విద్యార్థులు లోపల ఉండగానే మూసివేయడం, వేలాది మంది పోలీసు బలగాలను మోహరించడం, విద్యార్థులను ఈడ్చుకెళ్లి బలవంతంగా అదుపులోకి తీసుకోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసు లాఠీలతో స్పందించడం మోదీ ప్రభుత్వ నిరంకుశ, ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్‌టిఎలో చోటుచేసుకున్న అవినీతి, వరుస పరీక్షా కుంభకోణాలు, పారదర్శకత లోపం కారణంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని, ఈ కుంభకోణాల నేపథ్యంలో ఇప్పటికే 17 మంది యువ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా, కేంద్ర ప్రభుత్వం వారి కుటుంబాల ఆవేదనను, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉన్నప్పటికీ, దీనికి రాజకీయ బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించకుండా కాపాడేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని, ఆ హక్కును కాలరాసే ప్రతి చర్యను ఎఐవైఎఫ్ ప్రతిఘటిస్తుందన్నారు. విద్యార్థి–యువజన ఉద్యమాలకు ఎఐవైఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులను బేషరతుగా ఎత్తివేసి, అక్రమంగా నిర్బంధించిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని, లాఠీచార్జీకి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య, మాచర్ల అంజి, తాళ్లపల్లి సురేందర్, ఆసాల నవీన్, రాణవేణి సుధీర్‌కుమార్, కల్లేపల్లి నవీన్, చంద్రగిరి ఉదయ్, సాదుల శివ, ఖాజా ,శివ, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఆందోళన చేపట్టక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్పష్టం చేశారు. సిపిఐ నగర కమిటీ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. వరదా నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడంలో వివక్ష నెలకొన్నదన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదలు సరైన ఉపాధి అవకాశాలు లేక నివాస స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ పేదలను సమీకరించి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ రెండున్నర ఏళ్ల గడుస్తున్నా నేటికీ ఆ పని చేయలేదని సురేష్ తెలిపారు. సంక్షేమ పథకాల అమలు కూడా సరైన రీతిలో జరగడం లేదని పింఛన్ల పెంపుతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ పిలుపు మేరకు ఆగస్టు ఆరు నుంచి 15 వరకు జిల్లాలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఐదు నియోజక వర్గాల పరిధిలో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని దండి సురేష్ తెలిపారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, ఎస్‌కె సైదా, జాకీర్, పి. మోహన్‌రావు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు సంక్షేమమే శాఖ ప్రాధాన్యం

ప్రతి అర్హుడికి పథకాల ఫలాలు అందాలి
డిజిపి సి.వి ఆనంద్

వెల్ఫేర్ సొసైటీ, ఆరోగ్య భద్రత పథకాలపై సమగ్ర సమీక్ష

విద్య, వైద్యం, రుణాలు, బీమా పథకాల బలోపేతానికి ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ పోలీసు శాఖ కట్టుబడి ఉందని రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ నిధుల వినియోగంలో జవాబుదారీతనం, పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. డిజిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, ఆరోగ్య భద్రత (ఆరోగ్య భద్రత) విభాగాల సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, వాటి పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై డిజిపి విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. పోలీసు సిబ్బంది జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించే దిశగా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీసు ఉద్యోగుల పిల్లలకు మెరిట్, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు, జెఇఇ, నీట్‌తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలన్నారు. అలాగే వివాహ రుణాలు, విద్యా రుణాలు, వైద్య రుణాలు, అదనపు కార్పస్ ఇన్సూరెన్స్, వివిధ గ్రాంట్ల ద్వారా పోలీసు కుటుంబాలకు సమగ్ర ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు.

**ఆరోగ్య భద్రతతో వేలాది మందికి వైద్య సేవలు..**
పోలీసు ఆరోగ్య భద్రత పథకం కింద 2025లో 33,126 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందగా, 2026 జూన్ నాటికి 12,392 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందినట్లు డిజిపి వెల్లడించారు. ఇందుకోసం 2025లో రూ.181.74 కోట్లు, 2026 జూన్ నాటికి రూ.73.61 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

**బీమా పథకాలతో కుటుంబాలకు భరోసా..**
విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ద్వారా ఆర్థిక రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ వరకు రూ.5లక్షలు, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.10 లక్షలు, డిఎస్పీలకు రూ.15లక్షలు, ఐపిఎస్ మరియు అంతకంటే పైస్థాయి అధికారులకు రూ.25లక్షల బీమా రక్షణ అందిస్తున్నట్లు వివరించారు.

**సంక్షేమ పథకాల దుర్వినియోగాన్ని సహించం..**
సంక్షేమ పథకాలను వ్యాపార దందాగా మార్చే ప్రయత్నాలను ఏమాత్రం ఉపేక్షించబోమని డిజిపి హెచ్చరించారు. కొద్దిమంది స్వార్థ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తే వేలాది మంది పోలీసు కుటుంబాలు నష్టపోయే పరిస్థితి తలెత్తుతుందని పేర్కొంటూ, ప్రతి పథకం తన అసలు లక్ష్యానికి అనుగుణంగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం..**
సంక్షేమ, ఆరోగ్య భద్రత పథకాల అమలులో టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచాలని డిజిపి సూచించారు. లబ్ధిదారుల వివరాలు, నిధుల వినియోగం, సేవల అమలు వంటి అన్ని అంశాలను సమగ్ర ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేసే విధంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. శాఖకు చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఆదాయాన్ని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్, పోలీసు పిల్లల విద్య, సివిల్స్, గ్రూప్స్ కోచింగ్, స్కాలర్‌షిప్‌లు, వివాహ సహాయం తదితర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.

**తక్కువ వడ్డీతో రుణాలు :** అర్హులైన పోలీసు సిబ్బందికి 9 శాతం వడ్డీతో ఓపెన్ ప్లాట్ రుణాలు, 6.75 శాతం వడ్డీతో గృహ రుణాలు, రూ.5 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు, కుమార్తె వివాహానికి రూ.6 లక్షల వరకు, దేశీయ, విదేశీ ఉన్నత విద్య కోసం రూ.30 లక్షల వరకు తక్కువ వడ్డీ రుణాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డిజి(లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం.భగవత్, ఎడిజి సంజయ్ జైన్, ఐజిలు, పోలీస్ వెల్ఫేర్, ఆరోగ్య భద్రత విభాగం అధికారులు, తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ కృష్ణారెడ్డిపై సస్పెన్షన్ వేటు

లైంగిక వేధింపుల ఆరోపణలు ప్రాథమిక విచారణలో నిజమేనని తేల్చిన ప్రివిలేజ్ కమిటీ

ఎన్‌పిఎ నుంచి తాత్కాలిక సస్పెన్షన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ పోలీసు అకాడమీ (ఎన్‌పిఎ)లో మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడి ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ కృష్ణారెడ్డిని అకాడమీ అధికారులు తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ప్రాథమిక విచారణలో బాధితురాలు చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉన్నట్లు ప్రివిలేజ్ కమిటీ తేల్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తనను గదిలోకి పిలిచి జుట్టు పట్టుకుని ఈడ్చడంతో పాటు శారీరకంగా దాడి చేసి, అసభ్యంగా దూషించారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు జాతీయ పోలీసు అకాడమీలోని సిసిటివి ఫుటేజీలను పరిశీలించడంతో పాటు సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేశారు. అనంతరం జరిగిన ప్రాథమిక అంతర్గత విచారణలో బాధితురాలు చేసిన ఆరోపణలకు మద్దతిచ్చే అంశాలు ఉన్నట్లు ప్రివిలేజ్ కమిటీ గుర్తించినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా ఉదయ కృష్ణారెడ్డిని జాతీయ పోలీసు అకాడమీ నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, కేసుపై అత్తాపూర్ పోలీసులు చట్టపరమైన దర్యాప్తును కొనసాగిస్తున్నారు. కాగా, ఇదే కేసులో ఉదయ కృష్ణారెడ్డి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే, ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, వైద్య అధికారులు అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది.

**ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణా రెడ్డి వ్యవహారంలో కొత్త ట్విస్ట్..**
**–ఆత్మహత్యాయత్నం జరగలేదని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ**
జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్‌పిఎ) ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేశారనే ప్రచారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసుల ప్రాథమిక విచారణలో ఆయన అసలు ఆత్మహత్యాయత్నమే చేయలేదని తేలినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. విచారణలో భాగంగా సేకరించిన ఆధారాలు, వైద్యుల నివేదికలను పరిశీలించిన అనంతరం ఉదయ్ కృష్ణా రెడ్డి అతిగా మద్యం సేవించడం వల్లే అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం. ఆయన శరీరంలో ఎలాంటి విషపూరిత ద్రవపదార్థాలు లేదా ఆత్మహత్యకు ఉపయోగించే పదార్థాలు ఉన్నట్లు వైద్య పరీక్షల్లో గుర్తించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన ఆత్మహత్యాయత్నం చేశారనే ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని, సానుభూతి పొందేందుకు అలాంటి ప్రచారం జరిగిన అవకాశాలపైనా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఘటన అనంతరం వెలుగులోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతున్న సూసైడ్ నోట్ అసలు ఎవరు రాశారు? అది నిజమైనదేనా? లేక తర్వాత సృష్టించబడిందా? అనే కోణంలో పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు.
సూసైడ్ నోట్‌కు సంబంధించిన హ్యాండ్ రైటింగ్, ఫోరెన్సిక్ పరీక్షలతోపాటు ఇతర సాంకేతిక ఆధారాలను కూడా సేకరిస్తున్నారు. కాగా, ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారి ఇచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదు నేపథ్యంలో ఉదయ్ కృష్ణా రెడ్డిపై ఇప్పటికే కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం పోలీసులు పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

# కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. 'రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌లో ఉంటే ప్రభుత్వం కోల్ స్టోరేజ్‌లో పడుకుందని ఎద్దేవా చేశారు.
బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్ కెటిఆర్ సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివేములప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంత్ షిండే, జీవన్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎల్‌నినో వస్తుందని శాస్త్రవేత్తలు ఆరు నెలల ముందే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, ప్రస్తుతం సమావేశాలను పెట్టి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రైతులు ఇప్పటికే నష్టపోయారన్నారు.
70 వేల ఉద్యోగాల నియామకం తాను విసిరిన సవాల్‌పైన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండాను ఎగరేసి పోచారం శ్రీనివాస్ రెడ్డిని విశ్వసించి గెలిపిస్తే, ఆయన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోయారన్నారు. గాచారం బాగాలేకనే పోచారం కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడించడమే బిఆర్ఎస్ కార్యకర్తల లక్ష్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సిఎం 'రేవంత్ రెడ్డి ఒక చిచోరా అని, ఆయన ఏం మాట్లాడుతారో తెలియని వ్యక్తి అని ఎద్దేవా చేశారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ప్రైవేటు భూముల్లోకి ప్రవేశించి చర్యలు చేపట్టడంపై హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్‌ను హైకోర్టు తీవ్రంగా నిలదీసింది. ప్రభుత్వం, దాని అధికారులు సహా ఎవరైనా చట్టానికి లోబడే పనిచేయాలని, కోర్టు ఉత్తర్వులను అపహాస్యం చేసే ధోరణిని సహించబోమని స్పష్టం చేసింది. నీటి వనరుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవడం అభినందనీయమే అయినా, ఆ పేరుతో కోర్టు ఆదేశాలను అతిక్రమించి ప్రైవేటు ఆస్తుల్లోకి వెళ్లడం, నిర్మాణాలను కూల్చివేయడం, యజమానులపైనే పోలీసు కేసులు నమోదు చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా లోతుకుంట గ్రామంలోని 40 ఎకరాల భూమిలో ఈనెల 17న హైడ్రా చేపట్టిన కూల్చివేతలను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికే ఇదే అంశంపై రెండు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, కోర్టు ఉత్తర్వులు చూపించినా అధికారులు పట్టించుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.హరీశ్‌కుమార్ వాదించారు. వాదనలు విన్న జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అవసరమైతే కమిషనర్‌ను కోర్టు ఎదుట హాజరుపరుస్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ సాయంత్రం 6.30 గంటలకు హాజరవుతానని తెలియజేయడంతో విచారణను అప్పటివరకు వాయిదా వేశారు. హైడ్రా తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ భూమి పరిరక్షణ కోసమే చర్యలు చేపట్టామని, భూముల సర్వే పూర్తి చేసేందుకు గడువు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి గతంలో కూడా హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వులపై సందేహాలుంటే ప్రభుత్వ న్యాయవాదుల ద్వారా స్పష్టత తీసుకోవచ్చని, కానీ ఉత్తర్వులు అమల్లో ఉన్నంత వరకు వాటిని తప్పనిసరిగా పాటించాల్సిందేనని స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

**బహదూర్‌గూడ భూములు .. తదుపరి చర్యలు వద్దు**
రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలోని సర్వే నంబర్లు 3, 5లో ఉన్న 28.6 ఎకరాల భూమికి సంబంధించి ఎలాంటి తదుపరి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు హైడ్రాకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. గేట్లు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారంటూ రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వి.రఘునాథ్ 1989–90లో చట్టబద్ధంగా కొనుగోలు చేసిన వ్యవసాయ భూముల్లో అధికారులు జోక్యం చేసుకుని నిర్మాణాలు ధ్వంసం చేశారని వాదించారు. ప్రభుత్వ తరఫున అడ్వొకేట్ జనరల్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న 650 ఎకరాల భూమిలో ఇది భాగమని వివరించారు. తదుపరి విచారణ వరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టరాదని ఆదేశిస్తూ కేసును వచ్చే వారానికి వాయిదా వేశారు.

**ఇంక్రిమెంట్లపై రెండు నెలల్లో నిర్ణయం :** కాంట్రాక్ట్ నుంచి క్రమబద్ధీకరించిన జూనియర్ లెక్చరర్ల ప్రొబేషన్, వార్షిక ఇంక్రిమెంట్ల అంశంపై రెండు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుమారు 714 మంది జూనియర్ లెక్చరర్లు దాఖలు చేసిన పిటిషన్‌లపై విచారణ జరిపిన జస్టిస్ కె.శరత్, అర్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలనను రెండు నెలల్లో పూర్తి చేసి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రేతర విశ్వవిద్యాలయాల సర్టిఫికెట్‌ల ధ్రువీకరణలో జాప్యం జరుగుతోందని ప్రభుత్వం వివరించగా, ఆ ప్రక్రియను నిర్దిష్ట గడువులో ముగించాలని ఆదేశించారు. ఇతర ఆర్థిక ప్రయోజనాలపై ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంటూ విచారణను ముగించారు.

# నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ... మోదీ రాజీనామా చేయాలి

బిఎస్‌పి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేయడాన్ని తెలంగాణ బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై విద్యార్థులు 22 రోజులుగా జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. నిరసనకారులపై పోలీసు బలగాలతో అణచివేత చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, నీట్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ పదవి నుంచి తప్పుకోవాలని ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు.

# ఓటరు నమోదు ప్రక్రియలో అధికార, ఎంఐఎం పార్టీల అక్రమాలు

బిఎల్‌ఒలపై ఒత్తిళ్లు, బెదిరింపులు

సిఇఒకు బిజెపి ప్రతినిధి బృందం ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో అధికార కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు అక్రమాలకు పాల్పడుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో అర్హులైన ఓటర్లను బెదిరిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియకు తీవ్ర ఆటంకాలు సృష్టిస్తున్నారని అన్నారు. ఈ మేరకు బిజెపి ప్రతినిధి బృందం సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి.సుదర్శన్ రెడ్డిని కలిసి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. అనంతరం మీడియాతో రాంచందర్ రావు మాట్లాడుతూ ఆగస్టు 3వ తేదీతో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో, బిజెపి నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితులను పరిశీలిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషనర్‌ను కలిసిన వారిలో బిజెపి సీనియర్ నాయకులు మర్రి శేశిధర్ రెడ్డి, పొన్న వెంకటరమణ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరించే కుట్రను తిప్పికొడుతాం

కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ విద్యను పూర్తిగా ప్రైవేట్ పరం చేసే కుట్రలను తిప్పికొడుతామని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. విద్యా కమిషన్ రిపోర్ట్ పేరుతో 27వేల స్కూళ్లను 4వేలకు కుదించే ప్రయత్నం జరుగుతోందని కవిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో కార్పొరేట్ పాఠశాలకు రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో గోల్ మాల్ చేసి, మేఘా, కేఎంవీ సంస్థలకే సగం పనులు ఇచ్చారని ఆరోపించారు.
బడ్జెట్ స్కూళ్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా వాటిని చంపేస్తున్నారని మండిపడ్డారు. గుడి ఎంత ముఖ్యమో బడి కూడా అంతే ముఖ్యమని, పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫాములు పూర్తిగా అందలేదని ఆరోపించారు.
ఐదు రోజుల పాటు విద్యార్థులకు గుడ్డు పెట్టాలని, దీని ధరను రూ 8 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు.

# బాన్సువాడ ఘటనపై రాజకీయాలు తగవు

అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనపై బిఆర్ఎస్ నేత హరీశ్ రావు రాజకీయాలు చేయడం సరికాదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. గతంలో ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వికటించి నలుగురు మహిళలు మరణించిన ఘటనను హరీశ్ రావు మరిచిపోయారా అని ప్రశ్నించారు.
ఆ సమయంలో ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు బాధ్యత వహించకుండా మౌనంగా ఉన్నారని, ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఇలాంటి ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి విభాగాన్ని ఆధునీకరిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నామని పేర్కొన్నారు.
బాన్సువాడ ఘటన మంత్రి దృష్టికి వచ్చిన వెంటనే ఈ నెల 13న విచారణ కమిటీని ఏర్పాటు చేశామని, సీనియర్ వైద్యులతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అస్వస్థతకు గురైన బాలింతలను నిమ్స్‌కు తరలించి పూర్తి వైద్య బాధ్యత ప్రభుత్వం తీసుకుందని, చికిత్స పొందుతున్న ఐదుగురినీ ఆరోగ్యంగా ఇళ్లకు పంపేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాలింతల కుటుంబాలను హరీశ్ రావు పరామర్శించాలని, మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని అద్దంకి దయాకర్ సూచించారు.


# ఎస్ఎఫ్ఐ దీక్ష శిబిరాన్ని భగ్నం చేయడాన్ని ఖండించిన టిఎస్‌యుటిఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ చేపట్టిన్న దీక్ష శిబిరాన్ని పోలీసులు భగ్నం చేయడాన్ని టిఎస్ యుటిఎఫ్ ఖండించింది. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో చేస్తున్న సంస్కరణలను వ్యతిరేకిస్తూ పోరాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, అందుకు భిన్నంగా కేంద్ర విద్యా మంత్రి రాజీనామా డిమాండ్‌తో జరిగే పోరాటాన్ని అడ్డుకోవడమంటే కేంద్ర ప్రభుత్వ సంస్కరణలకు తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతున్నట్లుగా భావించాల్సి వస్తుందని టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

# నిజాం క్లబ్‌లో రూ.కోటికి పైగా ఆర్థిక అక్రమాలు

మాజీ ఉపాధ్యక్షురాలు, మాజీ కార్యదర్శిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ప్రముఖ నిజాం క్లబ్లో రూ.కోటికి పైగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మాజీ ఉపాధ్యక్షురాలు, మాజీ కార్యదర్శిపై సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు జాఫర్ జావీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం, నిజాం క్లబ్ అధ్యక్షుడిగా అక్టోబర్ 2024 నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్న జాఫర్ జావీద్ తన ఫిర్యాదులో మాజీ ఉపాధ్యక్షురాలు ఆశాలత, మాజీ కార్యదర్శి ఎం.అమరేందర్ రెడ్డి పరస్పర కుమ్మక్కై క్లబ్ నిధులను అక్రమంగా మళ్లించారని ఆరోపించారు. అధ్యక్షుడు అందుబాటులో లేరని క్లబ్ ఫైనాన్స్ మేనేజర్‌తో పాటు బ్యాంకు అధికారులను తప్పుదోవ పట్టించి, ఆయన అనుమతి లేకుండానే చెక్కులపై సంతకాలు చేసి భారీ మొత్తాలను డ్రా చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం క్లబ్ నిబంధనల ప్రకారం అధ్యక్షుడు లేని సందర్భంలో మాత్రమే ఉపాధ్యక్షుడు ఆర్థిక పత్రాలపై సంతకం చేసే అధికారం ఉంటుంది. అయితే అధ్యక్షుడు విధుల్లో ఉన్నప్పటికీ ఆయన లేరని తప్పుడు సమాచారం ఇచ్చి చెక్కులు జారీ చేశారని, అంతేకాకుండా తమ పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అధికారాలు కొనసాగుతున్నట్లుగా బ్యాంకులను తప్పుదోవ పట్టించి లావాదేవీలు నిర్వహించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రూ.1 కోట్లకు పైగా విలువైన చెక్కులు నగదుగా మార్చుకున్నట్లు బ్యాంకు లావాదేవీల ద్వారా గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ విషయాన్ని తెలుసుకున్న అనంతరం 2025 నవంబర్ 24న ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ శాఖలకు లేఖలు రాసి సంబంధిత చెక్కుల చెల్లింపులను నిలిపివేయాలని క్లబ్ అధ్యక్షుడు కోరినట్లు వెల్లడించారు. ఎస్ఐ ఎ. రాధిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# అమెరికాలో తెలంగాణ సంస్కృతి వైభవం

చాటుతున్న ప్రవాస సమాజం : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలంగాణ మూలాలను, తెలుగు భాషను, సంస్కృతిని గర్వంగా నిలబెట్టుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. అమెరికాలో నిర్వహించిన తెలుగు తెలంగాణ అసోసియేషన్ (టిటిఎ) మెగా కన్వెన్షన్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్థానిక వేర్లను మరువకుండా ప్రపంచ స్థాయి విజయాలను అందుకోవడమే నిజమైన ప్రగతి అని అన్నారు. భావితరాలకు తెలంగాణ చరిత్ర, సంప్రదాయాలను పరిచయం చేయాలని, అమెరికాలోని తెలంగాణ కుటుంబాలు ఐక్యంగా ఉండాలని సూచించారు. ప్రవాస భారతీయులు అక్కడ నేర్చుకున్న సాంకేతికత, ఆవిష్కరణలను తెలంగాణ అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. ఒక విద్యార్థికి మార్గదర్శకత్వం, ఒక ప్రభుత్వ పాఠశాలకు చేయూత, మహిళా సంఘాలకు మార్కెట్ అవకాశాలు, రైతులకు కొత్త సాంకేతికతను పరిచయం చేయడం వంటి సామాజిక బాధ్యతలను స్వీకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, స్వయం సహాయక సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి తెలిపారు. మహిళల అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక ఆస్తుల సృష్టికి ప్రవాస తెలంగాణ వారు భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అభివృద్ధి పథంలో కలిసి ముందుకు సాగుతూ ప్రపంచవ్యాప్తంగా తెలుగు కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంప్రదాయం ప్రకారం వనదేవతలైన సమ్మక్క సారలమ్మ తల్లుల గద్దెల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు చేశారు.

**15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు.. ఆరోపణలు పూర్తిగా అవాస్తవం : మంత్రి సీతక్క**
తెలంగాణ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాల చెల్లింపులకు మళ్లించిందంటూ ఇటీవల ఒక ఆంగ్ల దినపత్రికలో వచ్చిన వార్తలను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలు పూర్తిగా వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 52 ప్రకారం గ్రామ పంచాయతీల పరిధిలోని వీధి దీపాల నిర్వహణ, వాటి విద్యుత్ బిల్లుల చెల్లింపు పంచాయతీల చట్టబద్ధమైన బాధ్యత అని తెలిపింది. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో టైడ్ గ్రాంట్లు తాగునీటి సరఫరా వంటి నిర్దేశిత పనులకు వినియోగిస్తామని, అన్‌టైడ్ గ్రాంట్లను రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ ప్రకారం కమ్యూనిటీ ఆస్తుల నిర్వహణ, విద్యుత్ పంపిణీ, తాగునీటి వ్యవస్థల నిర్వహణ వంటి ఏ అభివృద్ధి పనికైనా వినియోగించే అవకాశం ఉందన్నారు. ఈ నిధులను ప్రభుత్వం నేరుగా స్థానిక సంస్థల ఖాతాలకే విడుదల చేస్తుందని, ఇతర అవసరాలకు మళ్లించే అవకాశం లేదన్నారు. చట్టబద్ధమైన ఖర్చులను నిధుల మళ్లింపుగా పేర్కొనడం సరైంది కాదని, ప్రజలు ఇలాంటి నిరాధారమైన ఆరోపణలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.



## మేకల రాములు త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయ్

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజా ఉద్యమాలకు జీవితాంతం అంకిత భావంతో సేవలు అందించిన కామ్రేడ్ మేకల రాములు త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పేర్కొన్నారు. పేద ప్రజలు రైతుల కోసం గీత కార్మికుల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడిగా మేకల రాములు నిలిచిపోయారని కొనియాడారు. సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు మేకల రాములు సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవిత లక్ష్యంగా భావించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తి మేకల రాములు అని తెలిపారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మేకల రాములు భౌతికంగా దూరమైన ఆయన ఆశయాలు ఉద్యమ స్ఫూర్తి ప్రజల గుండెల్లో చిరస్థాయి అని పిలుస్తాయని అన్నారు. అంతిమయాత్రలో సైతం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కె.శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి.జగన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య పాల్గొన్నారు.

## ప్రజలు చట్టాలను గౌరవించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజలు చట్టాలను గౌరవించాలని ఏవైనా సమస్యలు ఉంటే చట్టప్రకారం పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డే నందు ఆయన బాధితుల నుండి అర్జీలను స్వీకరించి అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు తగాదాలు పెట్టుకోవడం, ఆస్తుల కోసం ప్రాణాలు తీసుకునే స్థాయికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

**ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం : డిఎస్పి ప్రసన్న కుమార్**

బాధితులకు, ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని సూర్యాపేట డిఎస్పి ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. సోమవారం సూర్యాపేట డివిజన్ కార్యాలయం నందు నిర్వహించిన పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం డివిజన్ స్థాయి పోలీస్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించుకోవాలని సూచించారు.

## 2029 ఎన్నికలే లక్ష్యంగా 'ఎస్ఐఆర్'తో బిజెపి కుట్ర

### సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను అస్త్రంగా వాడుకుంటోందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూర్ సభ్యులు బి.వి. రాఘవులు తీవ్రస్థాయిలో ఆరోపించారు. అర్హులైన పౌరుల ఓటు హక్కును పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన ఎన్నికల ప్రక్రియను.. బీజేపీ తమ వ్యతిరేక ఓట్లను గల్లంతు చేసే కుట్రల కోసం దుర్వినియోగం చేస్తోందని ఆయన విమర్శించారు. చౌటుప్పల్లోని పద్మావతి ఫంక్షన్ హాల్లో సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలు, డీలిమిటేషన్ తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. దేశంలో నిత్యావసరాల ధరల పెరుగుదల, రైతుల కష్టాలు, నిరుద్యోగం, యువతలో అసంతృప్తి తదితర సమస్యల వల్ల బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని రాఘవులు అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాభిప్రాయంతో నేరుగా గెలవడం కష్టమన్న అంచనాతోనే ఓటర్ల జాబితాలను తారుమారు చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి, అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ప్రాంతీయ సదస్సుకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి. పాష అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, కొండమడుగు నరసింహ పాల్గొన్నారు.

## పోక్సో కేసులో కానిస్టేబుల్ అరెస్ట్.. రిమాండ్.. తక్షణమే సస్పెన్షన్

### ఖాకీకి మచ్చ తెచ్చిన వారిపై రాజీ లేదు : ఎస్పి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సత్యనారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ కానిస్టేబుల్ సత్యనారాయణను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అనంతరం నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచగా రిమాండ్ విధించబడింది.ఈ సందర్భంగా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఖాకీ దుస్తులు ధరించినంత మాత్రాన ఎవరూ చట్టానికి అతీతులు కారని స్పష్టం చేశారు. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతుండగా నిందితుడిపై వేగంగా కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు సస్పెన్షన్ విధించడం పోలీసు శాఖ కఠిన వైఖరికి నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ముందస్తు కార్యాచరణ

### ప్రజలకు ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

### ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో తాగునీరు, విద్యుత్, వ్యవసాయం తదితర రంగాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, ఎస్‌సి సంక్షేమ శాఖ మంత్రి,ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత,ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం తదితర అంశాలపై నిర్వహించిన ఉమ్మడినల్లగొండ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడి,నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డిలతోపాటు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,జిల్లా కలెక్టర్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు,సాగునీరు,వ్యవసాయం వంటి రంగాల్లో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. రైతులను పంటల మార్పిడి,ఆరుతడి పంటల వైపు మళ్లించేలా విస్తృత అవగాహన కల్పించాలని, ఇప్పటికే వరి సాగు చేసిన రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త బోర్లు వేయడాన్ని నియంత్రించాలని సూచించారు.

**వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలే మేలు : నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశమున్నందున రైతులు వరి సాగు చేయకుండా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీరు ప్రధానంగా తాగునీటికే సరిపోతుందని, వర్షాలు లేకపోతే వచ్చే ఏడాది జూలై వరకు తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు.రైతులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచించారు. డిండి, ఎస్ఎల్‌బీసీ, బస్వాపూర్ తదితర ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.

**ఇప్పటికే వేసిన పంటలను కాపాడాలి : మంత్రి వెంకట్‌రెడ్డి**

అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు.ఇప్పటికే వరి సాగు చేసిన రైతుల పంటలు కాపాడేందుకు అవసరమైన విద్యుత్, నీటి సరఫరా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు.లోవోల్టేజ్ ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని,దేవరకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఎల్‌బీసీ పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలమవుతుందని తెలిపారు. ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి,కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి,దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్,సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, తమ తమ నియోజకవర్గాల్లో తాగునీరు, విద్యుత్, సాగునీరు, ప్రత్యామ్నాయ పంటలు, కోతుల బెడద, మిషన్ భగీరథ నీటి సరఫరా వంటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వా న్ని కోరారు. సమావేశంలోప్రభుత్వ విప్ , నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి,స్పెషలాఫీసర్, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన సెక్రటరీ దాసరి హరిచందన,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్,యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్లు, రెవెన్యూ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.అనంతరం తెలంగాణ జలసిరి" గోడపత్రికను ఆవిష్కరించారు.

**ఎల్‌నినోపై ముందస్తు అవగాహన కల్పించి ఉంటే రైతులకు నష్టం తగ్గేది : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



ఎల్‌నినో ప్రభావంపై కనీసం నెల రోజుల ముందే రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించి ఉంటే ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులను కొంత మేర నివారించవచ్చని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.జిల్లాలో ఇప్పటికే బోరు బావుల ఆధారంగా పలువురు రైతులు వరి నాట్లు వేసుకున్నారని తెలిపారు.జిల్లాలో అత్యధికంగా రైతులు పత్తి సాగు చేసినప్పటికీ,వ్యవసాయ శాఖ అధికారులు పత్తి సాగుకు అనుకూలమని సూచిస్తున్నారని, అయితే నల్ల నేలల్లో మాత్రమే పత్తి బాగా పండుతుందని, ఎర్ర నేలల్లో ఆశించిన దిగుబడి రాదని పేర్కొన్నారు.విత్తనాలు, ఎరువులు,దుక్కి దున్నడం తదితర పనులకు ఎకరానికి సుమారు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొందని, అలాంటి పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.మునుగోడు,దేవరకొండ నియోజకవర్గాలతో పాటు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా అందడం లేదని, చౌటుప్పల్ ప్రాంతంలో కూడా తాగునీటి సమస్య ఉందని తెలిపారు. విద్యుత్ సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని,రైతులు డీడీలు చెల్లించినప్పటికీ ఇంకా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని అన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 23న కలెక్టర్ ముట్టడి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్రంలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న కలెక్టర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.సోమవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుగా సుమారు రూ.10,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఇంటర్,డిగ్రీ,ఇంజినీరింగ్,మెడికల్,లా తదితర కోర్సులు పూర్తిచేసిన వేలాది మంది విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడిచినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు,పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నోట్‌బుక్స్,దుప్పట్లు,దుస్తులు,పరుపులు,తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సరిపడా విద్యుత్, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో సొంత భవనాల కొరత, తరగతి గదుల లేమి, ఉపాధ్యాయులు , అధ్యాపకుల ఖాళీ పోస్టులు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, డిజిటల్ తరగతి గదుల కొరత విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. మెస్ చార్జీలు పెంచి, నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముద్దిగొండ మురళీకృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్,జిల్లా సహాయ కార్యదర్శి రామావత్ శోభన్ బాబు,జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్,జిల్లా కమిటీ సభ్యులు అరవింద్,మహేష్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఆలైన్‌మెంట్‌లో సూర్యాపేటను మళ్లీ చేర్చాలని అఖిలపక్షం, ప్రజాసంఘాల ధర్నా




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** హైదరాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను మళ్లీ చేర్చి సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట అఖిల పక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, అఖిల పక్ష నాయకులు, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి 65 పై ఉన్న ప్రధాన వాణిజ్య పట్టణమన్నారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రజలకు కీలక రవాణా కేంద్రంగా నిలిచిందన్నారు. వరి, పత్తి, ఎర్ర మిరప, జొన్న వంటి పంటల ఉత్పత్తి, పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు, విద్యా, పారిశ్రామిక సంస్థలతో సూర్యాపేట ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉన్న ప్రాంతం అన్నారు. గతంలో బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను చేర్చినప్పటికి, ప్రస్తుతం పరిశీలిస్తున్న మూడో అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను తొలగించడం సూర్యాపేట జిల్లా ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లాలో గత 20 సంవత్సరాలుగా రైల్వే మార్గం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రాకుంటే జిల్లా అంధకారంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్ యాదవ్, మల్లు నాగార్జున్ రెడ్డి, మందారి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, నూకల సుదర్శన్ రెడ్డి, అనుముల రవిబాబు, తుక్కాని మన్మథరెడ్డి, పాండురంగా చారి పాల్గొన్నారు.

## కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు.సోమవారం నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మరో 15 రోజుల్లో రాష్ట్రంలోని రిజర్వాయర్లలో ఉన్న నీరు పూర్తిగా అయిపోయే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నది నుంచి సముద్రంలోకి వృథాగా వెళ్తున్న నీటిని వినియోగించుకునే ప్రణాళికలు రూపొందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన కరువు పరిస్థితుల్లోనూ నాగార్జునసాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించామని, ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని విమర్శించారు.ఇప్పటికే ఉన్న నీటిపారుదల వ్యవస్థలను సమర్థంగా వినియోగించలేని పరిస్థితి ప్రభుత్వానికి ఉందన్నారు. నల్లగొండతో పాటు హైదరాబాద్‌కు కూడా తాగునీటి ఎద్దడి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసిన జగదీశ్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన వద్ద ఉన్న సాంకేతిక ఆధారాలతో కాళేశ్వరం ప్రాజెక్టు సామర్థ్యాన్ని నిరూపిస్తానని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి,మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగటి మల్లికార్జున్‌రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి,పట్టణ బోనగిరి దేవేందర్,అధ్యక్షుడు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ దొడ్డి రమేష్ పాల్గొన్నారు.





## ఆరు గ్యారంటీలను అమలు పరచాలి

### బండి జంగమ్మ డిమాండ్

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఎన్నికలలో హామీలిచ్చిన 6 గ్యారంటీలను నేటికీ పూర్తిస్థాయిలో అమలు పరచలేదని వెంటనే పూర్తిస్థాయిలో అమలుపరిచి పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని భారత జాతీయ మహిళా సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మోట కొండూరు మండల మహిళ సమైక్య మూడవ మహాసభ చాడ గ్రామ శాఖ నాయకురాల్లు చొప్పరి భాగ్యమ్మ, ఆలేటి సబిత, రేపాక ఉమ ల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో జంగమ్మ ముఖ్య అథితిగా పాల్గొని ప్రసంగిచారు. నేటి సమాజంలో మహిళలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యములు కొరబడినాయని, మహిళలకు కేంద్ర రాష్ట్రప్రభుత్వంలో33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళలపై జరిగే లైంగిక దాడులను అత్యాచారాలు, గృహ హింస, ఫోక్స్ చట్టాలను కఠినంగా అమలు చేసి మహిళ లకు రక్షణ ఇవ్వాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. పేద మహిళలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్స్, రేషన్ కార్డులు, ప్రతి మహిళలకు 2500 వందల రూపాయలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహా సభలోసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారా యణ, మండల పార్టీ కార్యదర్శి గాదేగాని మాణిక్యం, జిల్లా మహిళా సమైక్య గౌరవాధ్యక్షురాలు గుర్రం రాజమణి, జిల్లా నాయకురాలు వడ్లకొండ భారతమ్మ పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎంపిక..** భారత జాతీయ మహిళా సమాఖ్య మోటకొండూరు మండలగౌరవాధ్యక్షురాలుగా చొప్పరి భాగ్యమ్మ,అధ్యక్షురాలుగా దామర లక్ష్మి ,ఉపాధ్యక్షులు రేపాక ఉమా, మంచాల పద్మ, ప్రధాన కార్యదర్శిగా మంచాల రాధమ్మ, సహాయ కార్యదర్శిగా ఆలేటి సబితా, మంత్రి రేణుక, కోశాధికారిగా దొంతి వెంకటమ్మ, లతో పాటు 21 మందిని కమిటీ సభ్యులుగా మహసభ ఏకగ్రీవంగా తీర్మానించారు.



## కార్మికుల శ్రమదోపిడీకి కేంద్ర ప్రభుత్వం కుటిలయత్నం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకవచ్చిన కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకునేందుకు కుటిలయత్నం చేస్తుందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎఐటియుసి హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే దేశంలోని కార్మికుల కోసం, వారి హక్కుల కోసం ఆవిర్భవించిన మొట్ట మొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని గుర్తు చేశారు. ఎఐటియుసి నాయకత్వాన మళ్లీ 8 గంటల పని విధానం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అందుకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. ఈ మహాసభకు త్రిపురం సుధాకర్ రెడ్డి అధ్యక్షతన వహించగా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, పట్టణ సిపిఐ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

## ఎఐటియుసి నల్లగొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక





**ప్రజాపక్షం/నల్లగొండ:(గుర్రంపోడు):** గుర్రంపోడులో ఆదివారం నిర్వహించిన ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా 11వ మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి తెలిపారు.మహాసభకు ముందు కార్మికులు గుర్రంపోడు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షులుగా నూనె రామస్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ కేవిఎస్ రెడ్డి,ఉపాధ్యక్షులు ఎడమ సుమతమ్మ,బరిగెల వెంకటేష్, బంటు రాజేశ్వరి,సహాయ కార్యదర్శులు నూనె వెంకటేశ్వర్లు,దోటి వెంకన్న,ఎండి జానీ,కోశాధికారిదోనకొండ వెంకటేశ్వర్లు తోపాటు 39 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

**మహాసభ తీర్మానాలు:** మహాసభలో కార్మికుల హక్కుల పరిరక్షణకు సంబంధించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని,అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని తీర్మానించారుస్కీమ్ వర్కర్ల వేతనాలను పెంచాలని,కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని,కనీస వేతనాల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించిన విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు.

## వాంగ్ చుక్ అరెస్టును ఖండించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జాతీయస్థాయిలో ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న సోనం వాంగ్ చుక్ అరెస్టును తీవ్రంగా ఖండించాలని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెపల్లి ఆదిరెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం నల్లగొండలో జరిగిన ఐఏఎల్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఏఎల్ సభ్యత్వ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని రాబోయే రోజుల్లో సంఘ పాటిష్టతకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని ఆయన సూచించా రు. శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి.ఐఏఎల్ ఆధ్వర్యంలో ఈనెల 25న జరిగే ఒకరోజు న్యాయవాదుల శిక్షణా తరగతులను విజయవంతం చేయాలన్నారు. ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఐఏఎల్ సీనియర్ నాయకులు మునగాల నారాయణరావు, గుండె వెంకటేశ్వర్లు,జి.జవహర్‌లాల్,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న,గుర్రం వెంకటరెడ్డి,పందుల సైదులు,భువనగిరి రవి పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
21-07-2026
www.prajapaksham.in













నిరసన ప్రదర్శనలో ఎస్‌పి ఎంపి డింపుల్‌యాదవ్‌ను అడ్డుకుంటున్న పాలకులు



విద్యార్థుల దీక్ష విరమింపజేస్తున్న షబానా అజ్మీ, ప్రకాశ్‌రాజ్, సంజయ్‌ఝా, ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర బాబు

## దద్దరిల్లిన ఢిల్లీ

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులు రోజంతా రోడ్డుపైన ఆందోళనలు చేశారు. దీంతో దేశ రాజధానిలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.




ర్యాలీలో సోనమ్ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి ఆంగ్మో







# పాలకులకు 'పార్లమెంట్ మార్చ్' పెద్ద హెచ్చరిక

**లక్షమందిపైగా స్వచ్ఛందంగా తరలివచ్చిన విద్యార్థులు, యువత**
**ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అభినందన**
**పోలీసు లాఠీచార్జికి ఖండన**



**న్యూఢిల్లీ:** విద్యార్థులు, యువకులు లక్షమంది పైగా పాల్గొన్న 'పార్లమెంటు మార్చ్' పాలకపక్షానికి ఒక పెద్ద హెచ్చరిక అని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో విద్యార్థులు, యువతరంలో పెరుగుతున్న ఆవేదనను ఇకపై పాలకులు విస్మరించలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దేశ వ్యతిరేక విధానాలపై రైతు సంఘాలు,కార్మిక సంఘాలు ఇప్పటికే పోరాట మార్గంలో కొనసాగుతున్నాయని, ఈ తరుణంలో న్యాయంకోసం విద్యార్థులు సోమవారం చేపట్టిన ఈ ఉద్యమం ఎంతో స్వాగతించదగిన పరిణామమని, ఇది పాలకులకు ఒక హెచ్చరిక పిలుపు అని పేర్కొన్నారు. విద్యావ్యవస్థ ప్రక్షాళన, మంత్రి ప్రధాన్ రాజీనామా కోరుతూ పార్లమెంటుకు సోమవారం జరిగిన ప్రదర్శనకు భారీగా తరలివచ్చిన విద్యార్థులు, యువకులకు ఎఐటియుసి అభినందనలు తెలియజేసింది. ప్రదర్శకులపై విచక్షణారహితంగా చేసిన పోలీసు లాఠీచార్జీని తీవ్రంగా ఖండించింది. అమర్‌జీత్ కౌర్ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, భిన్న సంస్కృతులు, భాషలు మత విశ్వాసాలకు గౌరవం ఇస్తూనే, న్యాయం, సమానత్వం, అసమ్మతిని తెలియజేసే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛలకోసం జరిగే పోరాటాన్ని ఈనాడు జరిగిన పరిణామాలు ఖచ్చితంగా బలోపేతం చేస్తాయని ఉద్ఘాటించారు. పార్లమెంటు సమావేశాల మొదటిరోజున కాక్రోచ్ జనతాపార్టీతోపాటు విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన నిరసన ప్రదర్శనకు లక్షమందికిపైగా విద్యార్థులు, యువకులు స్వచ్ఛంధంగా తరలిరావడంపట్ల అభినందనలు తెలియజేశారు.

దేశ పరీక్షల విధానంలో అవకతవకలు, అక్రమాలు, నీట్ ప్రశ్నాపత్రాలు ముందుగానే బహిర్గతమైన తర్వాత 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సమస్యల పరిష్కారానికి న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గడచిన నెలరోజులుగా కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి)నాయకత్వంలో విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. వర్షాకాల సమావేశాల మొదటిరోజు పార్లమెంటు ప్రాంగణం వరకు ప్రదర్శన చేయాలని సిజెపితోపాటు విద్యార్థి,యువజన సంఘాలు ముందుగానే పిలుపు ఇచ్చాయి.దేశం నలుమూలల నుండి సామూహికంగా తరలివచ్చిన ప్రదర్శకులలో ఎక్కువమంది విద్యార్థులు, యువకులే ఉన్నారు. లోపభూయిష్టమైన విద్యావిధానం, వివిధ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ నియామక పరీక్షలలో అవకతవకలు, తీవ్ర అవినీతికి వ్యతిరేకంగా వీరంతా న్యూఢిల్లీలో ఏకమయ్యారని అమర్‌జీత్ కౌర్ తన ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం అసాధారణస్థాయికి చేరుకుంది, విద్యార్థులు, యువతరంలో అనిశ్చితి కూడా తీవ్ర ఆందోళనకరమైన అంశంగా మారింది,విద్యాశాఖామంత్రి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతూ ప్రముఖ విద్యావేత్త, శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌ఛుక్ గడచిన 20 రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు,ఆయనను బలవంతంగా నిరసన ప్రదేశం నుండి తొలగించడం కూడా విద్యార్థులలో తీవ్ర ఆందోళన పెంచింది, దేశంలో ఉన్న అదానీ, అంబానీ వంటి కొద్ది మంది ఎంపిక చేసిన కార్పొరేట్ శక్తులసేవలో, వారి ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం పని చేస్తోంది, అదేసమయంలో అమెరికా–యూరోపియన్ యూనియన్ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది అని ఆమె విమర్శించారు.

# సింగిల్ డిజిట్ ర్యాంకే లక్ష్యం



విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న పీజీఐ (పర్‌ఫర్‌మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్) ర్యాంకింగ్‌లో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో సింగిల్ డిజిట్ ర్యాంకు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా పిలుపునిచ్చారు. 'పాఠశాల విద్యా వ్యవస్థ పనితీరు' పట్ల జిల్లా స్థాయి బృందాలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ ఇనిస్టిట్యూట్‌లో రెండు రోజుల రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ యోగితా రాణా వర్చువల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఐ 2024–25లో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ, 2025–26 నాటికి 18వ ర్యాంకుకు చేరుకోవడం పట్ల విద్యాశాఖ అధికారులను, సిబ్బందిని అభినందించారు. పీజీఐ అనేది కేవలం ర్యాంకుల కోసం మాత్రమే కాదని, విద్యా వ్యవస్థలో లోపాలను గుర్తించి నాణ్యతను మెరుగుపరిచేందుకు ఉపయోగపడే సాధనమని సూచించారు. అనంతరం పీజీఐలో అత్యుత్తమ ప్రతిభ చూపిన జనగామ, మంచిర్యాల జిల్లాలతో పాటు ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వేలో ప్రతిభ చూపిన పెద్దపల్లి, వనపర్తి, నారాయణపేట జిల్లాల అధికారులను పాఠశాల విద్య శాఖ సంచాలకులు డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ సత్కరించారు. డేటా క్యాప్చరింగ్ ఫారమ్ నింపడంలో అధికారులు ఎంతో జాగ్రత్తగా ఉండాలని, కచ్చితత్వంతో కూడిన సమాచారమే రాష్ట్ర ర్యాంకింగ్‌ను ప్రభావితం చేస్తుందని ఆయన సూచించారు.

## బర్న్‌హామ్

(మొదటి పేజీ తరువాయి)

సమ్మతించారు. అనంతరం కొత్త ప్రధాన మంత్రి తన కార్యాలయం టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో తొలి కీలక ప్రసంగం చేయాల్సి ఉంది. కాగా స్టార్‌మర్ బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్ళేముందు టెన్ డౌనింగ్ స్ట్రీట్ వెలుపల మాట్లాడుతూ, "నా పని పూర్తయింది,బర్న్‌హామ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నా, ఆయనకు నా పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది,నేనెంతో సంతోషంతో, చిరునవ్వుతో వైదొలగుతున్నా, మనం సాధించిన విజయాలపట్ల ఎంతో గర్వంతో వెళుతున్నా"అని చెప్పారు. ఈ తర్వాత ఆయన మంత్రివర్గ సహచరులు,అధికారులు వరుసలో నిలబడి ఆయనకు అభినందనలు తెలియజేసి వీడ్కోలు పలికారు.

"గౌరవనీయులైన స్టార్‌మర్ సోమవారం ఉదయం రాజు ఛార్లెస్‌ను కలిశారు. ప్రధానమంత్రి పదవికి, ఫస్ట్ లార్డ్ ఆఫ్ ట్రెజరీ పదవికి రాజీనామా సమర్పించారు. ఆయన సంతోషంగా రాజీనామా ఆమోదించారు. ఆయన స్థానంలో బర్న్‌హామ్‌ను కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు" అని బకింగ్‌హామ్ ప్యాలెస్ ప్రతినిధి ఒకరు చెప్పారు. బర్న్‌హామ్ తన మంత్రివర్గ సభ్యుల పేర్లు ప్రకటించడం ద్వారా వెంటనే ప్రధానమంత్రి విధులు ప్రారంభిస్తారు.

బ్రిటన్‌కు మరింత స్వేచ్ఛను ఇస్తానని, స్థిరమైన,బాధ్యతాయుతమైన రాజకీయాలు చేసే వాతావరణం తెస్తానని, కొత్త రాజకీయ వ్యవస్థకు తెర తీస్తానని కొత్త ప్రధాన మంత్రి ఆండీ బర్న్‌హామ్ తన కొత్త ప్రణాళికలోని ఐదు అంశాలలో ఇప్పటికే స్పష్టం చేశారు.

దేశ ప్రజలపై ధరల భారాలు సడలించడంతోపాటు, దేశ రక్షణ వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దడం, అనిశ్చిత ప్రపంచం నేపథ్యంలో దేశంలో స్వయం సమృద్ధి సాధించడం, పార్టీలో అస్థిరతను తొలగించడం,టెన్‌డౌనింగ్‌స్ట్రీట్‌లో అధికారులు పరస్పర భిన్నమైన ప్రకటనలు చేయకుండా కట్టడి చేయడం వంటి విషయాలపై దృష్టి సారిస్తానని ఆయన చెబుతున్నారు. గడచిన శుక్రవారం (జులై 17) ఆయన లేబర్‌పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో లేబర్‌పార్టీ ఘన విజయం సాధించిన తర్వాత ఆ పార్టీ నుండి రెండో ప్రధానమంత్రిగా బర్న్‌హామ్ బాధ్యతలు చేపట్టగా, గడచిన నాలుగు సంవత్సరాలలో దేశానికి ఈయన ఐదవ ప్రధాన మంత్రి. పది సంవత్సరాలకాలంలో బ్రిటన్‌లో బర్న్‌హామ్‌తో కలిపి ఏడుగురు ప్రధానమంత్రులు ప్రధానమంత్రులు టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో బాధ్యతలు నిర్వహించారు.


## మళ్లీ మధ్యవర్తి ప్రయత్నాలు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందని చెప్పారు. అవగాహన ఒప్పందం అమలును ఇరాన్ నిలిపివేసిందా? అని ప్రశ్నించినప్పుడు ఇరాన్ వైఖరి మొదటినుండీ ఒకేవిధంగా ఉందని, తమ కట్టుబాటు మారలేదని చెప్పారు. ఎదుటిపక్షం తన బాధ్యతలు నిర్వర్తించినంతకాలం ఇరాన్ ఒప్పంద కట్టుబాట్లకు లోబడి ఉంటుందన్నారు. మినాబ్ పాఠశాలపై అమెరికా ఉద్దేశపూర్వకంగానే దాడి చేసి విద్యార్థులు,ఉపాధ్యాయులను హతమార్చిందనడంలో ఎలాంటి సందేహం లేదని ఉద్ఘాటించారు. దౌత్య పరిష్కారానికి అమెరికా సిద్ధంగా ఉందని దేశ విదేశాంగమంత్రి మార్కో రుబియో చెప్పిన విషయంపై స్పందిస్తూ, ఇలాంటి మాటలు ఆచరణలో చాలాసార్లు తాము పరీక్షించామని, ఇరాన్ సార్వభౌమాధికార రక్షణే తమ ధ్యేయమని బఖాయీ చెప్పారు. అమెరికా నిజమైన సంప్రదింపులు చేయడానికి బదులుగా తన డిమాండ్లను బలవంతంగా తమపై రుద్దడం, భయపెట్టడం, బెదిరించడం, హెచ్చరికలు చేయడం, ఆంక్షలు విధించడం వంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

గడచిన పది రోజులుగా అమెరికా–ఇరాన్ మధ్య ఆగకుండా పశ్చిమ ఆసియాలో పరస్పర దాడుల బల ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సహా గల్ఫ్ దేశాలు బాంబు దాడులతో దద్దరిల్లుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మధ్యవర్తులు చర్చలకు ప్రతిపాదనలు చేస్తున్నారని ఊహాగానాలు వస్తున్న తరుణంలో వారంతపు మీడియా సమావేశంలో పాత్రికేయులు అడిగిన ప్రశ్నలపై బఖాయీ సానుకూలంగా స్పందించారు. మధ్యవర్తుల ప్రయత్నాలు నిజమేనని, తాము కూడా దౌత్య యత్నాలు చేస్తున్నామని చెప్పారు.

ఖతార్ మాజీ ఎమిర్ షేక్ హమద్ బిన్ ఖలీఫా అల్ థానీ మరణించిన సందర్భంగా సంతాపం తెలియజేసేందుకు ఇటీవల ఆ దేశంలో పర్యటించిన సందర్భంగా ఇస్మాయిల్ బఖాయీ ఖతార్ నాయకులతో యుద్ధ ఉద్రిక్తతల తగ్గింపు విషయంపై సంప్రదింపులు జరిపారు. అమెరికా–ఇరాన్ మధ్య పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగకుండా మధ్యవర్తులు తెరవెనుక నిరంతరం కృషి చేస్తున్నారని దీన్నిబట్టి అర్థమవుతోందని బఖాయీ అన్నారు.ఐతే అదే సమయంలో, "అమెరికా నేరాలు అడ్డుకోవడానికి జరిగే ఎలాంటి ప్రయత్నాలనూఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆపదు" అని కూడా చెప్పారు. ఒకవైపు తమ దళాలు అమెరికాదురాక్రమణ చర్యలు అడ్డుకునేందుకు,ప్రతిఘటించేందుకు కృషి చేస్తుండగా, దౌత్య యంత్రాంగం కూడా తన ప్రయత్నాల్లో నిమగ్నమైందన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాతో తమ దేశం ప్రస్తుతం పూర్తిస్థాయి యుద్ధంలో నిమగ్నమై ఉందని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ప్రకటించారు . మనం వాస్తవికంగా ఉండాలి, ఈ సంఘర్షణల తాలూకూ ప్రతికూల పరిణామాలను అంగీకరించాలి అన్నారు




## విలీనం తథ్యం

(మొదటి పేజీ తరువాయి)

బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళాభవన్‌లో సోమవారం టిజిఎస్ ఆర్‌టిసి ఉద్యోగుల చేయూత ద్వారా సేకరించిన రూ.90,85,500 లక్షల చెక్కును దివంగత శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డితో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి ఒక కుటుంబమని, ఉద్యోగులు ఐక్యతను చాటుతూ శంకర్‌రావు కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమన్నారు.

**ప్రయాణికులే ఆర్‌టిసికి దేవుళ్లు**

మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెల ప్రభుత్వం రూ.300 కోట్లకు పైగా ఆర్‌టిసికి అందిస్తోందని, దీంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు సంస్థ ఆర్థికంగా బలోపేతం అవుతోందన్నారు. ఆర్‌టిసి అభివృద్ధి కోసం కొత్త బస్ టెర్మినల్స్, ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం, మెట్రో, ఎంఎంటిఎస్ అనుసంధానం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. శంకర్‌రావు కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని, ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించేందుకు అవసరమైన నిబంధనల సడలింపుపై ప్రభుత్వ అనుమతి తీసుకుని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వై.నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులే ఆర్‌టిసికి దేవుళ్లని, ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మరింత మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయి అధికారులూ ఉద్యోగులతో సానుకూలంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగులు, యూనియన్ సంఘాల నాయకులు హాజరయ్యారు.

**ఆర్‌టిసి విలీనమే శంకర్ గౌడ్ చివరి కోరిక : హేమలత**

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడమే శంకర్‌గౌడ్ చివరి కోరిక అని, విలీనంతోనే ఆయన ఆత్మ శాంతిస్తుందని శంకర్‌గౌడ్ సతీమణి హేమలత అన్నారు. తమ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలిచిన ఆర్‌టిసి ఉద్యోగులందరికీ ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com